www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 26-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 10 | శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం,బహుళ పక్షం, తిథి: త్రయోదశి ఉ.8:28, చతుర్దశి తె.4:49 వరకు, నక్షత్రం: ఉత్తరభాద్ర ఉ.6:27, రేవతి తె. 3:39 వరకు, వర్జ్యం: సా.5:03-6:27, దుర్ముహూర్తం: ఉ.5:55-7:36, అమృతఘడియలు: రా.1:31-2:56 వరకు, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: 5:55, సూర్యాస్తమయం: 6:30 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

దేశీయ అణు విద్యుత్ ప్లాంట్లలోకి 49 శాతం విదేశీ పెట్టుబడులు!

» అనుమతించే యోచనలో కేంద్రం

న్యూఢిల్లీ: దేశ అణు విద్యుత్ రంగంలోకి విదేశీ సంస్థలకు గేట్లు తెరిచేందుకు భారత ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దేశీయ అణు విద్యుదుత్పత్తి ప్లాం ట్లలో విదేశీ సంస్థలు 49 శాతం వరకు వాటాలను కొనుగో లు చేసేందుకు అనుమతించే అవకాశం ఉందని ముగ్గురు ప్రభుత్వ ఉన్నతాధికారులు వెల్లడించినట్లు రాయిటర్స్ వార్తా కథనం వెల్లడించింది. విదేశీ పెట్టుబడులు ఈ రంగానికి ఊతమివ్వడంతో పాటు కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యాల సాధనకు దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. దేశీయ అణురంగంలో విదేశీ పెట్టుబడులకు సంబంధించిన నిబంధనలను సడలించాలని ప్రభుత్వం 2023 నుంచే ప్రయత్నాలు చేస్తోంది. కాలుష్యకారక బొగ్గు ఆధారిత విద్యుదుత్పత్తికి ప్రత్యామ్నాయంగా శుద్ధ ఇంధన ఉత్పత్తిని పెంచాలని ప్రభుత్వం కొంతకాలంగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా అణు విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచాలనుకుంటోంది. కానీ, ఇందుకు పెద్దఎత్తున పెట్టుబడులు అవసరం. విదేశీ సంస్థలను అనుమతించడం ద్వారానే ఇది సాధ్యమని కేంద్రం భావిస్తోంది. 2047 నాటికి దేశీయ అణు విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 100 గిగా వాట్ల స్థాయికి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

రిలయన్స్ @ రూ.10 లక్షల కోట్లు

గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ స్థూల ఆదాయమిది.. ఈ ఘనత సాధించిన తొలి కంపెనీ

» క్యూ4 లాభం రూ.19,407 కోట్లు
» రెవెన్యూ రూ.2.64 లక్షల కోట్లు
» ఒక్కో షేరుకు రూ.5.5 డివిడెండ్
» రూ.25,000 కోట్ల సమీకరణ

ముంబై: దేశీయ ప్రైవేట్ రంగ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి. మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఆర్ఐఎల్ ఏకీకృత నికర లాభం రూ.19,407 కోట్లకు (ఒక్కో షేరుకు రూ.14.34) చేరింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి నమోదైన రూ.18,951 కోట్ల (ఒక్కో షేరుకు రూ.14) లాభంతో పోలిస్తే 2.4 శాతం పెరిగింది. 2024-25లోనే డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఆర్జించిన రూ.18,540 కోట్ల లాభంతో పోల్చినా మెరుగైన వృద్ధిని నమోదు చేసింది.

ఆయిల్ అండ్ కెమికల్స్ (ఓ2సీ) వ్యాపార పనితీరు బలహీనంగానే ఉన్నప్పటికీ రిలయన్స్ జియో, రిటైల్ వ్యాపారాల్లో జోరు లాభం వృద్ధికి దోహదపడింది. కాగా, క్యూ4లో ఆర్ఐఎల్ ఆదాయం వార్షిక ప్రాతిపదికన దాదాపు 10 శాతం వృద్ధి చెంది రూ.2,64,573 కోట్లకు పెరిగింది. ఎబిటా 3.6 శాతం పెరుగుదలతో రూ.48,737 కోట్లుగా నమోదైంది.

గత ఆర్థిక సంవత్సరాని (2024-25)కి ఆర్ఐఎల్ లాభం 2.9 శాతం పెరిగి రూ.81,309 కోట్లుగా నమోదైంది.



స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 7.1 శాతం వృద్ధి చెంది రూ.10.71 లక్షల కోట్లకు పెరిగింది. 2024-25లో రూ.10 లక్షలకు పైగా నెట్‌వర్త్ సాధించిన తొలి కంపెనీ రిలయన్సే. గత ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.5.5 డివిడెండ్‌ను ప్రకటించింది. అలాగే, నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.25,000 కోట్ల సమీకరణ ప్రణాళికకు బోర్డు ఆమోదం తెలిపిందని కంపెనీ వెల్లడించింది.

జియో ప్లాట్‌ఫామ్స్: టెలికాం సంస్థ రిలయన్స్ జియోతో పాటు ఇతర డిజిటల్ వ్యాపారాలను ఒకే గొడుగు కిందికి చేర్చి ఏర్పాటు చేసిన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ క్యూ4 లాభం 26 శాతం వృద్ధితో రూ.7,022 కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.26,120 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఈ మార్చి 31 నాటికి రిలయన్స్ జియో కస్టమర్లు 48.82 కోట్లకు చేరగా.. ఒక్కో వినియోగదారు నుంచి సగటు ఆదాయం (ఆర్పూ) రూ.206.2కు పెరిగింది.

రిలయన్స్ రిటైల్: ఈ మార్చి త్రైమాసికంలో రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ లాభం 29 శాతం పెరిగి రూ.3,545 కోట్లకు చేరింది. గడిచిన మూడు నెలల్లో కొత్తగా 238 స్టోర్లను ప్రారంభించినట్లు, మొత్తం స్టోర్ల సంఖ్య 19,340కి చేరినట్లు కంపెనీ వెల్లడించింది.

ఓ2సీ: క్యూ4లో ఓ2సీ విభాగ ఆదాయం 15.4 శాతం వృద్ధితో రూ.1,64,613 కోట్లకు పెరిగినప్పటికీ, ఎబిటా మాత్రం 10 శాతం తగ్గి రూ.15,080 కోట్లకు పడిపోయింది. ముడి చమురు శుద్ధి, పెట్రోకెమికల్ మార్జిన్లు తగ్గడం ఇందుకు కారణమైంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఓ2సీ ఆదాయం 11 శాతం వృద్ధితో సరికొత్త రికార్డు స్థాయి రూ.6,26,921 కోట్లకు చేరింది.

ఆయిల్ అండ్ గ్యాస్: మార్చి త్రైమాసికంలో ఈ విభాగ ఆదాయం 0.4 శాతం తగ్గి రూ.6,440 కోట్లకు, ఎబిటా 8.6 శాతం క్షీణించి రూ.5,123 కోట్లకు పరిమితమైంది. వార్షికాదాయం రూ.25,211 కోట్లు, ఎబిటా రూ.21,188 కోట్లుగా నమోదైంది. గత త్రైమాసికంలో కేజీ డీ6 బ్లాక్ నుంచి రోజుకు 26.73 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల సహజ వాయువును, 19 వేల పీపాల చమురును ఉత్పత్తి చేసినట్లు కంపెనీ తెలిపింది.

జియోస్టార్: డీస్నీ హాట్‌స్టార్, జియో సినిమా ఓటీటీ యాప్‌ల విలీనం ద్వారా ఏర్పాటు చేసిన జియోస్టార్ ఆదాయం క్యూ4లో రూ.10,006 కోట్లుగా, ఎబిటా రూ.774 కోట్లుగా నమోదైంది. జియోస్టార్ దేశంలో అతిపెద్ద ఓటీటీ వేదికగా అవతరించిందని, దీన్ని విడుదల చేసిన ఐదు వారాల్లోనే పెయిడ్ చందాదారుల సంఖ్య 10 కోట్లు దాటిందని రిలయన్స్ తెలిపింది.

మారుతి సుజుకీ లాభం రూ.3,911 కోట్లు

ఒక్కో షేరుకు రూ. 135 డివిడెండ్

న్యూఢిల్లీ: గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) కన్సాలిడేటెడ్ నికర లాభం 1 శాతం క్షీణించి రూ.3,911 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.3,952 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో వ్యయాలు గణనీయంగా పెరగటం పనితీరును దెబ్బతీసిందని తెలిపింది. మార్చి త్రైమాసికంలో మొత్తం ఆదాయం మాత్రం రూ.38,471 కోట్ల నుంచి రూ.40,920 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు కూడా 8.5 శాతం పెరుగుదలతో రూ.34,624 కోట్లుగా నమోదైనట్లు మారుతి సుజుకీ తెలిపింది.

స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ నికర లాభం రూ.3,878 కోట్ల నుంచి రూ.3,711 కోట్లకు తగ్గగా నికర ఆదాయం రూ.36,697 కోట్ల నుంచి రూ.38,849 కోట్లకు పెరిగింది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.1,52,913 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.14,500 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. కాగా గడచిన ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ డైరెక్టర్ల బోర్డు ప్రతి షేరుకు రూ.135 డివిడెండ్‌ను సిఫారసు చేసింది.

ఎల్ఐసీ హౌసింగ్ వడ్డీ రేట్లు తగ్గింపు

న్యూఢిల్లీ: ఎల్ఐసీ అనుబంధ సంస్థ ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ తన గృహ రుణాల కనీస వడ్డీ రేట్లను 8.25 శాతం నుంచి 8 శాతానికి తగ్గించింది. ఈ నెల 28 నుంచి ఈ తగ్గింపు అమల్లోకి వస్తుందని తెలిపింది. ఆర్‌బీఐ ఇటీవల కీలక రెపో వడ్డీ రేటును పావు శాతం తగ్గించింది. అందులో భాగంగానే ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ తన గృహ రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించింది.

వార్ వర్రీస్!

» భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు..
» సెన్సెక్స్ ఒకదశలో 1,196 పాయింట్లు డౌన్
» చివరికి 589 పాయింట్ల నష్టంతో సరి
» 2 రోజుల్లో రూ.8.88 లక్షల కోట్ల నష్టం



ముంబై: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై తీవ్రవాదుల దాడి అనంతరం భారత్-పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇది రెండు దేశాల మధ్య యుద్ధానికి దారి తీయవచ్చన్న భయాలు శుక్రవారం మార్కెట్లను కుదిపేశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్ కొద్దిసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో సూచీ 1,195.62 పాయింట్లు (1.49 శాతం) క్షీణించి 78,605.81 వద్దకు జారుకుంది. చివరికి 588.90 పాయింట్లు (0.74 శాతం) నష్టంతో 79,212.53 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 207.35 పాయింట్లు (0.86 శాతం) పతనమై 24,039.35 వద్ద ముగిసింది. సూచీలు నష్టపోవడం వరుసగా ఇది రెండో రోజు. ఈ రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 903.96 పాయింట్లు (1.12 శాతం) కోల్పోయింది. ఈక్విటీ మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8.88 లక్షల కోట్లు తగ్గి రూ.421.58 లక్షల కోట్లకు (4.93 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

● ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 8 పైసలు తగ్గి రూ.85.41 వద్ద ముగిసింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ మడిచమురు పీపా ధర ఒక దశలో 0.66 శాతం తగ్గి 66.11 డాలర్లకు దిగివచ్చింది.

పబ్లిక్ ఇష్యూకు కెనరా రొబెకో ఏఎంసీ

కెనరా రొబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓలో భాగంగా ప్రమోటర్లకు చెందిన 4.98 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనున్నట్లు ముసాయిదా పత్రాల్లో కంపెనీ వెల్లడించింది. కంపెనీ ప్రమోటర్లైన కెనరా బ్యాంక్ 2.59 కోట్ల షేర్లు, ఓరిక్స్ కార్పొరేషన్ యూరప్ (గతంలో రొబెకో గ్రూప్) 2.39 కోట్ల షేర్లను విక్రయించనున్నాయి. కెనరా రొబెకో ఏఎంసీలో కెనరా బ్యాంక్ 51 శాతం, ఓరిక్స్ కార్పొరేషన్ 49 శాతం వాటా కలిగి ఉన్నాయి.

ప్రెస్టీజ్ హాస్పిటాలిటీ రూ.2,700 కోట్ల ఐపీఓ

ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ అనుబంధ విభాగమైన ప్రెస్టీజ్ హాస్పిటాలిటీ వెంచర్స్ లిమిటెడ్ కూడా ఐపీఓకు రాబోతోంది. ఐపీఓ ద్వారా రూ.2,700 కోట్లు సేకరించేందుకు అనుమతి కోరుతూ సెబీకి డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది. అందులో రూ.1,700 కోట్ల తాజా ఈక్విటీ జారీ ద్వారా, మరో రూ.1,000 కోట్లు ప్రమోటరైన ప్రెస్టీజ్ ఎస్టేట్స్ వాటా విక్రయం ద్వారా సమీకరించనున్నట్లు సంస్థ తెలిపింది.

ఒలెక్ట్రా నుంచి 'జీఎఫ్ఆర్‌పీ రీబార్స్'

» స్టీల్ కంటే రెండింతల ధృడత్వం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) అనుబంధ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ మరో వినూత్న ఉత్పత్తిని అభివృద్ధి చేసింది. నిర్మాణ రంగానికి అవసరమైన జీఎఫ్ఆర్‌పీ రీబార్స్‌ను (గ్లాస్ ఫైబర్ రీఇన్‌ఫోర్స్‌డ్ పాలిమర్ రీబార్) అభివృద్ధి చేసింది. సంప్రదాయ స్టీల్ రీఇన్‌ఫోర్స్‌మెంట్‌తో పోలిస్తే ఈ బార్స్ రెండింతల ధృడత్వం, నాలుగింతలు తేలికగా ఉంటాయని తెలిపింది. ఎంఈఐఎల్ బడ్జెట్ మీట్ సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో ఎంఈఐఎల్ ఎండీ పీవీ కృష్ణా రెడ్డి ఈ బార్స్‌ను విడుదల చేశారు. ఈసీఆర్ గ్లాస్, ఇపోక్సీ రెజిన్‌లతో ఈ జీఎఫ్ఆర్‌పీ రీబార్స్‌ను కంపెనీ అభివృద్ధి చేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ తుప్పుపట్టక పోవడం, విద్యుత్ ప్రసరించకపోవడం, అయస్కాంత ప్రభావానికి లోనుకాక పోవడం, నీటిలో తడిచినా పాడుకాకపోవడం ఈ బార్స్ ప్రత్యేకతలు.

బీఓఎం లాభంలో 23% వృద్ధి

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం).. మార్చితో ముగిసిన చివరి త్రైమాసికం (క్యూ4)లో రూ.1,493 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.1,218 కోట్లు)తో పోల్చితే లాభం 23 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసిక కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.6,488 కోట్ల నుంచి రూ.7,711 కోట్లకు పెరిగింది. స్థూల ఎన్‌పీఏలు 1.74 శాతం, నికర ఎన్‌పీఏలు 0.18 శాతంగా ఉన్నాయి.

జనవరి 28 నుంచి వింగ్స్ ఇండియా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ మరోసారి వింగ్స్ ఇండియా వైమానిక ప్రదర్శనకు వేదికవుతోంది. వింగ్స్ ఇండియా- 2026 పేరుతో వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు ఈ ప్రదర్శన జరగనుంది. కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, భారతీయ విమానాశ్రయాల సంస్థ (ఏఏఐ), ఫిక్కీ సంయుక్తంగా రెండేళ్లకు ఒకసారి హైదరాబాద్‌లో ఈ ప్రదర్శన నిర్వహిస్తూ వస్తున్నాయి.

ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.22.26 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25) నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు దాదాపుగా నిర్ణీత లక్ష్యాన్ని చేరాయి. మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి నికరంగా రూ.22.37 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్నులు వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే రూ.22.26 లక్షల కోట్లు వసూలు చేయడం ద్వారా 99.51 శాతం లక్ష్యాన్ని సాధించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 13.57 శాతం ఎక్కువ. అయితే ఇది తాత్కాలిక అంచనా మాత్రమేనని, ఇంకా పూర్తి రిఫండ్ వివరాలు అందాల్సి ఉందని ప్రభుత్వం తెలిపింది. ఈ తాత్కాలిక అంచనాల ప్రకారం చూసినా 2024-25లో ఆదాయ పన్ను శాఖ గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.4,76,743 కోట్ల రిఫండ్స్ జారీ చేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	425
వరంగల్	407	గోదావరి	415
చిత్తూరు	460	విశాఖపట్నం	430
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	112
వరంగల్	120	గుంటూరు	115
కరీంనగర్	120	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	90
కర్నూలు	120	నెల్లూరు	95
విశాఖపట్నం	111	అనంతపురం	95
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,200 ▼	90,000 ▼	1,10,900 ▼
విజయవాడ	98,600 ▼	93,500 ▼	99,000 ▼
విశాఖపట్నం	98,240 ▼	90,050 ▼	1,10,900 ▲
రాజమండ్రి	98,240 ▼	90,050 ▼	1,00,500 ▼
ప్రొద్దుటూరు	97,600 ▲	89,880 ▲	1,00,000 ▲
ముంబై	95,631 ▼	87,598 ▼	97,684 ▲

అమ్మపైనా విమర్శలా?

» పహల్గాం దాడికి ముందే పాక్ అథ్లెట్‌కు ఆహ్వానం
» నీరజ్ చోప్రా ఆవేదన



న్యూఢిల్లీ : 'నీరజ్ చోప్రా క్లాసిక్' పేరిట వచ్చే నెల 24న బెంగళూరులో అంతర్జాతీయ జావెలిన్ త్రో పోటీ జరగనుంది. భారత స్టార్ నీరజ్ చోప్రా స్వయంగా నిర్వహిస్తున్న ఈ ఈవెంట్‌లో ప్రఖ్యాత అంతర్జాతీయ జావెలిన్ త్రోయర్లు బరిలోకి దిగుతున్నారు. ఈ పోటీకి పాకిస్థాన్‌కు చెందిన పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత అర్షద్ నదీమ్‌నూ నీరజ్ ఆహ్వానించాడు. దీంతో తన కుటుంబంపై వ్యక్తిగత దూషణకు దిగడంపట్ల నీరజ్ ఆవేదన వ్యక్తం జేశాడు. ఈమేరకు శుక్రవారం అతడు ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. 'అర్షద్‌ను ఆహ్వానించడంపై నాపై ఎన్నో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో నా కుటుంబాన్నీ వదలడంలేదు. అసభ్య పదజాలంతో నిందిస్తున్నారు. టెర్రరిస్టుల దాడికి రెండు రోజుల ముందే అథ్లెటందరికీ ఆహ్వానాలు పంపాం. 48 గంటల్లో ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నాయి. నా తల్లిని కూడా లక్ష్యంగా చేసుకొని విమర్శించడం ఎంతో బాధిస్తోంది. గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో అర్షద్ పసిడి పతకం గెలిచినప్పుడు..అతడు కూడా నా కొడుకులాంటివాడేనని అమ్మ చెప్పింది. అప్పట్లో అమ్మపై అంతా ప్రశంసలు కురిపించారు. కానీ సంవత్సరంలో ఎంత తేడా ! ప్రజలు అంత త్వరగా తమ అభిప్రాయాల్ని ఎలా మార్చుకుంటారో అర్థం కావడంలేదు. కారణం లేకుండా నన్ను, నా కుటుంబాన్ని తిడుతున్న వారికి వివరణ ఇవ్వాల్సి రావడం విచారకరం' అని ఆర్మీలో పని చేస్తున్న నీరజ్ వాపోయాడు.

రైజర్స్ రేసులోనే..

ఆదుకున్న ఇషాన్, కమిందు
చెన్నై ఆశలు గల్లంతే..
హర్షల్‌కు నాలుగు వికెట్లు




1 చెపాక్‌లో తొలిసారి చెన్నైని ఓడించిన సన్‌రైజర్స్

4 కెరీర్‌లో 400 టీ20 మ్యాచ్‌లాడిన నాలుగో భారత ఆటగాడిగా ధోనీ. రోహిత్ (456), దినేశ్ కార్తీక్ (412), విరాట్ (408) ముందున్నారు.

చెన్నై: ప్లేఆఫ్స్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఇరు జట్లదీ కచ్చితంగా గెలిచి తీరాల్సిన పరిస్థితి. ఈ దశలో సన్‌రైజర్స్ హైదరాబాద్ కాస్త తడబడినా కీలక విజయం అందుకుంది. ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 44), కమిందు మెండిస్ (22 బంతుల్లో 3 ఫోర్లతో 32 నాటౌట్) సమయోచిత బ్యాటింగ్‌తో 5 వికెట్ల తేడాతో గట్టెక్కించారు. అటు సొంత మైదానంలోనూ చెన్నై సూపర్ కింగ్స్ మరోసారి చేతులెత్తేసింది. బౌలర్లు కాస్త ఆశలు రేపినా.. చివర్లో తడబాటుతో చెపాక్‌లో వరుసగా నాలుగో ఓటమిని చవిచూసింది. దీంతో ధోనీ సేన మిగిలిన ఐదు మ్యాచ్‌ల్లో గెలిచినా ప్లేఆఫ్స్ బెర్త్ కష్టమే. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా చెన్నై 19.5 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌటైంది. బ్రెవిస్ (25 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 42), ఆయుష్ మాత్రే (19 బంతుల్లో 6 ఫోర్లతో 30), దీపక్ హుడా (21 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్‌తో 22) రాణించారు. హర్షల్‌కు 4, కమిన్స్ ఉనాద్కట్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో సన్‌రైజర్స్ 18.4 ఓవర్లలో 5 వికెట్లకు 155 రన్స్ చేసి నెగ్గింది. హెడ్ (19), అనికేత్ (19), నితీశ్ (19 నాటౌట్) ఆకట్టుకున్నారు. నూర్‌కు 2 వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా హర్షల్ నిలిచాడు.

ఆరంభంలో తడబడినా..: స్వల్ప ఛేదన.. పైగా మంచు ప్రభావం కూడా ఎక్కువే ఉండడంతో సన్‌రైజర్స్ సునాయాసంగా మ్యాచ్‌ను ముగిస్తుందని అంతా భావించారు. కానీ స్లో పిచ్‌పై సీఎస్‌కే బౌలర్లు పట్టు వదల్లేదు. పరుగులను కట్టడి చేయడంతో పాటు వరుస విరామాల్లో వికెట్లు తీశారు. అయితే ఇషాన్‌తో పాటు మిడిలార్డర్‌లో కమిందు, నితీశ్ రాణించడంతో ఊపిరిపీల్చుకుంది. అంతకుముందు ఇన్నింగ్స్ రెండో బంతికే ఓపెనర్ అభిషేక్‌ను పేసర్ ఖలీల్ డకౌట్ చేశాడు. ఇక మరో ఓపెనర్ హెడ్‌ను అన్షుల్ బౌల్డ్ చేయడంతో పవర్‌ప్లేలో జట్టు 37/2 స్కోరు మాత్రమే చేసింది. ఆ తర్వాత ప్రమాదకర క్లాసెన్ (7)ను జడ్డూ అవుట్ చేయడంతో రైజర్స్ షాక్‌కు గురైంది. ఈ దశలో ఇషాన్‌కు జత కలిసిన అనికేత్ కాసేపు పోరాడాడు. చక్కగా కుదురుకున్న ఈ జోడీని నూర్ వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేర్చడంతో సీఎస్‌కే పోటీలోకి వచ్చినట్టయ్యింది. నాలుగో వికెట్‌కు వీరి మధ్య 36 పరుగులు జత చేరాయి. అయితే డెత్ ఓవర్లలో బౌలర్లు లయ తప్పడంతో రైజర్స్ పని సులువైంది. కమిందు, నితీశ్ ఇబ్బంది లేకుండా ఆడేస్తూ సులువుగా బౌండరీలు రాబట్టారు. దీంతో మరో 8 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

ఆదుకున్న బ్రెవిస్: టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు బ్యాటింగ్ ఎప్పటిలాగే పేలవంగా సాగింది. వీరి ఇన్నింగ్స్‌లో మొదట ఓపెనర్ ఆయుష్ మాత్రే.. మధ్య ఓవర్లలో బ్రెవిస్ జోరు తప్ప చెప్పుకోవడానికేమీ లేదు. ఇక సీనియర్ ఆటగాళ్లు జడేజా (21), దూబే (12), ధోనీ (6) కీలక సమయాల్లో వెనుదిరగడంతో ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ రషీద్ (0)ను పేసర్ షమి అవుట్ చేయగా, సామ్ కర్రాన్ (9) వన్‌డౌన్‌లో బరిలోకి దిగాడు. మాత్రే జోరుతో పవర్‌ప్లేలో 50 పరుగులు సాధించింది. అయితే అప్పటికే వరుస ఓవర్లలో కర్రాన్, మాత్రే పెవిలియన్‌కు చేరారు. ఇక జడ్డూ పదో ఓవర్‌లో కమిందుకు చిక్కాడు. 74/4తో ఇబ్బందుల్లో పడిన జట్టును బ్రెవిస్ ఆదుకున్నాడు. మరో ఎండ్‌లో దూబే ఉన్నా రైజర్స్ బౌలర్లు కట్టడి చేశారు. కానీ సీఎస్‌కే తరఫున తొలి మ్యాచ్ ఆడిన బ్రెవిస్ మాత్రం తన సహజ శైలిలో చెలరేగాడు. దీనికితోడు 12వ ఓవర్‌లో మూడు సిక్సర్లతో 20 పరుగులందించాడు. ఆ వెంటనే హర్షల్ ఓవర్‌లోనూ భారీ సిక్స్ బాదినా కమిందు కళ్లు చెదిరే క్యాచ్‌తో వెనుదిరగాల్సి వచ్చింది. ఆ తర్వాత భారీ షాట్‌కు వెళ్లి దూబే.. కాసేపటికే ధోనీ (6) పెవిలియన్‌కు చేరి ఫ్యాన్స్‌ను నిరాశపరిచారు. టెయిలెండర్లను హర్షల్ కుదురుకోనీయలేదు. చివర్లో దీపక్ హుడా కాస్సిన్ని పరుగులు జత చేయడంతో స్కోరు 150కి చేరగలిగింది.



పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.ర.రే
గుజరాత్	8	6	2	0	12	1.104
ఢిల్లీ	8	6	2	0	12	0.657
బెంగళూరు	9	6	3	0	12	0.482
ముంబై	9	5	4	0	10	0.673
పంజాబ్	8	5	3	0	10	0.177
లఖ్‌నవూ	9	5	4	0	10	-0.054
కోల్‌కతా	8	3	5	0	6	0.212
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
రాజస్థాన్	9	2	7	0	4	-0.625
చెన్నై	9	2	7	0	4	-1.302

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర.రే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

చెన్నై: షేక్ రషీద్ (సి) అభిషేక్ (బి) షమి 0, ఆయుష్ మాత్రే (సి) ఇషాన్ (బి) కమిన్స్ 30, సామ్ కర్రాన్ (సి) అనికేత్ (బి) హర్షల్ 9, జడేజా (బి) మెండిస్ 21, బ్రెవిస్ (సి) మెండిస్ (బి) హర్షల్ 42, శివమ్ దూబే (సి) అభిషేక్ (బి) ఉనాద్కట్ 12, దీపక్ హుడా (సి) అభిషేక్ (బి) ఉనాద్కట్ 22, ధోనీ (సి) అభిషేక్ (బి) హర్షల్ 6, అన్షుల్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 2, నూర్ అహ్మద్ (సి) షమి (బి) హర్షల్ 2, ఖలీల్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 19.5 ఓవర్లలో 154 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-0, 2-39, 3-47, 4-74, 5-114, 6-118, 7-131, 8-134, 9-137, 10-154; **బౌలింగ్:** షమి 3-0-28-1, కమిన్స్ 4-0-21-2, జైదేవ్ ఉనాద్కట్ 2.5-0-21-2, హర్షల్ పటేల్ 4-0-28-4, జీషన్ అన్సారి 3-0-27-0, కమిందు మెండిస్ 3-0-26-1.

సన్‌రైజర్స్: అభిషేక్ (సి) ఆయుష్ (బి) ఖలీల్ 0, హెడ్ (బి) అన్షుల్ 19, ఇషాన్ (సి) కర్రాన్ (బి) నూర్ 44, క్లాసెన్ (సి) హుడా (బి) జడేజా 7, అనికేత్ (సి) హుడా (బి) నూర్ 19, మెండిస్ (నాటౌట్) 32, నితీశ్ (నాటౌట్) 19, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 18.4 ఓవర్లలో 155/5; వికెట్ల పతనం:** 1-0, 2-37, 3-54, 4-90, 5-106; **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 3-0-21-1, అన్షుల్ 3-0-16-1, నూర్ అహ్మద్ 4-0-42-2, జడేజా 3.4-0-22-1, కర్రాన్ 2-0-25-0, పతిరన 3-0-27-0.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్	వేదిక కోల్‌కతా
కోల్‌కతా X పంజాబ్	రా.7.30 నుంచి



'ఐసీసీ' గ్రూప్ దశలోనూ కష్టమే?

భారత్ X పాక్ మ్యాచ్‌లపై ఊహాగానాలు

న్యూఢిల్లీ: చాలా ఏళ్లుగా భారత్-పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదు. తాజాగా పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఇకముందు కూడా తలపడేది లేదని బీసీసీఐ స్పష్టం చేసింది. అయితే ఐసీసీ వరల్డ్ కప్, చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌ల్లో ఈ దాయాది జట్లను ఒకే గ్రూప్‌లో ఆడించడం పరిపాటి. టోర్నీలకు క్రేజ్ తెప్పించడంతోపాటు ఆర్థికంగాకూ అధిక ఆదాయం లభిస్తుందనే భావనలో ఐసీసీ ఇలాంటి షెడ్యూల్‌ను ఏర్పాటు చేస్తుంటుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఇకముందు పాక్‌తో గ్రూప్ దశలోనూ తలపడవద్దని బోర్డు భావిస్తోందని, ఇప్పటికే ఐసీసీకి కూడా లేఖ రాసినట్టు కథనాలు వెలువడ్డాయి. బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు ఇదే విషయాన్ని ప్రస్తావించారు. 'ప్రస్తుతానికైతే అలాంటి వార్తల్లో నిజం లేదు. భవిష్యత్ గురించి ఇప్పుడే చెప్పలేం' అని బోర్డు అధికారి తేల్చాడు. పురుషుల విభాగంలో వచ్చే ఏడాది టీ20 వరల్డ్‌కప్ ఉండగా.. ఈ ఏడాది సెప్టెంబరు నుంచి మహిళల వరల్డ్‌కప్ జరుగనుంది. ఇందులో భారత్-పాక్ మ్యాచ్‌లను తటస్థ వేదికపై ఆడిస్తారా? లేక రద్దు చేస్తారా? అనేది చూడాలి.

పాక్ హాకీ జట్టు పరిస్థితేంటి?

పాక్ జాతీయులకు వీసా నిలిపివేతతో భారత్‌లో జరిగే ఆసియాకప్‌లో ఆ దేశ హాకీ జట్టు ఆడేది సందేహం నెలకొంది. ఆగస్టు-సెప్టెంబరులో ఈ టోర్నీ జరుగుతుంది.

సెమీస్‌లో బాక్సర్లు ఖుషీ, తికమ్

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. బాలికల అండర్-17 విభాగంలో ఖుషీ చాంద్, బాలుర అండర్-17 కేటగిరిలో తికమ్ సింగ్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లారు. 46 కిలోల విభాగం క్వార్టర్స్‌లో గుయెన్ తి హాంగ్ ఎన్ (వియత్నాం)పై ఖుషి, ఓత్‌మన్ దియాబ్ (పాలస్తీనా)పై తికమ్ విజయం సాధించారు. వీరితో పాటు మిగతా భారత బాక్సర్లలో బాలుర విభాగం నుంచి అంబేకర్ మీటీ (48 కిలోలు), ఉద్ధమ్ సింగ్ (54 కి), రాహుల్ గారియా (57కి), అమన్ దేవ్ (50 కి).. బాలికల్లో జియా (48 కి), జన్నత్ (54 కి) కూడా సెమీస్‌లో ప్రవేశించారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 26-4-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

ఏయూ @ 100

నేటి నుంచి ఏడాది పాటు శతాబ్ది వేడుకలు

1926 ఏప్రిల్ 26న బెజవాడలో ఏర్పాటు


1930లో విశాఖపట్నానికి తరలింపు

దేశంలోని పురాతన వర్సిటీల్లో ఒకటి

సీవీ రామన్, సీఆర్‌రావు, వెంకయ్య పూర్వవిద్యార్థులే.. ఎందరో ఉన్నతస్థాయికి

8

శత వసంతాల ఆంధ్ర విశ్వవిద్యాలయం



చుక్క నీరు పోనివ్వం

ఉగ్రవాదానికి ఊతమిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ నుంచి సింధు జలాలు వెళ్లకుండా చూసే పూచీ మాది

ఆ దిశగా తీసుకోవాల్సిన చర్యలపై కసరత్తు చేస్తున్నాం

హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలో భేటీ అనంతరం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ వెల్లడి

జమ్మూకశ్మీర్‌లో నివసించే స్థానికేతరులు, రైల్వే ఆస్తులు, కశ్మీరీ పండిట్లే లక్ష్యంగా దాడులకు 'ఉగ్ర' ప్రణాళికలు?

భద్రతా దళాలు అప్రమత్తం.. సిబ్బంది సెలవులు రద్దు

వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు

శ్రీనగర్‌కు ఆర్మీ చీఫ్.. అక్కడ భద్రతా పరిస్థితిపై సమీక్ష

సరిహద్దుల్లో రాఫెల్స్ గర్జన.. ఐఏఎఫ్ యుద్ధ విన్యాసాలు

బందిపొరాలో ఎన్‌కౌంటర్.. లష్కరే కమాండర్ హతం

పహల్గాం ఉగ్రవాదుల ఇళ్లలో పేలుళ్లు

భద్రతా దళాలే లక్ష్యంగా పేలుడు పదార్థాల నిల్వ?



జమ్మూకశ్మీర్‌లో సైనికాధికారులతో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: సింధు జలాలను మళ్లించే యత్నాలను యుద్ధచర్యగా భావిస్తామంటూ పాక్ చేసిన వ్యాఖ్యలపై భారత్ తీవ్రస్థాయిలో స్పందించింది. ఉగ్రవాదానికి ఊతమిస్తున్న దాయాది దేశానికి మన గడ్డ మీద నుంచి ఒక్క చుక్క నీరు కూడా వెళ్లకుండా చూసే పూచీ తమదని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తేల్చిచెప్పారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు భారత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలో శుక్రవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీకి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన పలువురు సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న నదులపై నిర్మించిన ఆనకట్టల నిల్వ సామర్థ్యాన్ని, నిర్వహణ సామర్థ్యాన్ని పెంచాలని అందులో నిర్ణయించారు. ఈ భేటీ అనంతరం పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడిన సీఆర్ పాటిల్.. ప్రధాని నరేంద్రమోదీ తమకు ఈ దిశగా పలు సూచనలు చేశారని, వాటిపై సమావేశంలో చర్చించామని, వాటిని సమర్థంగా అమలుచేసేందుకు అమిత్ షా పలు సూచనలు చేశారని తెలిపారు. "నీటి నిలిపివేతకు సంబంధించి వ్యూహాన్ని ఈ భేటీలో సిద్ధం చేశాం. అందులో భాగంగా మూడు ప్రత్యామ్నాయాలపై చర్చించాం. సింధు జలాల నుంచి ఒక్క చుక్క నీరు కూడా పోకుండా తీసుకోవాల్సిన స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక

మిగతా 11వ పేజీలో...

అవును.. ఉగ్రవాదాన్ని పెంచి పోషించాం

అమెరికా, బ్రిటన్ కోసమే ఈ చెత్త పనులు

పొరపాటు గ్రహించాం.. అనుభవిస్తున్నాం

పాక్ రక్షణ మంత్రి సంచలన వ్యాఖ్యలు

ఎల్‌వోసీ వెంబడి పాక్ కాల్పులు తిప్పికొట్టిన భారత్

పీవోకేకు హమాస్ నేతలు!



పాక్‌కు గుణపాఠం ఖాయం!

స్థలం, సమయం ఖరారే మిగిలింది

'ఆంధ్రజ్యోతి'తో జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ రాజేంద్రకుమార్

10



సజ్జల ఎస్టేట్‌లో అరటితోట

కబ్జాల పునాదిపై 'సజ్జల' సామ్రాజ్యం



63 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ

రిజర్వ్ ఫారెస్టు, రెవెన్యూ భూములూ..

తేల్చిన యంత్రాంగం..ప్రభుత్వానికి నివేదిక

'ఆంధ్రజ్యోతి' చెప్పిందే అక్షర సత్యం

అవి రిజర్వ్ ఫారెస్టు భూములా, రెవెన్యూ భూములా అని చూడలేదు. ప్రభుత్వ భూములను కబ్జా చేసేసి, కడపలోని 'సజ్జల' ఎస్టేట్‌లో దర్జాగా కలిపేసుకున్నారు. 200 ఎకరాల్లో విస్తరించిన ఈ ఎస్టేట్‌లో 63 ఎకరాలు సర్కారీ భూములేనని అధికారులు తాజాగా తేల్చారు. ప్రభుత్వానికి నివేదిక అందించారు.

12

అమరావతిలో మరో అధ్యాయం

2న పనుల పునరుద్ధరణ ప్రారంభానికి రండి

ప్రధాని మోదీకి చంద్రబాబు ఆహ్వానం



ప్రధాని మోదీకి అమరావతి ఆహ్వాన పత్రం అందజేస్తున్న సీఎం చంద్రబాబు

అంగీకరించిన మోదీ.. ఢిల్లీలో గంట చర్చలు

ప్రపంచ స్థాయి రాజధానికి ప్రధాని సూచనలు

పచ్చదనానికి అధిక ప్రాధాన్యమివ్వండి

మియావకీ పద్ధతులు అమలు చేయండి: మోదీ

కేంద్ర సాయానికి బాబు కృతజ్ఞతలు

ఎన్టీపీసీ గ్రీన్, ఆర్సెలర్, బీపీసీఎల్ ప్రాజెక్టులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు

ఉగ్ర పోరులో అండగా ఉంటామని హామీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 'అద్భుతమైన భవిష్యత్ దిశగా రాష్ట్రం జరిపే ప్రయాణంలో అమరావతి చరిత్రాత్మక మైలురాయి అవుతుంది. ఈ ప్రత్యేక ఘట్టాన్ని ప్రారంభించేందుకు, రాష్ట్రాభివృద్ధిలో కొత్త అధ్యాయాన్ని లిఖించడానికి అమరావతికి రావాలని ప్రధాని మోదీని ఆహ్వానించాను. ఆయన అంగీకరించారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణానికి ఆయన పలు సూచనలు కూడా చేశారని వెల్లడించారు. చంద్రబాబు

మిగతా 8వ పేజీలో...

ఏఐతో మెరుగైన పాలన

ఉద్యోగులందరికీ దశలవారీగా శిక్షణ 7

నిరంతరాయంగా అవగాహన కార్యక్రమాలు

డిజిటల్ టెక్నాలజీతో వేగంగా పౌర సేవలు: సీఎస్



ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరిరంగన్ కన్నుమూత

వృద్ధాప్య సమస్యలతో బెంగళూరులో తుదిశ్వాస

తొమ్మిదేళ్లపాటు ఇస్రో చైర్మన్‌గా విశేష సేవలు 10

ముర్ము, మోదీ, చంద్రబాబు, ఇతర ప్రముఖుల నివాళి

మద్యం స్కామ్‌లో మరో అరెస్టు

సజ్జల శ్రీధర్ రెడ్డిని పట్టుకున్న 'సిట్'



కమీషన్ల నిర్ణయంలో కీలక పాత్ర.. హైదరాబాద్‌లో కంపెనీలతో భేటీలు

బలవంతంగా డిస్టిలరీల స్వాధీనం.. ఎస్పీవై ఆగ్రోలో 'సొంత' తయారీ

హైదరాబాద్‌లో అరెస్టు.. విజయవాడకు తరలింపు 12

'కంచి' ఉత్తరాధికారిగా గణేశ శర్మ



అన్నవరానికి చెందిన రుగ్వేద పండితుడికి అవకాశం

బాసర జ్ఞానసరస్వతి దేవస్థానంలో విధులు

తర్కం, మీమాంస, సామ, యజుర్వేదాలలో స్వామీజీ శిక్షణ

తండ్రి అన్నవరం దేవస్థానంలో వ్రత పురోహితుడు 12

శాంతిభద్రతల్లో రాజీపడం

తప్పుచేస్తే ఏ పార్టీ వారైనా ఉపేక్షించేది లేదు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరిక

పిఠాపురం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు 8

పది నెలల్లో 100 కోట్లతో పనులు చేపట్టామని వెల్లడి



పిఠాపురంలో వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్, పక్కన టీడీపీ నేత వర్మ, జనసేన నేతలు

కాళ్లూ చేతులు నరికారు..!

ఫ్లెక్సీ వివాదంలో పట్టపగలే టీడీపీ కార్యకర్తపై దాడి 7

ఇరువర్గాలూ వైసీపీ నుంచి వచ్చినవారే

మత్స్యకారులకు పండగే!



నేడు 'మత్స్యకారుల సేవలో' పథకానికి చంద్రబాబు శ్రీకారం

ఒక్కొక్క జాలరి కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం 8

1.29 లక్షల కుటుంబాలకు లబ్ధి.. రూ.258 కోట్ల విడుదల

వేట నిషేధ కాలంలో సర్కారు దన్ను.. జగన్ పాలనలో 10 వేలే

రెట్టింపు చేస్తానని బాబు హామీ.. సిక్కోలులో నేడు నిధులు విడుదల

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఉక్రెయిన్ యుద్ధగతి

ఎన్నడూలేనిది అమెరికా అధ్యక్షుడికి రష్యా పాలకుడిమీద మాచెడ్డ కోపం వచ్చింది. ఇకచాలు, యుద్ధాన్ని ఆపేయ్ పుతిన్ అంటున్నారు డోనాల్డ్ ట్రంప్. పన్నెండుమందిని హతమార్చి, డెబ్బయ్‌మందిని తీవ్రంగా గాయ పరిచిన రష్యా దాడి ట్రంప్‌ను కదిలించిందట. గాజాలో యుద్ధం ఆగి, ఆహారం చేరుతోందన్న సంతోషం ఎంతోకాలం నిలవనీయకుండానే, ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహూ మళ్ళీ మారణకాండ మొదలుపెట్టినా ట్రంప్‌కు ఈ బాధకలగలేదు. ఇప్పుడు అక్కడ యథేచ్ఛగా ఊచకోతలు సాగిస్తూ ఒక్క పాలస్తీనియన్ కూడా మిగలకుండా ఇజ్రాయెల్ తరిమికొట్టేవరకూ, బహుశా దానిని మానవరహిత ప్రాంతంగా మార్చి రిసార్టు తయారీకి అప్పగించేంత వరకూ ట్రంప్‌కు గాజా గుర్తుకురాదేమో. ఉక్రెయిన్ విషయంలో మాత్రం తాను అనుకున్నట్టుగా జరగడం లేదని ట్రంప్‌కు చిరాకుగా ఉంది. అరుదైన, విలువైన ఖనిజాలు అప్పగిస్తామని ఉక్రెయిన్–రష్యా పోటాపోటీగా భారీ ఆఫర్ ఇచ్చి కూడా చాలారోజులైంది. వేగంగా ఒప్పందానికి రాకపోతే మధ్యవర్తిత్వాన్ని మధ్యలోనే వదిలేస్తామని అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులు అదేపనిగా హెచ్చరిస్తున్నారు. ట్రంప్ ప్రత్యేకదూత స్టీవ్ విట్కాఫ్ ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉంటూ, పుతిన్ సహా కీలకనేతలతో చర్చలు జరుపుతున్న నేపథ్యంలో, యుద్ధం కొలిక్కివస్తుందని అంటున్నారు.

ట్రంప్ ప్రత్యేకదూత మాస్కోలో కాలూనినక్షణాల్లోనే రష్యా మిలటరీ జనరల్ హత్య జరిగింది. ఉక్రెయిన్ యుద్ధంలో కీలకపాత్ర నిర్వహిస్తున్న ఈ అధికారి కారుబాంబు పేలుడులో ప్రాణాలు కోల్పోయారు. గత ఏడాది ఇదేవిధంగా ఒక జనరల్ హత్య జరిగినప్పుడు రష్యా దానిని ఉక్రెయిన్ ఖాతాలో వేసి, శపథాలు చేసింది. ఈ మారు ఉగ్రవాదుల దుశ్చర్య అని మాత్రమే ప్రకటించి ఊరుకుంది. గత ఏడాది జూలైలో కీవ్‌లోని అతిపెద్ద పిల్లల ఆస్పత్రిని నేలమట్టం చేసి, ముప్పైఐదుమందిని హతమార్చిన తరహాలోనే గురువారం తెల్లవారుజామువరకూ నూటయాభై డ్రోన్లు, డెబ్బై మిసైళ్ళతో రష్యా ఉక్రెయిన్‌మీద భారీ దాడిజరిపిన విషయం తెలిసిందే. ఈ దాడి జరగడానికి ఒకరోజుముందు శాంతిచర్చలకు మోకాలడ్డుతున్నది జెలెన్‌స్కీయేనంటూ తప్పుబట్టిన ట్రంప్, ఈ దాడి అనంతరం విధిలేక పుతిన్‌ను కూడా ఓ మాట అనకతప్పలేదు.

క్రిమియా రష్యా చేతుల్లోకి పోయి పదేళ్ళయిన తరువాత కూడా దానిని గుర్తించకూడదంటే ఎలా అన్నది ట్రంప్ ప్రశ్న. మరో నాలుగేళ్ళ తరువాత, అంటే, 2018లో మీ ప్రభుత్వమే 'క్రిమియా డిక్లరేషన్'లో దానిని దురాక్రమణగా అభివర్ణించి, క్రిమియాను రష్యా అంతర్భాగంగా గుర్తించేది లేదని ప్రకటించి, ఇప్పుడు మాటమారుస్తున్నారెందుకని జెలెన్‌స్కీ ప్రశ్న. ట్రంప్ శాంతి ప్రతిపాదనలో భాగంగా క్రిమియాను రష్యాకు వదులుకోవడానికి జెలెన్‌స్కీ అంగీకరించడం లేదు. యుద్ధం ఆగకపోయినా పర్వాలేదు కానీ, మా రాజ్యాంగానికీ, ఆత్మగౌరవానికీ, క్రిమియాలో ఉన్న తోటి ఉక్రేనియన్లకు మేము ద్రోహం చేయలేమని అక్కడి 1ప్రజలు అంటున్నారు. శాంతి కావాలో, మరో మూడేళ్ళపాటు యుద్ధాన్ని కొనసాగనిచ్చి మొత్తం దేశాన్నే కోల్పోతారో ఆయనే తేల్చుకోవాలని అని ట్రంప్ మరోమారు జెలెన్‌స్కీని రెచ్చగొట్టారు కూడా.

దక్షిణ ఉక్రెయిన్‌లో నల్లసముద్రం వెంబడివున్న క్రిమియా వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతం కావడంతో రష్యా ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. శాంతి ఒప్పందానికి క్రిమియా ప్రధాన అంశం కావడంతో, జెలెన్‌స్కీ మెడలు వంచేందుకు ట్రంప్ శతథాప్రయత్నిస్తున్నారు. టైమ్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన మనసులో ఉన్నదంతా చెప్పేశారు. ఉక్రెయిన్ నాటోలో చేరదనీ, యూరోపియన్ యూనియన్ సభ్యత్వంతో సరిపెట్టుకుంటుందని తేల్చేశారు. అంతేకాదు, ఈ మూడేళ్ళయుద్ధకాలంలో ఉక్రెయిన్ కోల్పోయిన భూభాగాలమీద రష్యా ఆధిపత్యాన్ని గుర్తించేందుకు కూడా ట్రంప్ సిద్ధపడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. క్రిమియా యుద్ధంతో ముడిపడిన ఆంక్షలను రష్యామీద ఎత్తివేయడం, ఉక్రెయిన్ పునర్నిర్మాణానికి అన్ని విధాల సాయపడడం ఇత్యాదివి ఉన్నాయి. ట్రంప్ ప్రతిపాదిత ఒప్పందం తనకు అనుకూలంగా ఉంటున్నందున రష్యా ఇప్పటికే జైకొట్టింది. జెలెన్‌స్కీని కూడా దారికి తేగలిగితే యుద్ధం ఆగడంతోపాటు, రెండుదేశాల్లోనూ కీలకవనరులు అమెరికా దక్కించుకోవచ్చు.

తెలుగు చరిత్రకారుడు ఫ్రైకెన్‌బర్గ్ కన్నుమూత

తెలుగువారి చరిత్ర–సంస్కృతులను, ఆధునిక యుగానికి సంబంధించి, తన పరిశోధనల ద్వారా బాహ్య ప్రపంచానికి తెలిపిన ప్రముఖ చరిత్రకారుడు ఎరిక్ ఫ్రైకెన్‌బర్గ్ కన్నుమూశారు. 1930లో జన్మించిన ఈయన, తమిళనాడులో విద్యాభ్యాసం మొదలుపెట్టి, ఆ తర్వాత అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం (బర్కిలీ)లో రాజకీయ శాస్త్రం చదివి, 1961లో లండన్‌లో స్కూల్ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లో డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నారు. విస్కాన్సిన్–మాడిసన్ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగంలో (1962–1997) బోధనావృత్తి చేపట్టారు. అక్కడు న్నప్పుడు, భారతదేశ చరిత్రకు సంబంధించి భూసమస్యలు, మత మార్పిడులు, హిందూ జాతీయవాదం, భారతదేశంలో క్రైస్తవమత పుట్టుక, ఎదుగుదల గురించి గణనీయమైన కృషి సలిపి, రచనలు చేశారు.



రాబర్ట్ ఎరిక్ ఫ్రైకెన్‌బర్గ్
(జూన్ 8, 1930–ఏప్రిల్ 15, 2025)

ఫ్రైకెన్‌బర్గ్ పరిశోధించి, వెలువరించిన 'గుంటూర్ డిస్ట్రిక్ట్' గ్రంథం ఆయనకు ఎనలేని ఖ్యాతిని తీసుకొచ్చింది. ప్రభుత్వ పరిపాలనను, వలస పాలనాధికారుల కంటే భారతీయులే అమితంగా ప్రభావితం చేశారన్న అంశాన్ని విపులంగా చర్చించారు. బ్రాహ్మణులు– నియోగులు, దేశస్థ బ్రాహ్మణులు, గ్రామకరణాలుగా, అనువాదకులుగా (దుబాషీలు), కచేరీ ఉద్యోగులుగా పనిచేస్తూ, వారి స్వప్రయోజనాలను పొందిన తీరు వివరిస్తూ, గ్రామకరణాలు లబ్ధిపొందిన తీరు, అవసరమైన రికార్డులను తొలగించి, వాటి స్థానంలో 'తప్పుడు' లెక్కలను చూపించిన పద్ధతులను వెలికి తీశారు. ఫ్రైకెన్‌బర్గ్ అనుసరించిన భారతీయ చరిత్ర అధ్యయన విధానాన్నే ఆ తర్వాత ప్రాచుర్యాని కొచ్చిన కేంబ్రిడ్జి స్కూల్ చరిత్రకారులు అనిల్ సీల్, డేవిడ్ వాష్‌బ్రూక్, క్రిస్ బేకర్, సి.ఎ. బెయిలీ తదితరులు అవలంబించారు.

ఫ్రైకెన్‌బర్గ్, ఆ తర్వాతి కాలంలో తమిళనాడు, ఆంధ్ర ప్రాంతాల్లో క్రైస్తవ మతవ్యాప్తి గురించి అధ్యయనం చేశారు. ఈ ప్రక్రియలో తనకు తోడ్పడిన భారతీయ మద్దతుదార్లను గూర్చి రాశారు. 'హిస్టరీ ఆఫ్ క్రిస్టియానిటీ ఇన్ ఇండియా: బిగినింగ్స్ టు ది ప్రెజెంట్' ప్రచురించారు. భారతదేశ గతాన్ని గూర్చి ఆయన రచించిన, 'ఇండియాస్ రాజ్: ఎస్సేస్ ఇన్ హిస్టారికల్ అండర్‌స్టాండింగ్స్' గ్రంథం, ఫ్రైకెన్‌బర్గ్ ప్రశంసాపూర్వక విద్వత్తుకూ, భారతదేశ చరిత్ర గతానికీ ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

– వకుళాభరణం రామకృష్ణ

మీ ఇల్లు సర్దుకోండి

మీరెప్పుడైనా చూశారా సింధూ నది జలాల్లో
పర్యాటకుల రక్తం ప్రవహించడాన్ని..!
ఎవరైనా విన్నారా కాశ్మీరం ప్రశాంతంగా నిద్రపోతుందని
భూతల స్వర్గంలో అప్పుడప్పుడు దయ్యాలు
కూడా శాంతిని భగ్నం చేస్తాయి
ఎత్తైన కొండల చాటు నుండి ఎవడు మనవాడో
ఎవడు పరాయివాడో గుర్తించనట్లుగా
ఎప్పుడు ఎవరిపై విరుచుకుపడతాడో
కానీ వారికి తెలియదు మా సంకల్పం ముందు
వారి పిల్ల చేష్టలు నిలబడవని...
పొరుగు దేశాన్ని ప్రేమించలేని వారిని మేమెలా ప్రేమిస్తాం..?
ప్రేమనిచ్చిన ప్రేమవచ్చును అని గురజాడ వారన్నట్లు
మీరు తుపాకీ తూటాల్ని నమ్ముకుంటే
మేం బుద్ధుడు, గాంధీజీ బోధించిన
సత్యం, అహింసలను నమ్ముతుంటాం
తేడా వస్తే– 1965, 1971, 1999లో
జరిగింది మర్చిపోయారా..?
ముందు మీ ఇల్లు సరిదిద్దుకోండి...
సరిహద్దులు దాటి వచ్చారో తస్మాత్ జాగ్రత్త
అబ్ కీ బార్ ఈట్ కా జవాబ్ పత్తర్ సే దేంగే...

– డా. మహమ్మద్ హసన్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

అమెరికా-చైనా.. అడకత్తెరలో భారత్

ఈ నెల 2న ప్రారంభమైన సుంకాల యుద్ధంలో భారత్ రెండు దేశాల నుంచి సవాళ్ల నెదుర్కొంటున్నది. అవి అమెరికా, చైనా అని మరి చెప్పనవసరం లేదు. స్కిల్లా, చారిబ్డిస్ మధ్య (బిట్వీన్ స్కిల్లా అండ్ చారిబ్డిస్) భారత్ చిక్కుకున్నది. (గ్రీక్ పురాణ వీరుడు ఒడిస్సియస్ తన నౌకతో ఒక జలసంధి గుండా ప్రయాణించవలసి వచ్చినపుడు రెండు ప్రమాదాల నెదుర్కోవలసివచ్చింది. ఒకటి స్కిల్లా అనే ఆరు తలల రాక్షసి, మరొకటి చారిబ్డిస్ అనే సుడిగుండం. రెండు అవాంఛనీయమైన ఎంపికల మధ్య ఒకదాన్ని ఎంచుకోవడంలో ఉన్న కష్టనష్టాలను ఈ జాతీయం సూచిస్తుంది). మరో ఆంగ్ల జాతీయం కూడా భారత్ క్లిష్ట పరిస్థితికి అద్దం పడుతున్నది. అది 'బిట్వీన్ ది డెవిల్ అండ్ డీప్ సీ'. అయితే ఏది దెయ్యం? ఏది లోతైన సముద్రం? ఇది సందిగ్ధతను సూచిస్తుంది. ఏ దేశాన్ని ఏ విధంగా భావించినా ప్రతికూల పరిస్థితుల నెదుర్కోవలసిరావడం అనివార్యం. రెండూ సంతోషదాయకం కాని ప్రత్యామ్నాయాలే మరి.



■ పి. చిదంబరం


'పళని' పలుకు

సమస్యను మరింత వివరంగా చూద్దాం. 2024–25లో అమెరికా, చైనాలతో మన ఎగుమతులు, దిగుమతులు ఇలా ఉన్నాయి. తొలుత ఎగుమతులు : (అంకెలు అన్నీ డాలర్లలో) అమెరికాకు–88.51 బిలియన్; చైనాకు–14.25 బిలియన్, ప్రపంచ దేశాలకు–437.42 బిలియన్. దిగుమతులు: అమెరికా నుంచి–45.3 బిలియన్; చైనా నుంచి–113.45 బిలియన్; ప్రపంచ దేశాల నుంచి–720.24 బిలియన్. ఈ ప్రకారం ఆయా దేశాలతో మన వాణిజ్య మిగులు లేదా లోటు ఇలా ఉన్నది: అమెరికాతో మన వాణిజ్యం మిగులుతో జరుగుతుంది. అది +41.21 బిలియన్. చైనాతో మన వాణిజ్య లోటు ఇలా ఉన్నది: –99.20 బిలియన్. ప్రపంచ దేశాలతో మన వాణిజ్య లోటు: –282.82 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ఈ గణాంకాలు చెబుతున్నదేమిటి? ప్రపంచ రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలతో వ్యవహరించవలసి వచ్చినపుడు భారత్ పూర్తిగా రెండు పరస్పర విరుద్ధ సవాళ్ల నెదుర్కొంటున్నది!

అమెరికాతో మన వాణిజ్య ఖాతా మిగులుతో ఉన్నది. అమెరికాకు మన ప్రధాన ఎగుమతులు రత్నాలు, బంగారు ఆభరణాలు, ఔషధాలు, ఇంజినీరింగ్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, కొన్ని వ్యవసాయక ఉత్పత్తులు. ఔషధాలు మినహా మిగతా సరుకులు, వస్తువులను మన దేశం నుంచి దిగుమతి చేసుకోవలసిన అవసరం అమెరికాకు లేదు. ఇతర దేశాల నుంచి వాటిని దిగుమతి చేసుకోవడం ద్వారా తన అవసరాలను తీర్చుకోగలుగుతుంది. అయితే మనం ఎగుమతి చేస్తున్న ప్రతి సరుకు, ఉత్పత్తి వేలాది స్త్రీ పురుషుల జీవనోపాధికి ఆధారంగా ఉన్నాయి. ఇప్పుడు భారీ సుంకాలు విధించేందుకు ట్రంప్ మహాశయుడు సిద్ధమవడంతో అమెరికాతో మన వాణిజ్య ఖాతాలోని మిగులు హరించుకుపోయే ప్రమాదమున్నది. సరే, ప్రతిపాదిత సుంకాల అమలును ట్రంప్ తాత్కాలికంగా నిలిపివేయడంతో పాటు ఫార్మాస్యూటికల్ ఉత్పత్తులకు అధిక సుంకాల నుంచి మినహాయింపునిచ్చారు. అయినప్పటికీ భారత్ శిరస్సుపై ట్రంప్ సుంకాల ఖడ్గం వేలాడుతూనే ఉన్నది. అమెరికా అధ్యక్షుడు సంకల్పించిన భారీ సుంకాలు అంతిమంగా అమలులోకి వచ్చినప్పుడు మన ఎగుమతులపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. లక్షలాది ఉద్యోగాలు మాయమవుతాయి. మన విదేశీమారకద్రవ్య నిల్వలు తగ్గిపోతాయి. కరెంట్ ఖాతా సమతౌల్యం గతించిన విషయమైపోతుంది. ఈ కష్ట నష్టాలను దృష్టిలో ఉంచుకుని అమెరికాతో సంప్రతింపుల ద్వారా సుంకాల భారాన్ని సాధ్యమైనంతగా తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి.

భారీ సుంకాల విధింపుతో భారతీయ సరుకుల దిగుమతులను నిరోధించడం వల్ల అమెరికాకు లబ్ధి సమకూరదు. ఈ వాస్తవం ట్రంప్‌కు బాగా తెలుసు. భారతీయ దిగుమతులను అనుమతించేందుకు ఒక మార్గాన్ని ఆయన కనుగొంటారు. అయితే అందుకు భారత్ నుంచి పెద్ద ప్రయోజనాన్ని దక్కించుకోవడానికి ఆయన తప్పక ప్రయత్నిస్తారు. ద్వైపాక్షిక వాణిజ్యం సమతౌల్యపరిచేందుకు అమెరికా నుంచి భారత్ మరిన్ని ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఆయన పట్టుబడతారు. నా ఊహ ఏమిటంటే సైనిక సామగ్రి, యుద్ధ విమానాలను కొనుగోలు చేయాలని భారత్‌ను ఆయన ఒత్తిడి చేయవచ్చు. ఆ రెండూ చాలా చాలా ఖరీదైన ఉత్పత్తులని మరి చెప్పనవసరం లేదు. భారత్ తనకు అవసరమైన ఉక్కు ఉత్పత్తులు, ఇనుప పరికరాలు, సేంద్రియ రసాయనాలు, ప్లాస్టిక్స్, ఖనిజాలు, లోహాలు, పెట్రోలియం ఉత్పత్తులు అమెరికాయేతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవచ్చు. అయితే ఈ అవసరాలను సైతం అమెరికా ఉత్పత్తులతో తీర్చుకోవడం వివేకవంతమైన, ప్రయోజనకరమైన చర్య అవుతుంది. ఇంతకూ అమెరికా నుంచి సైనిక సామగ్రి, యుద్ధ విమానాలు, ఇంకా అణు రియాక్టర్లను దిగుమతి చేసుకునేందుకు అయ్యే భారీ వ్యయాలను భారత్ ఏ మేరకు భరించగలదు? ఇదొక పెద్ద ప్రశ్న. సమాధానం అంత సులువైనది కాదు.

ఇక చైనాతో వ్యవహారం పూర్తిగా భిన్నమైనది. ఈ దేశంతో భారత్ వాణిజ్య ఖాతా లోటు భారీ పరిమాణంలో ఉన్నది. అది ఇంచుమించు 100 బిలియన్ డాలర్ల మేరకు ఉన్నది! విద్యుత్ సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు, మెషినరీ, సేంద్రియ రసాయనాలు, ప్లాస్టిక్‌లు, ఉక్కు ఉత్పత్తులు మొదలైన వాటికి భారత పారిశ్రామిక రంగం చైనాపైనే ఆధారపడి ఉన్నది. చైనా ఉత్పత్తుల ధరలు తక్కువగా ఉండడమే అందుకు కారణం కొన్ని సందర్భాలలో ఈ దిగుమతులు 'డంపింగ్' (ఎగుమతిదారుడి దేశీయ మార్కెట్‌లో అమ్మే ధర కంటే తక్కువ ధరకు విదేశీ మార్కెట్‌లో వస్తువులను విక్రయించే పద్ధతి) కిందకే వస్తాయి. తక్కువ ధరకు, అవసరమైన సమయానికి సరుకులు పొందేందుకు భారత్‌కు చైనా ఉత్పత్తుల కంటే ప్రత్యామ్నాయాలు లేవు దేశీయ వస్తూత్పత్తి రంగం (మన స్థూల దేశీయోత్పత్తిలో ఈ రంగం వాటా కేవలం 13 లేదా 14 శాతంగా మాత్రమే ఉన్నది!)



ట్రంప్ సుంకాలకారణంగా అమెరికాతో వాణిజ్య మిగులు హరించుకుపోయి, చైనాతో వాణిజ్యలోటు పెరిగిపోతే భారత్ ఆర్థిక రంగ పరిస్థితి దిగజారిపోతుంది. సుంకాల సమరం నేపథ్యంలో అమెరికా, చైనాలతో తన సంబంధాలు సమతౌల్యంగా ఉండేలా భారత్ జాగ్రత్తపడాలి.

స్థితిగతులను మెరుగుపరచుకుని విస్తరించనంతవరకు చైనాపై ఆధారపడడం భారత్‌కు తప్పనిసరి అవుతుంది.

చైనాకు భారత్ ప్రధానంగా వినియోగ వస్తువులు, ఖనిజ ఉత్పత్తులు, పెట్రోలియం ఆధారిత ఇంధనాలు, సముద్ర ఆహారోత్పత్తులు, పత్తి, మరికొన్ని వ్యావసాయక ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నది. చైనా దేశీయంగా ఉత్పత్తి చేసుకోలేక పోతున్న, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోలేక పోతున్న విలువ ఆధారిత వస్తువులను భారత్ ఆ దేశానికి ఎగుమతి చేయగలదు. అయినా చేయలేకపోతుంది. ఎందుకని? వస్తూత్పత్తి రంగాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్లే భారత్‌కు ఈ దురవస్థ ప్రాప్తించింది. భారత్ నుంచి మరిన్ని వస్తువులు దిగుమతి చేసుకునేందుకు చైనా సంసిద్ధత వ్యక్తం చేసింది. అయితే భారత్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలదా అన్న విషయం చర్చనీయాంశమే. చైనాతో వాణిజ్యలోటు భారత్ కరెంట్ ఖాతా లోటును ప్రకోపింపచేస్తోంది. ఇది ప్రమాదకరంగా పరిణమించవచ్చు. అమెరికాతో వాణిజ్య మిగులు, కొంతమేరకు చైనాతో వాణిజ్య లోటును భర్తీ చేస్తుంది. ట్రంప్ సుంకాలతో అమెరికాతో వాణిజ్య మిగులు హరించుకుపోయి, చైనాతో వాణిజ్యలోటు పెరిగిపోతే భారత్ ఆర్థిక రంగ పరిస్థితి దిగజారిపోతుంది.

భారత్ క్వాడ్ కూటమిలో భాగస్వామిగా ఉన్నది. అయితే అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా వ్యూహాత్మక ప్రాథమ్యాలు భారత్ వ్యూహాత్మక ప్రాథమ్యాలకు పూర్తిగా భిన్నమైనవి. చైనా విస్తరణవాదాన్ని అడ్డుకునే రక్షణ కుడ్యంగా క్వాడ్ పరిణమించాలని అమెరికా ఆశిస్తోంది. అయితే భారత్ వైఖరి భిన్నంగా ఉన్నది. నౌకా వాణిజ్య భద్రత, డిజిటల్ కనెక్టివిటీ, ప్రభవిస్తున్న నూతన సాంకేతికతల విషయంలో సహకారానికి క్వాడ్ పరిమితం కావాలని భారత్ భావిస్తోంది. ఈ కూటమిని చైనా వ్యతిరేక బృందంగా మార్చివేసే సంకల్పాలు, ప్రయత్నాలకు భారత్ సుముఖంగా లేదు. చైనా ప్రయోజనాలకు వ్యతిరేకంగా అమెరికాతో ఒప్పందాలు కుదుర్చుకునే ఏ దేశమైనా భారీ మూల్యం చెల్లించవలసివస్తుందని చైనా ఇప్పటికే ప్రపంచ దేశాలను హెచ్చరించింది. ఈ వాస్తవాల దృష్ట్యా పెట్టుబడులు, అధునాతన సాంకేతికతలు సమకూర్చే అమెరికా, మధ్యస్థ వస్తువులు (వివిధ సరుకుల తయారీ ప్రక్రియలో వాడబడే వస్తువులు), ఉత్పాదక వస్తువులను సరఫరా చేసే చైనా మధ్య ఒక సమతుల్యతను భారత్ విధిగా పాటించాలి. భారత భూభాగాలను ఆక్రమించుకున్న శత్రుపూరిత పొరుగు దేశం చైనా అన్న వాస్తవాన్ని విస్మరించకూడదు. క్వాడ్‌లో భారత్ భాగస్వామ్యం ఇంతవరకు వాస్తవికంగా ఉన్నది అటు అమెరికాలోని, ఇటు భారత్‌లోని మితవాద వర్గాలు చైనాతో ఘర్షణపడేలా న్యూ ఢిల్లీని ప్రోద్బలించే అవకాశమున్నది. మరో ఆసక్తికరమైన విషయాన్నీ ప్రస్తావించాలి: అధ్యక్షుడు ట్రంప్ జనవరి 20, 2029 దాకా మాత్రమే అధికారంలో ఉంటారు. అధ్యక్షుడు క్షీ జిన్ పింగ్ తాను కోరుకున్నంతకాలం అధికారంలో ఉంటారు. చైనా పాలన ఆయన నియంత్రణలో ఉంటుంది. ట్రంప్ దుడుకుగా, మొరటుగా వ్యవహరించే వ్యక్తి. జిన్ పింగ్ జిత్తులమారి, వంచనాశీలి. దేశీయ పరిశ్రమల సంరక్షణ విధానాలను మోదీ అనుసరిస్తున్నారు. సుంకాల విషయంలో ట్రంప్ దుస్సాహసంతో ఆ విధానాలను మార్చివేయవలసిన అగత్యం మేర్పడింది. మోదీ ఆ సంరక్షణ విధానాలను ఉపసంహరించుకోవాలి. ఆర్థిక నిపుణులను విస్తృతంగా సంప్రతించి విధాన నిర్ణయాలు తీసుకోవడాన్ని మోదీ అలవరచుకోవాలి. మరీ ముఖ్యంగా ప్రతిపక్షాలను శత్రువులుగా పరిగణించే వైఖరికి ఆయన స్వస్తి చెప్పాలి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

మదనపల్లిలో ఇస్కఫ్ సభలు

ఇస్కఫ్– ఓ అద్భుతమైన చరిత్ర. వలస పాలన విముక్తి ఉద్యమాలకు స్ఫూర్తిగా భాసిల్లిన సోవియట్ యూనియన్ పైన హిట్లర్ దాడి మన జాతీయ నాయకులను, కమ్యూనిస్టు నేతలను కలవరపరిచింది. సోవియట్ ప్రజలకు సంఘీభావంగా 1941, జూన్ 22న కలకత్తా కేంద్రంగా ఏర్పడిన ఫ్రెండ్స్ ఆఫ్ సోవియట్ యూనియన్ మారుతున్న కాలానికి అనుగుణంగా ఇస్కస్, ఆ తర్వాత ఇస్కఫ్‌గా రూపాంతరం చెందింది. ఇస్కఫ్ ఉజ్వల చరిత్ర తడిమి చూస్తే నీటి గలగలల సంగీతమేదో వినిపిస్తోంది. కరిగిపోయిన 84 సంవత్సరాల శాంతి, స్నేహ, సంస్కృతీ సంబంధాల పయనం గుర్తుకు వస్తుంది.

'ఫ్రెండ్స్ ఆఫ్ సోవియట్ యూనియన్'కు విశ్వకవి రవీంద్రనాథ్ టాగోర్ ప్యాట్రన్‌గా ఉన్నారు. స్వామి వివేకానందా సోదరుడు భూపేంద్రనాథ్ దత్త అధ్యక్షుడు. ఈయన మామూలు మనిషి కాదు. 1921లోనే కొమింటర్న్‌లో చేరేందుకు మాస్కో వెళ్లి భారతదేశ పరిస్థితులపై ఒక పరిశోధన పత్రాన్ని లెనిన్‌కు సమర్పించిన విప్లవకారుడు. ప్రముఖ కమ్యూనిస్టు ప్రొఫెసర్ హిరేన్ ముఖర్జీ, ఎస్.కె. ఆచార్య కార్యదర్శులుగా ఫ్రెండ్స్ ఆఫ్ సోవియట్ యూనియన్ ఆరంభమైంది. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, మహాత్మాగాంధీ లాంటి పలువురు జాతీయ నాయకులు శుభాకాంక్షలు పంపి సంస్థ పురోగతిని ఆకాంక్షించారు. స్థాపన జరిగిన నెల తర్వాత కలకత్తా టౌన్ హాలులో ఆచార్య ప్రఫుల్ల చంద్ర రే (శాస్త్రవేత్త) అధ్యక్షతన తొలిసభ పెద్ద ఎత్తున జరిగింది. ఉత్తరాలు, ఫోటో ప్రదర్శనలు, సినిమాల ద్వారా సోవియట్ సంస్కృతిని భారత ప్రజలకు తెలియజేసే ప్రయత్నాలు విస్తృతంగా జరిగాయి. 1944లో జరిగిన ఒక సమావేశంలో విజయలక్ష్మి పండిట్ అధ్యక్షోపన్యాసం ఇవ్వగా, కవికోకిల సరోజినీ నాయుడు, భారత అణు కార్యకలాపాల పితామహుడు హోమీ జహంగీర్ బాబా, గణితం, గణాంకాలు, భాషా శాస్త్రం, చరిత్ర, జన్యు శాస్త్రాల్లో నిష్ణాతుడు అయిన శాస్త్రవేత్త దామోదర్ ధర్మానంద కోశాంబి (డి.డి. కోశాంబి) లాంటి పలువురు ప్రముఖులు హాజరు అయ్యారు. 1947 ఏప్రిల్ 2న ఢిల్లీలోని ఎర్రకోట దగ్గర జరిగిన ఏషియన్ రిలేషన్స్ కాన్ఫరెన్స్ విజయవంతమయ్యేందుకు ఫ్రెండ్స్ ఆఫ్ సోవియట్ యూనియన్ ఎంతో కృషి చేసింది. ముంబైకి చెందిన ప్రముఖ సర్జన్ డాక్టర్ ఏ.వి. బాలిగా 1952 మార్చి 14న ఇస్కస్ అంటే ఇండో సోవియట్ కల్చరల్ సొసైటీ స్థాపించారు. ముంబైలోని సుందర్‌భాయ్ హాలులో మొదటి నేషనల్ కౌన్సిల్, సమావేశం, భారత– సోవియట్ సంయుక్త సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి. డాక్టర్ ఏ.వి. బాలిగా సంస్థాపక అధ్యక్షులుగా ఎన్నిక అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇస్కస్ సభ విజయవాడలో 1954, జూన్ 11న జరిగింది. మద్రాస్ అసెంబ్లీలో నెల్లూరు ఎమ్మెల్యే ఖండవల్లి కృష్ణారావు ఈ సభకు అధ్యక్షత వహించారు. ఇస్కస్ అఖిల భారత అధ్యక్షులు డాక్టర్ ఏ.వి. బాలిగా సభను ప్రారంభించారు. సోవియట్ సంస్కృతీ మండలి ప్రతినిధి స్టైపాన్ శుమ్లుకో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'అతడు–ఆమె' నవల రచయిత ఉప్పల లక్ష్మణరావు ఇస్కస్ తొలి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. తర్వాత మన రాష్ట్రంలో పద్మావతి శాస్త్రి, గూడవల్లి నాగేశ్వరరావు, వేములపల్లి శ్రీకృష్ణ, కె. సుబ్బరాజు తదితరులు సంస్థ అభివృద్ధి కోసం కృషి చేశారు. సోవియట్ యూనియన్‌లో కమ్యూనిస్ట్ పార్టీ అధికారాన్ని కోల్పోయిన తర్వాత ఇస్కస్, 1993లో భారత సాంస్కృతిక స్నేహ సహకార సంఘం (ఇస్కఫ్)గా మార్పు చేసుకుని అన్ని దేశాలతో స్నేహ, సాంస్కృతిక సంబంధాలకు, ప్రపంచ శాంతికి, క్షీణ సంస్కృతికి వ్యతిరేకంగా విస్తృత కృషి చేస్తోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఇస్కఫ్ అధ్యక్షునిగా టి.ఎస్. సుకుమారన్, ప్రధాన కార్యదర్శిగా కాగితాల రాజశేఖర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా ఎస్. నరసింహులు వ్యవహరిస్తున్నారు. అఖిల భారత స్థాయిలో ఒడిశాకు చెందిన బిజయ్‌కుమార్ పదిహారి ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, భానుదేవ్ దత్త ఉన్నారు.



● కె. రాజశేఖర్
ప్రధాన కార్యదర్శి, ఇస్కఫ్, ఆంధ్రప్రదేశ్
(ఏప్రిల్ 26, 27 తేదీల్లో ఇస్కఫ్ 20వ రాష్ట్ర మహాసభలు)

విద్యాభారతి భవిష్యత్ చిరునామా ఏయూ

విశ్వవిద్యాలయాలు సమాజ అభివృద్ధిలో అత్యంత కీలకమైన కేంద్రాలు. ఇవి కేవలం విద్యను అందించేవే కాకుండా, దేశ భవితవ్యాన్ని తీర్చిదిద్దే శక్తిని కలిగి ఉంటాయి. శాస్త్రీయ పరిశోధనలకు వేదికలుగా పనిచేస్తూ, దేశ సాంకేతిక, ఆర్థిక అభివృద్ధికి తోడ్పడతాయి. ఆంధ్ర ప్రాంత ప్రజల బలమైన విద్యా స్వప్నాలను ఆవిష్కరించడానికి ఏర్పడిన ఆంధ్రా విశ్వవిద్యాలయం శత వసంత ఉత్సవాలు జరుపుకుంటున్న వేళ, దాని పుట్టుక, గమనం, గమ్యం గురించి పునరావలోకనం చేసుకోవటం సముచితం.

1910లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో భాగమైన ఆంధ్ర ప్రాంత ప్రజలు ద్వితీయశ్రేణి పౌరులుగా అవమానకరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్న పరిస్థితి. ఈ స్థితిలో మే, 1912లో నిడదవోలులో జరిగిన 21వ క్రిష్ణా, గుంటూరు జిల్లాల సమావేశంలో మచిలీపట్నానికి చెందిన ప్రముఖ న్యాయవాది వల్లూరి సూర్యనారాయణ, ఆంధ్రులకు ప్రత్యేక ప్రావిన్స్ ఇవ్వాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. తర్వాత గుంటూరుకి చెందిన యువకులు ఉన్నవ లక్ష్మీనారాయణ, చల్లా శేషగిరిరావు, జొన్నవిత్తుల గురునాథం, కొండా వెంకటప్పయ్యలు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవసరాన్ని గుర్తించి, ఒక ప్రజాఉద్యమాన్ని నిర్మించాలని తీర్మానించి, ఆంధ్ర మహాసభను ఏర్పాటు చేసి, దాని మొదటి సమావేశాన్ని 1913లో బాపట్లలో ఏర్పాటు చేశారు. సరిగ్గా ఈ సమయంలోనే క్రిష్ణా పత్రికలో ముట్నూరి క్రిష్ణారావు ఆంధ్రప్రాంతంలో విద్యా వెనుకబాటుతనాన్ని అధిగమించటానికి ఒక ప్రత్యేక విశ్వవిద్యాలయ అవసరాన్ని ప్రస్తావించారు. తెలుగు భాషకు గుర్తింపు, గౌరవం, ఆంధ్ర ప్రాంత ప్రజల ఉన్నతవిద్య అవసరాలతో పాటు ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకు ఈ విశ్వవిద్యాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. న్యాయపతి సుబ్బారావు అధ్యక్షతన ఆంధ్ర మహాసభ రెండవ సమావేశం (1914, బెజవాడ)లో, ఆంధ్రప్రాంత ప్రజలకు పూర్తిస్థాయి విశ్వవిద్యాలయం కావాలని మొదటిసారిగా తీర్మానించారు. ఆంధ్ర నాయకుల నిరంతర పోరాటం, ఆర్థిక విషయాలు అన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, 1924 చివరికల్లా యూనివర్సిటీ ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. ఎట్టకేలకు ఆంధ్ర యూనివర్సిటీ బిల్లు నవంబర్ 6, 1925న చట్టంగా మారింది. గవర్నర్ జనరల్ ఆమోదానంతరం జనవరి 20, 1926న అధికారిక గెజిట్‌లో ప్రచురితమై, దేశంలో 13వ విశ్వవిద్యాలయంగా ఆంధ్ర యూనివర్సిటీ ఆవిర్భవించింది.

అప్పటికి దేశంలో ఉన్న అతి గొప్ప విద్యావేత్తలలో కట్టమంచి రామలింగారెడ్డి ఒకరు. ఆయన ఇండియా, ఇంగ్లండ్‌లలో విద్యాభ్యాసం చేసి... యూరప్, అమెరికా, కెనడా, జపాన్, ఫిలిప్పైన్స్, హాంకాంగ్, మలయలోని వివిధ విద్యావ్యవస్థ, పారిశ్రామిక సంస్థలను అధ్యయనం చేశారు. తన రాజకీయ భవిష్యత్తును త్యాగం చేసిన కట్టమంచి రామలింగారెడ్డి, వైస్ ఛాన్సలర్‌గా ఏప్రిల్ 26, 1926న బాధ్యతలు స్వీకరించారు. ఆ రోజునే ఆంధ్ర యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవంగా జరుపుతున్నారు. విశ్వవిద్యాలయ అధికారిక చిహ్నాన్ని ఉపకులపతి నిర్దేశకత్వంలో కౌత రామమోహనశాస్త్రి పూర్తి చేశారు. మొదటి నాలుగు సంవత్సరాలు విజయవాడ నుంచి కార్యకలాపాలు సాగించి, పూర్తి స్థాయి విశ్వవిద్యాలయంగా రూపొందటానికి అహర్నిశలు శ్రమించి, తదనంతరం విశాఖపట్నం నుంచి తన కార్యకలాపాలు కొనసాగించింది.

1931లో తెలుగు, హిస్టరీ, పాలిటిక్స్ శాఖలతో ప్రారంభమైన ఆంధ్ర విశ్వవిద్యాలయం, తర్వాత ఫిలాసఫీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజి, జియాలజి, లా, ఇంగ్లీష్, ఎకనామిక్స్, కెమికల్ ఇంజినీరింగ్, ఫార్మసీ వంటి కోర్సులతో పాటు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ 1931, జయపూర్ విక్రమదేవ్ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ 1932, ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ 1955, డా. బి.ఆర్.అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా 1989, ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ 2006, ఆంధ్ర యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్ 2010 లను ప్రారంభించి దినదిన ప్రవర్ధమానమైంది. 450 ఎకరాల సువిశాలమైన క్యాంపస్, 6 యూనివర్సిటీ కాలేజీలు, 100కు పైగా విభాగాలలో 270కు పైగా కోర్సులు, 140 భవనాలు, 17 పరిశోధన కేంద్రాలు, ఆగ్రో ఎకనమిక్ రీసెర్చ్ సెంటర్, జనాభా పరిశోధన కేంద్రం, సిబ్బంది పిల్లలకు రెండు పాఠశాలలు (తెలుగు, ఇంగ్లీష్ మీడియం), దాదాపు 20 బాలుర, 5 బాలికల, 5 విదేశీ విద్యార్థుల వసతి గృహాలు, 3 డిస్పెన్సరీలు, 300కి పైగా స్టాఫ్ క్వార్టర్స్, 4 గెస్ట్ హౌస్‌లు, 5 క్యాంటీన్లు, ఫ్యాకల్టీ క్లబ్, ఎంప్లాయ్‌మెంట్ అండ్ గైడెన్స్ బ్యూరో, కో ఆపరేటివ్ సొసైటీ, దేశంలోనే మొదటి దూర విద్య కేంద్రం(1972), బ్యాంకులు, పోస్ట్ ఆఫీస్, లాంటి భౌతిక వనరులు, వసతులతో పాటు, 5 లక్షల పుస్తకాలు, 300కు పైగా దేశ, విదేశీ జర్నల్స్, 8,000కు పైన ఈ జర్నల్స్, 15,000కు పైగా వినియోగదారులు ఉన్న అతి విశాలమైన గ్రంథాలయం, ఏటా వెయ్యికి పైగా పరిశోధన పత్రాలు, 400కు పైగా పీహెచ్‌డీలు, 100కు పైగా సెమినార్లు, 400 ఎండోమెంట్ అవార్డులు వంటి మేధోవనరులతో పాటు, వేయిమందికి పైగా విదేశీ విద్యార్థులతో విశ్వవిద్యాలయం అలరారుతోంది.


ప్రఖ్యాత విద్యావేత్తలు తమ మేధస్సుతో విశ్వవిద్యాలయాల లక్ష్యాలైన బోధన, పరిశోధన, విస్తరణలకు వన్నెలద్దారు. వారు వేసిన మేధోపునాదుల పైన నేటికీ జాతీయ స్థాయిలోని అన్నిరకాల, విద్యార్యాంకింగ్‌లలో ఆంధ్ర విశ్వవిద్యాలయం తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటూనే ఉంది. విశ్వవిద్యాలయ ఏర్పాటుకు, అభివృద్ధికి కృషి చేసిన ఎవరి శ్రమ వృథా పోలేదు. ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ బహుమతితో పాటు దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన భారతరత్నతో సహా అన్ని అవార్డులు ఈ విశ్వవిద్యాలయ విద్యార్థులు, ఉపాధ్యాయులకు లభించాయి. ఇక భారత రాజకీయాలలో ఈ యూనివర్సిటీ పాత్ర అనన్య సామాన్యం. ఒక్క ప్రధానమంత్రి పదవి తప్ప, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, ముఖ్యమంత్రి, గవర్నర్లు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర మంత్రులు, స్పీకర్లు, యూజీసీ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లను విశ్వవిద్యాలయం జాతికి అందించింది.

ప్రఖ్యాత విద్యావేత్తలు తమ మేధస్సుతో విశ్వవిద్యాలయాల లక్ష్యాలైన బోధన, పరిశోధన, విస్తరణలకు వన్నెలద్దారు. వారు వేసిన మేధోపునాదుల పైన నేటికీ జాతీయ స్థాయిలోని అన్నిరకాల, విద్యార్యాంకింగ్‌లలో ఆంధ్ర విశ్వవిద్యాలయం తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటూనే ఉంది. విశ్వవిద్యాలయ ఏర్పాటుకు, అభివృద్ధికి కృషి చేసిన ఎవరి శ్రమ వృథా పోలేదు.



ప్రపంచీకరణ తర్వాత విద్యా వ్యవస్థలో వచ్చిన గణనీయమైన మార్పుల వల్ల భారతీయ విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాల్సిన అవసరం ఏర్పడింది. శాస్త్ర సాంకేతిక రంగాలలో భారతదేశానికి నోబెల్ బహుమతులు సంపాదించిన నాలుగు విశ్వవిద్యాలయాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఒకటి. పూర్తిగా ప్రాంతీయ, విద్యా అవసరాల కోసం ఏర్పడిన ఈ విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెంది, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో తన ఆగమనాన్ని చాటుకోవడం ద్వారా మాత్రమే విశ్వవిద్యాలయం రెండవ శతాబ్దంలోకి సగర్వంగా ప్రవేశించగలదు. తద్వారా ఇది భారతీయ విద్యా భవిష్యత్‌కు చిరునామాగా మారగలదు. దానికోసం పాలకులు, ఆచార్యులు, పరిశోధకుల నిరంతర కృషి అనివార్యం.

■ డాక్టర్ శామ్యూల్ జాన్ ఆదూరి
ఫ్యాకల్టీ, డిపార్ట్మెంట్ ఆఫ్ సోషియాలజి
(నేడు ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది వేడుకలు ప్రారంభం)





జేవీ విధానంలోనే మెట్రో

అన్ని నగరాల మాదిరిగానే విజయవాడ మెట్రో కూడా..

- కేంద్రం 20 శాతం, రాష్ట్రం 20 శాతం వాటా
- మిగిలిన 60 శాతం వాటా థర్డ్‌పార్టీ నుంచి అప్పుగా..
- మెట్రో ప్రాజెక్టుపై స్పష్టతనిచ్చిన కేంద్రం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టును జాయింట్ వెంచర్ (జేవీ) విధానంలోనే ముందుకు తీసుకెళ్లాలని కేంద్రం నిర్ణయించింది. విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు నూరుశాతం కేంద్రం భరించాలని ఏపీఎంఆర్‌సీ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా కేంద్రానికి విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. దేశంలోని అన్ని నగరాలకు ఏ విధంగా మెట్రో ప్రాజెక్టులను ఇచ్చామో, అలాగే విజయవాడ, విశాఖకు కూడా వర్తిస్తుందని కేంద్రం స్పష్టం చేసింది. దీంతో భాగస్వామ్య విధానంలోనే మెట్రో ప్రాజెక్టుకు అడుగులు పడుతున్నాయి. జాయింట్ వెంచర్ విధానంలో ప్రాజెక్టు వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 20 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం వాటాలు భరించాల్సి ఉండగా, మిగిలిన 60 శాతం మిగతా 4లో..



అందంగా ముస్తాబైన రాయనపాడు శాటిలైట్ రైల్వేస్టేషన్

రాయల్‌గా రాయనపాడు

- సకల సదుపాయాలతో శాటిలైట్ రైల్వేస్టేషన్
- పూర్తయిన తొలిదశ అభివృద్ధి, ఆధునికీకరణ
- వెస్ట్ బైపాస్ మీదుగా రాజధానికి దగ్గరి దారి

6లో

అన్నదమ్ముల సవాల్

కేశినేని బ్రదర్స్ మధ్య ముదిరిన మాటల యుద్ధం

- ఐదు రోజుల్లో క్షమాపణ చెప్పాలని ఎంపీ చిన్ని డిమాండ్
- లేదంటే రూ.100 కోట్లకు దావా వేస్తానంటూ నోటీసు
- రూ.లక్ష కోట్లకు వేసుకున్నా లొంగనన్న మాజీ ఎంపీ నాని
- సమాధానాలు కావాలి కానీ, బెదిరింపులు కాదని వ్యాఖ్య

కేశినేని బ్రదర్స్ మధ్య వివాదం మరింత ముదురుతోంది. తనపై చేసిన ఆరోపణలను సీరియస్‌గా తీసుకున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని).. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే రూ.100 కోట్లకు దావా వేస్తానని హెచ్చరిస్తూ శుక్రవారం మాజీ ఎంపీ కేశినేని నానికి లీగల్ నోటీసు పంపారు. ఈ నోటీసుకు స్పందించిన నాని ఫేస్‌బుక్ వేదికగా ఘాటుగా విమర్శలు చేశారు. రూ.లక్ష కోట్లకు దావా వేసుకున్నా లొంగబోనని చెప్పడంతో అన్నదమ్ముల మధ్య మాటల చిచ్చు మరింత రాజుకుంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

లక్షల కోట్లకు వేసుకో.. లొంగేది లేదు: కేశినేని నాని



తన సోదరుడు కేశినేని చిన్ని పంపిన లీగల్ నోటీసును ఉటంకిస్తూ మాజీ ఎంపీ కేశినేని నాని కూడా ఫేస్‌బుక్ వేదికగా స్పందించారు. 'నేను విజయవాడ అభివృద్ధి కోసం నిజాయితీగా, పారదర్శకంగా, గర్వంగా సేవ చేశాను. నువ్వు రూ.100 కోట్లకు కాదు. రూ.లక్ష కోట్లకు పరువు నష్టం దావా వేసినా ప్రజల సంపద దోచుకునే వారిపై నా పోరాటం ఆగదు. భయంతో బెదిరింపులకు లొంగేది లేదు' అంటూ సుదీర్ఘంగా పోస్టు పెట్టారు. తనకు పంపిన లీగల్ నోటీసు కేవలం బెదిరింపు మాత్రమే కాదని, విమర్శలను అణచివేయటానికి, మౌనంగా ఉంచడానికి, నోరు మూయించడానికి చేస్తున్న స్పష్టమైన ప్రయత్నమని, తాను మాత్రం మౌనంగా ఉండనని పేర్కొన్నారు. సత్యం బెదిరింపులకు లొంగదని, తానూ లొంగనని చెప్పారు. ప్రశ్నలు లేవనెత్తినపుడు సమాధానాలు కావాలి కానీ, బెదిరింపులు కాదన్నారు. పదేళ్లపాటు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహించే గౌరవం తనకు దక్కిందని, జవాబుదారీతనం, పారదర్శకత, నిజాయితీతో బాధ్యతలను నిర్వహించానన్నారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి గర్వంగా సేవ చేశానని, తాను దేనికోసం నిలబడ్డానో, దేనికి వ్యతిరేకంగా పోరాడుతున్నానో తెలుసు' అని పేర్కొన్నారు.

బహిరంగ క్షమాపణ.. లేదంటే రూ.100 కోట్లకు దావా : కేశినేని చిన్ని



తన సోదరుడు, మాజీ ఎంపీ కేశినేని నాని రెండు రోజులుగా ఎక్స్, ఇతర సోషల్ మీడియా వేదికగా చేస్తున్న అవినీతి ఆరోపణలపై ఎంపీ కేశినేని చిన్ని రూ.100 కోట్లకు పరువు నష్టం దావా వేస్తానంటూ లీగల్ నోటీసు పంపారు. ఉర్సా కంపెనీ తన బినామీగా ఉందని ఆరోపణలు సంధించటంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు లిఖితపూర్వక ఫిర్యాదు ఇవ్వటం, ఫేస్‌బుక్, ఎక్స్‌లో తనపై తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు చేయటాన్ని చిన్ని సీరియస్‌గా తీసుకున్నారు. సమాజంలో తనకు ఉన్న పరపతిని, పరువు, ప్రతిష్ఠలను దిగజార్చేలా వ్యాఖ్యలు చేశావని నానికి పంపిన లీగల్ నోటీసులో ఆయన పేర్కొన్నారు. మానసికంగా ఇబ్బందులు కలగజేయటంతో పాటు తన ప్రతిష్ఠను మరింత దిగజార్చేలా వ్యవహరించటాన్ని ప్రస్తావిస్తూ ఐదు రోజుల్లో తనకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, ఫేస్‌బుక్, ఎక్స్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో క్షమాపణలు తెలుపుతూ పోస్టు చేయాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పకపోయినా, తనపై సోషల్ మీడియా వేదికగా చేసిన ఆరోపణలను తొలగించకపోయినా రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

చాటింగ్.. డేటింగ్.. జంపింగ్

పోలీసుల అదుపులో ఘరానా మోసగాడు



నాగతేజ

- నగర యువతితో చాటింగ్.. డేటింగ్ ప్రపోజల్
- ఏకాంత సమయంలో చేతులు, కాళ్లు కట్టేసి బంగారంతో జంప్
- గతంలోనూ ఇద్దరిని మోసంచేసిన హైదరాబాద్ యువకుడు
- దొంగిలించిన డబ్బుతో క్రికెట్ బెట్టింగ్‌లు

జల్సాలకు అలవాటు పడ్డాడు.. క్రికెట్ బెట్టింగులకు బానిసయ్యాడు.. డబ్బు కోసం అడ్డదారులు తొక్కాడు.. డేటింగ్ యాప్‌లో రిజిస్టర్ అయ్యాడు.. యువతులకు వల విసిరేవాడు.. హాయ్.. అంటూ మాట కలిపేవాడు.. తొలుత కొంత నగదు వారికి పంపించేవాడు.. యువతులకు నమ్మకం కుదిరాక వారితో సన్నిహితంగా ఉండేందుకు కొంత మొత్తంలో ఆఫర్ చేసేవాడు.. ఏకాంతంగా ఉన్న సమయంలో ఉండగా బంగారం, నగదుతో ఉడాయించేవాడు. చిన్న వయస్సులోనే ఘరానా దొంగతనాలకు పాల్పడుతున్న ఓ యువకుడిని పోలీసులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు.

విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని ప్రగతి నగర్‌కు చెందిన కిలారు నాగతేజ (23) బీటెక్ మూడో సంవత్సరం మధ్యలోనే మానేశాడు. తల్లిదండ్రులు వంట పనిచేస్తూ జీవిస్తున్నారు. వీరి స్వగ్రామం బాపట్ల కాగా, 20 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లిపోయారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన నాగతేజ అడ్డదారులు తొక్కాడు. డేటింగ్ యాప్‌లు, ఇన్‌స్టాలోనూ యువతులతో చాటింగ్ చేసి మోసానికి తెరతీసేవాడు. అలాగే, ఈనెల 22న మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌కు నగరానికి చెందిన యువతితో వెళ్లాడు. ఏకాంత సమయంలో ఆమె చేతులు, కాళ్లు కట్టేశాడు. అనంతరం ఆ యువతికి చెందిన 20 గ్రాముల బంగారాన్ని, కొంత నగదు తీసుకుని ఉడాయించాడు. అనంతరం ఆ బంగారాన్ని నగరానికి చెందిన ఓ వ్యక్తికి విక్రయించి గుంటూరుకు చేరుకున్నాడు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు రైల్లో వెళ్లిపోయాడు. బంగారం అమ్మగా వచ్చిన నగదుతో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు ఆడాడు. ఈ ఘటన వివరాలు తెలుసుకున్న మాచవరం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రెండు రోజులుగా ఇన్‌స్టాగ్రామ్ ఐడీతో పాటు మెయిల్ ఐడీ ద్వారా జల్లెడ పట్టారు. చివరికి నాగతేజ ఆచూకీ హైదరాబాద్‌లో ఉందని తెలిసింది. శుక్రవారం నాగతేజను అదుపులోకి తీసుకున్నారు. కాగా, గతంలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యువతులను మోసంచేసి నగదుతో పారిపోయిన ఇతను చర్లపల్లి జైల్లో శిక్ష కూడా అనుభవించాడు.

కారు బీభత్సం

జగ్గయ్యపేటలో ఒక్కసారిగా కూలీలపైకి దూసుకొచ్చిన కారు

- ఐదుగురు కార్మికులకు గాయాలు
- స్తంభాన్ని ఢీకొట్టి ఆగడం వల్ల తప్పిన ప్రమాదం
- మద్యం సేవించి కారు నడిపిన డ్రైవర్



కారు ప్రమాద సీసీ ఫుటేజీ దృశ్యం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చెరువు బజార్‌లోని కొత్త రైతుబజార్ వద్ద శుక్రవారం ఓ కారు బీభత్సం సృష్టించింది. భవన నిర్మాణ కార్మికుల అడ్డాపైకి ఒక్కసారిగా దూసుకొచ్చింది. అనంతరం ఇనుప స్తంభాన్ని ఢీకొని ఆగిపోవటంతో ఐదారుగురు కార్మికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్తంభాన్ని ఢీకొని ఆగడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. చెరువుబజార్‌లో నివాసం ఉంటున్న కారుడ్రైవర్ వెంకటేశ్వర్లు మద్యం సేవించి శుక్రవారం ఉదయం 8 గంటల సమయంలో కారును వేగంగా నడిపాడు. ముందుగా ఓ బైక్‌ను ఢీకొట్టడంతో కారు వేగం తగ్గి కారు దిశ మారింది. కారు వేగంగా ఉండి ఉంటే.. మరం రోడ్డులోకి కాకుండా నేరుగా బస్టాండ మిగతా 4లో..

చకచకా



రహదారులపై ఏర్పాటు చేసిన పూల మొక్కలు

- అమరావతిలో ఘనంగా ప్రధాని సభా ఏర్పాట్లు
- తుదిదశకు చేరుకున్న మూడు వేదికలు
- ఆకర్షణీయంగా వీఐపీ మార్గాలు
- రోడ్డు షో జరిగే దారిలో ఆకట్టుకునే లైటింగ్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వచ్చేనెల 2వ తేదీన అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన సభా ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయి. వేదిక పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. గ్యాలరీలతో పాటు మూడు వేదికలు పూర్తయ్యాయి. కూటమి పార్టీల కలయికకు చిహ్నంగా గ్యాలరీ వేదికల లోపలి భాగంలో పసుపు, ఎరుపు, కాషాయం రంగులతో అలంకరిస్తున్నారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి సభాస్థలికి వెళ్లే ప్రాంతాల్లో రోడ్ల పనులు చేపట్టారు. రోడ్ల వెంబడి ఆకర్షణీయమైన మొక్కలు నాటుతున్నారు. వీఐపీ మార్గంలో అందమైన పూలకుండీలు ఏర్పాటు చేస్తున్నారు. తబలా ఆకారంలోని పూలకుండీలు ఆకర్షిస్తున్నాయి. ప్రధాని రోడ్డు షో నిర్వహించే దగ్గర లైటింగ్‌ను అధికారులు పరిశీలించారు.



సిద్ధమవుతున్న సభా వేదిక

కోరమాండల్‌లో మంటలు

తెలప్రోలు స్టేషన్ దాటాక పార్శిల్ వ్యాన్ బోగీ చక్రాల్లో మంటలు

- అప్రమత్తమైన లోకో పైలెట్
- రైలును ఆపి మంటలు అదుపులోకి..





బయటకు దిగిన ప్రయాణికులు (ఇన్‌సెట్‌లో) పార్శిల్ బోగీ కింద నుంచి వస్తున్న పొగ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం తప్పింది. తేలప్రోలు స్టేషన్ దాటాక కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ పార్శిల్ బోగీ రైల్వే చక్రాల దగ్గర ఒక్కసారిగా మంటలు వచ్చాయి. వెంటనే పొగలు వ్యాపించాయి. దీంతో లోకో పైలెట్ వెంటనే అప్రమత్తయ్యాడు. రైలును నిలుపుదల చేసి ఫోమ్ సిలిండర్ సహాయంతో మంటలు ఆర్పాడు. బ్రేకు స్ట్రక్ కావటం వల్ల ఈ మంటలు తలెత్తాయని భావించిన పైలెట్ కొద్దిసేపు రైలును నిలుపుదల చేశాడు. ఏం జరుగుతుందో తెలియక ప్రయాణికులంతా కిందకు దిగి చూశారు. లోకో పైలెట్ అప్రమత్తత వల్ల పెను ప్రమాదం తప్పిందని ఊపిరిపీల్చుకున్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టండి

ఆర్డీవో, తహసీల్దార్లతో కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష

- అవకతవకలపై దృష్టి పెట్టాలని ఆదేశం

4లో

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

కూలర్‌లో నీరు పోస్తుండగా ఘటన

- పది రోజుల్లో పెళ్లింట విషాదం
- వత్సవాయిలో ఘటన

4లో

ఎన్నారైల జోలికొస్తే ఖబడ్దార్!

» జగన్ రెడ్డి అండ్ బ్యాచ్‌పై కేశినేని శివనాథ్ ఆగ్రహం

» పెట్టుబడులు పెట్టే వారికి అండగా ఉంటానని భరోసా



కేశినేని శివనాథ్

వన్‌టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే ఎన్నారైలకు తాను భరోసాగా ఉంటానని.. వారిజోలికి ఎవరైనా వస్తే ఖబడ్దార్ అంటూ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హెచ్చరించారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన జగన్ అండ్‌కోపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే మాజీ సీఎం, ఎమ్మెల్యే జగన్ రెడ్డి వికృత చేష్టలకు తెరలేపారన్నారు. ఎన్నారైలు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సూట్‌కేస్ కంపెనీల వ్యక్తుల మాటలను నమ్మవద్దని చెప్పారు. పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్న ఎన్నారైలపై అసత్య ఆరోపణలు చేస్తూ జగన్ బ్యాచ్ వెనక్కి పంపేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావాలని, పెట్టుబడులు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజా ప్రతినిధులందరూ కృషి చేస్తుంటే జగన్ మాత్రం తన డ్రామాలతో అవి వెనక్కి వెళ్లిపోయేందుకు చూస్తున్నాడన్నారు. ఉర్సా సంస్థ సీఈవో సతీష్ క్లౌడ్, ఏఐ టెక్నాలజీ నిపుణుడిగా ఉన్నారని, ఆయన కంపెనీలో ప్రమోటర్లకు రూ.3,700 కోట్లకు పైగా నెట్‌వర్క్ ఉందని, అటువంటి వ్యక్తి డేటాసెంటర్ పెట్టేందుకు ముందుకు వస్తే 99 పైసలకే స్థలం ఇచ్చామని జగన్ రెడ్డి బ్యాచ్ విష్రప్రచారం చేస్తున్నదని, దమ్ముంటే ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. ఎన్నారైలను విమర్శించటం సిగ్గుచేటన్నారు. తనపై ఎలాంటి రాజకీయ విమర్శలు చేసినా ఊరుకుంటాను గాని, పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే ఎన్నారైలను భయపెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. పెట్టుబడుదారుల జోలికి, ఎన్నారైల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు.

సీఎం బాబు దృష్టికి జిల్లా సమస్యలు

» రోడ్డు కనెక్టివిటి, తాగు, సాగునీటిపై నెట్టెం వినతి



చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలు సమస్యలపై ప్రత్యేకంగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం విజ్ఞాపన పత్రం అందజేశారు. గురువారం ఆయన వెలగపూడి సచివాలయంలో ప్రత్యేకంగా కలిశారు. జిల్లాలో జగ్గయ్యపేట సమీపంలో కాలం చెల్లిన పాలేటి బ్రిడ్జిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని, ముక్త్యాల-మాదిపాడు మధ్య కృష్ణానదిపై నిర్మిస్తున్న బ్రిడ్జికి ఖమ్మం-విజయవాడల మధ్య నిర్మిస్తున్న హైవేకు, గుంటూరు జిల్లాలో మద్దిపాడు నుంచి సత్తెనపల్లి వద్ద హైవేకు అనుసంధానం చేయాలని, తద్వారా అంతర్రాష్ట్ర రవాణా మరింత పెరగటంతో పాటు సరిహద్దు గ్రామాలకు అమరావతి రాజధానికి రవాణా సౌకర్యం ఏర్పడుతుందని వివరించారు. నవ్యాంధ్ర ఏర్పడిన తొలి ఐదేళ్లలో శంకుస్థాపన చేసిన ముక్త్యాల ఎత్తిపోతల పథకాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగించి, తిరిగి అంచనాలు వేసి ప్రారంభించాలన్నారు. సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించారని నెట్టెం చెప్పారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్

భద్రత విషయంలో రాజీపడం : నాదెండ్ల

విజయవాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదులు అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం దుర్మార్గమని జనసేన ఎమ్మెల్యే, మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపు మేరకు మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, జనసేన పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోని ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తోందని తెలిపారు. ప్రజల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడదని, నిఘా వర్గాల సమాచారం మేరకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు మనమంతా ఐక్యంగా ఉండాలని, భారతీయులుగా బాధితులకు భరోసా కలిగించాలని అన్నారు. నిరసనలో సామినేని ఉదయభాను, అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రామారావు

ఆంధ్ర హాస్పిటల్స్‌లో 15 మంది పిల్లలకు


విజయవంతంగా గుండె శస్త్ర చికిత్సలు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర హాస్పటల్స్‌లో హీలింగ్ లిటిల్ హార్ట్స్, యూకే ఛారిటీ సౌజన్యంతో 34వ ఉచిత పిల్లల గుండె సర్జరీల క్యాంపు ఏప్రిల్ 21 నుంచి 25 వరకు నిర్వహించినట్టు హాస్పిటల్స్ చీఫ్ ఆఫ్ చిల్డ్రన్ సర్వీసెస్ అండ్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ జగన్నాథ్, ఉష శెట్టి, అశ్విని కుమారస్వామి (బెంగళూరు), డాక్టర్ నాగేశ్వరరావు (ఆంధ్ర హాస్పిటల్స్, విజయవాడ) బృందం 15మంది పిల్లలకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించినట్టు తెలిపారు. అత్యంత క్లిష్టమైన గుండె జబ్బులు టెట్రాలజీ ఆఫ్ ఫాలో, డివోఆర్‌వి, ఇతర క్లిష్టమైన గుండె ఆపరేషన్లు జరిగాయని వెల్లడించారు. ఆంధ్ర మదర్ అండ్ చైల్డ్ ఫౌండేషన్, మహేష్‌బాబు ఫౌండేషన్, ఎన్టీఆర్ వైద్య సేవ సహకారంతో ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

» కూలర్‌లో నీరు పోస్తుండగా ఘటన

» పదిరోజుల్లో పెళ్లి ఇంట విషాదం



కంచర్ల జితేంద్ర

వత్సవాయి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మరో పదిరోజుల్లో పెళ్లి బాజాలు మోగనున్న ఆ ఇంట విషాదం చోటు చేసుకుంది. వివాహం కావాల్సిన సమయంలో విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తాళ్లూరి గ్రామానికి చెందిన కంచర్ల వెంకటకృష్ణ-భూలక్ష్మి దంపతులకు ఒక్కడే కొడుకు. తండ్రి రెండేళ్ల క్రితం మృతిచెందగా కొడుకు కంచర్ల జితేంద్ర (25) ఆటోలో ఉల్లిపాయల వ్యాపారం చేసుకుంటూ తల్లిని పోషిస్తున్నాడు. గురువారం రాత్రి ఇంట్లోని కూలర్‌లో నీళ్లు పోస్తూ విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. మరో పదిరోజుల్లో అతడికి బంధువుల అమ్మాయితో వివాహం జరిగాల్సి ఉంది. ఇంతలోనే అతను మృతి చెందడంలో కుటుంబసభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టండి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

» ఆర్డీవో, తహసీల్దార్లతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సమీక్ష

» అవకతవకలపై దృష్టి పెట్టాలని ఆదేశం



రైతులు, మిల్లర్లతో మాట్లాడుతున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం రైతుల కష్టాలు, మిల్లర్లు, దళారుల దోపిడీపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'దయనీయం' కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలపై దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. కొనుగోళ్లు నిలిచిపోవడానికి కారణమైన బ్యాంక్ గ్యారెంటీలపై మరో కోటి వరకూ రాయితీని ప్రకటించారు. తక్షణమే కొనుగోళ్లు నిర్వహించాలని ఆదేశించారు. వాహనాలు సిద్ధం చేయని ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో ఆర్డీవోల సహకారంతో లారీలు తెప్పించుకోవాలని సూచించారు. తొలుత తహసీల్దార్లు వాహనాలకు డీజిల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌పోర్టు బిల్లులను కూడా తక్షణమే అందించేలా చర్యలు చేపడతామని సూచించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లు మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎక్కడ రైతుకు ఇబ్బంది జరిగినా తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. డివిజన్‌లోని పలు మిల్లుల వద్దకు వెళ్లి రైతులు, మిల్లర్లతో మాట్లాడారు. మిల్లుకు వచ్చిన సరుకును ఆలస్యం లేకుండా దిగుమతి చేసుకోవాలని సూచించారు. పీపీసీల ద్వారా కాకుండా నేరుగా రైతుల వద్ద తక్కువ ధరకు మిల్లర్లు కొనుగోలు చేసినట్టు తెలిస్తే క్రిమినల్ చర్యలు సైతం తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రైతుల వద్ద ధాన్యం పూర్తిగా కొనుగోలు జరిగే వరకూ కొనుగోళ్లపై నిఘా ఉంటుందని హెచ్చరించారు.

కొనుగోళ్ల మాటేమిటి..!

జిల్లాలో మొత్తం 1.66 లక్షల టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నాయి. జిల్లా పౌరసరఫరాల శాఖ కేవలం 50 వేల టన్నుల కొనుగోలుకు మాత్రమే సిద్ధంగా ఉంది. జిల్లాలో మొత్తం 27 మిల్లులు ఉండగా, వాటిలో 17 మిల్లులు మాత్రమే కొనుగోళ్లు చేస్తున్నాయి. వీటిలో ఆరు మిల్లులు ఉప్పుడు బియ్యం(ఎంటీయూ 1010 రకం) కొనుగోలు చేస్తున్నాయి. ఇటీవల నిబంధనలు అతిక్రమించారన్న కారణంతో రెండు మిల్లులను అధికారులు సీజ్ చేశారు. ఈ రకం బియ్యం జిల్లాలో యాభైవేల టన్నులకు పైబడి ఉంది. ఇంతపెద్ద మొత్తంలో నిల్వలను ఆ నాలుగు మిల్లులు సేకరించే అవకాశం కనిపించడం లేదు. దీంతో రైతులు తక్కువ ధరకు దళారులను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఫలితంగా క్వింటాకు రూ.2320కి బదులు కేవలం రూ.1200 నుంచి రూ.1500 వరకే ధర పొందగలుగుతున్నారు. రైతులను ఆదుకోవాలంటే తక్షణం మిల్లుల సంఖ్య పెంచాల్సి ఉంది. ఇప్పటికిప్పుడు కొత్తగా మిల్లులను కల్పించే అవకాశాలు కనిపించడం లేదు. భారీఎత్తున ధాన్యం ఆడించాలంటే ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను దిగమతి చేసుకోవాల్సి ఉంది. అధికారులు ముందస్తు ప్రణాళికలు లేక పోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని, ఈక్రమంలో రైతును ఆదుకొనేందుకు ఏం చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.

● భారీఎత్తున ధాన్యం కొనుగోళ్లు చేపట్టాల్సిన సమయంలో జాయింట్ కలెక్టర్ జనవరిలో సెలవుపై వెళ్లగా ఇంత వరకూ ప్రభుత్వం ఆ పోస్టుకు ఇన్‌చార్జిని నియమించలేదు. జేసీ ఉంటే దిగుబడుల ఆధారంగా కొనుగోళ్ల ఏర్పాట్లు సమీక్షించి ఆ దిశగా చర్యలు చేపట్టే వారు. మరో వైపు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులూ కార్యాలయాలకే పరిమితమవడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమకు అండగా నిలవాలని రైతులు కోరుతున్నారు.

తక్కువ ధరకు విక్రయించొద్దు

» పుకార్లు నమ్మవద్దు : గుమ్మడి వెంకటేశ్వరరావు

గాంధీనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రబీ ధాన్యాన్ని మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించవద్దని ఏపీ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు రాష్ట్రంలోని రైతాంగానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వ నాణ్యతా ప్రమాణాలు కలిగిన ఎఫ్, ఏక్యూ ధాన్యాన్ని ఎంఎస్‌పీ చెల్లించి కొనేందుకు రైస్ మిల్లర్లు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎవరైనా మిల్లర్లు కొనుగోలు చేయకుంటే 73866 23036 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే అసోసియేషన్ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. గాంధీనగర్‌లోని రైస్‌మిల్లర్ల అసోసియేషన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. మిల్లర్లు రైతుల ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, రబీ ధాన్యం సేకరణ నిలిపివేశారన్న పుకార్లను నమ్మవద్దని కోరారు. 75 కిలోల బస్తా ధాన్యానికి రూ.1725 మద్దతు ధరను చెల్లిస్తామన్నారు. 2024-25 రబీ కాలంలో 12 జిల్లాల నుంచి 53,890 మంది రైతుల నుంచి రూ.1318 కోట్లు చెల్లించి 5,71,109 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు తెలిపారు. ధాన్యం రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు రైస్ మిల్లింగ్ ఇండస్ట్రీ కూడా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో షేక్ బాజీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ జరుగుతున్న తీరిది..

గ్రామాల్లో ధాన్యం కొనుగోలుకేంద్రాలు తేమశాతం పరీక్షించి అందుకు సంబంధించిన పత్రాలను రైతులకు అందజేస్తారు. ధాన్యాన్ని మిల్లుల వద్దకు తీసుకువచ్చిన అన్నదాతలను విల్లర్లు వ్యూహాత్మకంగా దిగుమతి ఆలస్యం చేసి మరోమారు తేమ పరీక్షలు చేస్తున్నారు. అధిక తేమ ఉందని, నూకశాతం కూడా ఎక్కువగా ఉందని చెబుతున్నారు. కనీసం ఐదు కిలోల తారం తీస్తే తప్ప ధాన్యం కొనలేమని స్పష్టం చేస్తున్నారు. పండించిన పంట ఇళ్లలో నిల్వ ఉంచలేని స్థితితో పాటు రోజుల తరబడి మిల్లుల వద్ద వేచి ఉండటంతో విసుగు చెందిన అన్నదాతలు తెచ్చిన పంటను వెనక్కు తీసుకువెళ్లలేక మిల్లర్లకు తలొగ్గుతున్నారు. తరుగు తీసేందుకు అంగీకరిస్తున్నారు. తరుగు ద్వారా దోపిడీ చేసిన మొత్తం ధాన్యాన్ని మిల్లర్లు అనుచరుల పేరుతో కొనుగోలు చేసినట్టు చూపి ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకుంటూ లబ్ధి పొందుతున్నారు. మరోవైపు పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల సకాలంలో బ్యాగ్‌లు, రవాణా వాహనాలు అందక నిస్సహాయ స్థితిలో ఉన్న రైతుల నుంచి అతి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధరకు విక్రయిస్తున్నారు. అవినీతి వెనుక అధికారుల హస్తం ఉందని, అన్నదాతను దోపిడీ చేస్తున్నా పాలకులు సైతం పట్టించుకోక పోవడం విస్మయం కలిగిస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు.



వర్షం భయంతో ధాన్యంపై పట్టాలు కప్పుతున్న రైతులు

సమగ్ర దర్యాప్తు జరపాలి..

మిల్లర్ల దోపిడీపై విజిలెన్స్ విచారణ జరపాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లో వారు ప్రోత్సహిస్తున్న దళారులపైనా నిఘా పెట్టాలని కోరుతున్నారు. మిల్లర్లు, దళారులకు అనుసంధానంగా ఉంటూ ఆర్థిక లబ్ధి పొందిన అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటున్నారు.

సమస్యలు పరిష్కరించరూ!

» మంత్రి రవీంద్రకు ప్రజల వినతులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయం వద్ద ప్రజల నుంచి మంత్రి కొల్లు అర్జీలు స్వీకరించారు. చిన్నాపురం రైతులు తమ సమస్యలను వివరించారు. గుండేరు పాత బ్రిడ్జిపై ఉన్న మంచినీటి పైపులైన్లు సరిగా పనిచేయడం లేదని చిన్నాపురం గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావులు మంత్రికి వివరించారు. వెంకటాపురం నుంచి చిన్నాపురం వరకు మంచినీటి పైపులైన్లు సరిగా లేకపోవడం వల్ల ప్రజలకు తాగునీరు అందడం లేదన్నారు. వెంకటాపురంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. మంచినీటి చెరువుల్లో పశువులు తిరుగుతున్నాయన్నారు. జీ ప్లస్-3 ఇళ్లకు తమవంతు డబ్బు చెల్లించామని, అయితే ఐదేళ్లుగా భవనాలు ఇవ్వడం లేదని, మౌలిక సదుపాయాలు కల్పించాలని పలువురు అర్జీలు సమర్పించారు. మచిలీపట్నం బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్న దృష్ట్యా ఫోటోగ్రాఫర్లకు ప్రివెడ్డింగ్ షూట్‌కు స్థలం కేటాయించాలని సంఘ నాయకులు చిలంకుర్తి శేషుబాబు తదితరులు కోరారు. మచిలీపట్నంలోని పట్టాభి స్మారక భవన నిర్మాణానికి హైకోర్టు ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకోవాలని కమిటీ ప్రధాన కార్యదర్శి పీవీ ఫణికుమార్ కోరారు. తదితర సమస్యలపై పలువురు మంత్రికి వినతిపత్రాలను అందజేశారు. ప్రజల వినతులపై ఆయా శాఖల అధికారులను సంప్రదించి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి చెప్పారు.

సంస్థాగత ఎన్నికలపై దృష్టి

మచిలీపట్నం టౌన్ : మే 2న రాజధాని అమరావతికి ప్రధాని మోదీ వస్తున్న సందర్భంగా నియోజకవర్గం నుంచి నాలుగు వేల మందిని తీసుకుని వెళ్లేందుకు పార్టీశ్రేణులు చిత్తశుద్ధితో కృషి చేయాలని మంత్రి రవీంద్ర అన్నారు. శుక్రవారం రాత్రి నాయకులు, కార్యకర్తల విస్తృత సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకు వెళ్లాలన్నారు. రానున్న మునిసిపల్ ఎన్నికలకు ఇప్పటి నుంచే ప్రణాళికా బద్ధంగా పనిచేయాలన్నారు. సమావేశంలో మోటమర్రి బాబాప్రసాద్, గొర్రెపాటి గోపీచంద్, ఎండీ ఇలియాస్ పాషా, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్, కాగిత వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని తదితరులు పాల్గొన్నారు.

జేవీ విధానంలోనే మెట్రో

(3వ పేజీ తరువాయి)

వాటాను థర్డ్‌పార్టీ ఫైనాన్స్ సంస్థల దగ్గర అప్పు తీసుకోవాల్సి ఉంటుంది. ఏ సంస్థ దగ్గర అప్పు తీసుకోవాలన్నది కేంద్ర ప్రభుత్వమే నిర్దేశిస్తుంది. థర్డ్ పార్టీ ఫైనాన్స్ సంస్థలను నిర్దేశించాలంటే.. ప్రస్తుతం ఏపీఎంఆర్‌సీ, రాష్ట్ర ప్రభుత్వం పంపించిన డీపీఆర్‌కు కేంద్రం ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇది జరగాలంటే విజయవాడ నగరంలో సమగ్ర రవాణా ప్లాన్ (సీఎంపీ)ను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇప్పటికే కన్సల్టెంట్‌ను ఎంపిక చేశారు. ఆరు నెలల్లో ఈ నివేదిక పూర్తవుతుంది. కానీ, పనుల్లో వేగం తీసుకురావటం కోసం 3 నెలల్లో అందించాలని ఏపీఎంఆర్‌సీ కోరింది. రెండున్నర నెలల్లోనే సీఎంపీ ఇచ్చేందుకు కన్సల్టెన్సీ సంస్థ సర్వే చేపడుతోంది. ప్రస్తుతం నెల సమయం గడిచింది. మరో నెలన్నరకు సీఎంపీ వస్తుంది. ఆ ప్లాన్ రాగానే ఏపీఎంఆర్‌సీ.. కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తుంది. కేంద్రం ఆమోదం తెలిపే సందర్భంలో మాత్రమే థర్డ్‌పార్టీ ఫైనాన్షియల్ ఆర్గనైజేషన్ ఏమిటన్న దానిపై కేంద్రం స్పష్టతనిస్తుంది. ప్రపంచ బ్యాంకు, జైకా, ఏడీబీ, కేఎఫ్ డబ్ల్యూ.. ఇలా ఏదో ఒక్క ఆర్థిక సంస్థ పేరును ప్రతిపాదిస్తుంది. మరో రెండు నెలల్లో ఈ ప్రాజెక్టుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

కారు బీభత్సం

(3వ పేజీ తరువాయి)

వైపునకు దూసుకెళ్లి ఉండేది. అక్కడ వందలాది మంది కార్మికులకు ముప్పు వాటిల్లేది. ఈ ఘటనలో ఓర్సు రామకృష్ణ, తాళ్లూరి శ్రీను, బండి నాగరాజు, కుంచపు నాగరాజు, బత్తుల వెంకట గురువులు గాయపడ్డారు. డ్రైవర్ పూటుగా మద్యం సేవిస్తాడని, అందుకే భార్యాపిల్లలు అతడిని వదిలి దూరంగా ఉంటున్నారని స్థానికులు చెప్పారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చినబాబు తదితరులు సంఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జగ్గయ్యపేట ఎస్సై-2 వెంకటేశ్వరరావు కేసు నమోదుచేసి కారును స్వాధీనం చేసుకున్నారు.

'సీవీఆర్ ఫ్లై ఓవర్ పై మొరాయించిన కార్గో'

విద్యాధరపురం : మిల్క్‌ప్రాజెక్ట్ సమీపంలో ఉన్న సివిఆర్ ఫ్లై ఓవర్ పై కార్గో వాహనం మొరాయించటంతో శుక్రవారం రాత్రి ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఫ్లై ఓవర్ పై మొరాయించిన వాహనాన్ని పోలీసు వాహనం ద్వారా తరలించారు. విద్యాధరపురం కబేలా సెంటర్ నుంచి వై.వి.రావు ఎస్టేట్ సెంటర్ వైపు ఓ కార్గో వాహనం బయలుదేరింది. సివిఆర్ ఫ్లై ఓవర్ పైకి వచ్చేసరికి ఆ వాహనం మొరాయించింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినప్పటికీ వాహనం కదలకపోవటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం తెలుసుకున్న భవానీపురం ట్రాఫిక్ పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు తెలుసుకుని క్రేన్‌ను రప్పించి రోడ్డు మధ్యలో ఆగిపోయిన కార్గో వాహనాన్ని పక్కకు తరలించారు. కొద్దిసేపు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు వెంటనే సమస్యను పరిష్కరించటంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.

రైల్వే స్టేషన్, బస్ స్టేషన్‌లలో విస్తృత తనిఖీలు

రైల్వే స్టేషన్/బస్ స్టేషన్ : పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు కృష్ణలంక పోలీసులు శుక్రవారం రాత్రి విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పోలీసులు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించి వారి వద్ద ఉన్న గుర్తింపు ఆధారాలను పరిశీలించారు. ఒంటరిగా బ్యాగ్‌లతో ఉన్నవారిని విచారించి వారివద్ద ఉన్న బ్యాగ్‌లను తనిఖీలు చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకునివివరాలు తెలుసుకుని అక్కడ నుంచి పంపించివేశారు.

రైల్వే పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ జె.వి.రమణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అన్ని ప్లాట్‌ఫారాలలో తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న టిక్కెట్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఓ వ్యక్తి అనధికారికంగా మద్యం తరలించటంతో అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 34 మద్యం బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రైన్‌లలో ఎక్కడకుండా ప్లాట్‌ఫారాలపై ఒంటరిగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారిని విచారించి స్టేషన్ నుంచి బయటకు పంపించివేశారు. అనుమానితులుగా ఉన్న ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేశారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి : యూటీఎఫ్

విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో మారణకాండ సృష్టించిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించి, ఉగ్రవాదాన్ని నిర్మూలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు అన్నారు. ఉగ్రదాడికి నిరసనగా యుటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన కొవ్వొత్తుల ప్రదర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించి మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం మృతులకు ఘననివాళులర్పించారు.

ప్రతి కుటుంబంలో మహిళా పారిశ్రామిక వేత్త

» స్వయం సంఘాల మహిళల వర్క్‌షాప్‌లో కలెక్టర్ లక్ష్మీశ



జ్యోతి వెలిగించి వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న మహిళా పారిశ్రామిక వేత్తలు, చిత్రంలో కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికీ ఓ మహిళా పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దుతామన్న ప్రభుత్వ లక్ష్యానికి జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. శుక్రవారం మహిళా పారిశ్రామికవేత్తలతో కలెక్టర్ లక్ష్మీశ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఒక కుటుంబం.. ఒక మహిళా పారిశ్రామికవేత్త వర్క్‌షాప్ ఉద్దేశాన్ని మీడియా సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు.

● పేదరికంలేని రాష్ట్రాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించింది. జిల్లాస్థాయిలో లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రత్యేక కార్యాచరణలో భాగంగా గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు ఇప్పటికే విజయవంతంగా పారిశ్రామిక యూనిట్లను నిర్వహిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తలను ఒక వేదికపైకి తీసుకొచ్చేందుకు వర్క్‌షాప్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఒక మంచి ఆలోచనను వ్యాపార నమూనాగా తీర్చిదిద్దడం, ప్రభుత్వ పరంగా అందుబాటులో ఉన్న పథకాలు, బ్యాంక్ లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకోవడం, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం, ఆన్‌లైన్ మార్కెటింగ్ వంటి అవకాశాలు, శిక్షణ కార్యక్రమాలను అందిపుచ్చుకోవడం వంటివాటిని ఈ వర్క్‌షాప్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలకు వివరించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.855 కోట్ల మేర జీవనోపాధి రుణాలు మంజూరు జరుగుతున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

●2024-25 ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లా తలసరి ఆదాయం రూ.2.52 లక్షలుగా ఉందని దీనిని 2047 నాటికి రూ. 55 లక్షలు సాధించటమే లక్ష్యంగా నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. వయసు, విద్యార్హతలతో సంబంధం లేకుండా వారి ఆలోచన, ఆశయంతో పాటు కష్టపడే మనస్తత్వం ఉన్న వారందరికీ ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం, అధునాతన శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు.

సందడిగా వర్క్‌షాప్

ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్తపై రైతు శిక్షణ కేంద్రంలో ఏర్పాటుచేసిన వర్క్‌షాప్‌ను కలెక్టర్ లక్ష్మీశ ప్రారంభించారు. మహిళల సారథ్యంలో ఇప్పటికే విజయవంతంగా నడుస్తున్న వివిధ సంస్థలు ఏర్పాటుచేసిన ఉత్పత్తుల స్టాళ్లను పరిశీలించారు. మహిళా పారిశ్రామికవేత్తల అసోసియేషన్ (ఏఎల్ఈఏపీ) పోషిస్తున్న కీలకపాత్రను అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు. భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకునే మహిళలను చేయిపట్టి నడిపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పునర్భవ శక్తివేల్ (పునర్భవ సస్టైనబుల్ ప్రొడక్ట్స్), సీహెచ్ జితేంద్రియ (ఆకృతి బయోగ్రీన్), కీర్తన (9 నట్స్), మాధురి (శ్రీ శ్యామలాంబ ఫుడ్ ప్రొడక్ట్స్), శ్రీకాంత్ (శ్రీకాంత్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్), నవీన్ (ట్విల్స్), డి.విజయదుర్గ (శ్రీ సహస్ర ఇండస్ట్రీస్), పార్వతి (మన అర్బన్ బౌల్)లు స్వయం సహాయక సంఘాల మహిళలకు విలువైన సూచనలు ఇచ్చారు. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా పారిశ్రామికవేత్తగా ఎదిగి తనతో పాటు మరో పదిమందికి ఉపాధి కల్పించాలనే దృఢ సంకల్పం, ఆలోచనకు ఆశయం తోడైతే విజయవంతంగా ముందుకెళ్లవచ్చని పారిశ్రామికవేత్తలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, యూసీడీ పీవో పి.వెంకట నారాయణ, జిల్లా గ్రామీణ సమాఖ్య అధ్యక్షులు కల్పన, అర్బన్ సమాఖ్య అధ్యక్షులు మీనాక్షి, అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర సారథి కనకదుర్గమ్మ పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్య కళార్చన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి కళావేదికపై శుక్రవారం విజయవాడ శ్రీకనకదుర్గా నృత్య కళామందిర్ కళాబృందం అమ్మవారికి నృత్య కళార్చన నిర్వహించారు. గురువు వై.అనురాధ ఆధ్వర్యంలో కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అనంతరం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను అందజేశారు. ఆలయ శిఖర స్వర్ణతాపడ నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన టి.శ్రీనివాస్ సంపత్ శుక్రవారం రూ.5 లక్షలు, గుంటూరుకు చెందిన ఎం.శశితేజ అన్నవితరణకు రూ.1,01,116లు విరాళం అందించారు. దాతలకు అమ్మవారి దర్శనానంతరం ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



శ్రీ రామచంద్రనగర్ పార్క్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దూరదృష్టి కలిగిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం తూర్పు పరిధి 3వ డివిజన్ శ్రీరామచంద్రనగర్ పార్క్ ఏరియాలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం డివిజన్‌లో రూ.కోటి 75లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన 8 రోడ్ల పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ పన్నుల నుంచి వచ్చిన నిధులతో నగర పరిధిలో అభివృద్ధి పనులు చేసుకొని, మిగిలిన నిధులను అప్పు తీర్చుకోమని కార్పొరేషన్ అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చిన ఈ 10 నెలల కాలంలోనే ఈ డివిజన్‌లో రూ.6 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. రూ.కోటి 75లక్షలతో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ఉడా మాజీ చైర్మన్ తూమాటి ప్రేమ్‌నాథ్ మాట్లాడుతూ నైట్ శానిటేషన్ వల్ల నగరం ఎంతో అం దంగా ఉందన్నారు. తాడి బాబూరావు, గుత్తికొండ కృష్ణమోహన్, గద్దె రమేష్, బండి కోమలి, పూర్ణచంద్రరావు, సీతారామయ్య, గొల్లపల్లి నారాయణరావు, కృష్ణప్రసాద్, రాజనాల సురేష్, ధూళిపాళ్ల రమేష్, జీ.ఏసు పాల్గొన్నారు.



ఒకటో డివిజన్లో అవగాహన ర్యాలీ

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

గుణదల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని ఒకట డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొమ్మినేని సురేష్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని డివిజన్లో మలేరియా అంతం మనతోనే అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు నిల్వలేకుండా పారుదల అయ్యేలా చూసుకోవాలని, ఇళ్లల్లో వాడుక నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. తడి, పొడి చెత్త సేకరణకు వచ్చే పారిశుధ్య సిబ్బందికి డివిజన్ వాసులు సహకరించాలని కోరారు. ఈ ర్యాలీలో అంగన్‌వాడీ ఆయాలు, మలేరియా డిపార్ట్‌మెంట్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.






పటమట సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో , పటమట వాకింగ్ మిత్రుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ, లబ్బీపేట మసీదు వద్ద నల్లజెండాలతో నిరసన

ఉగ్రదాడికి నిరసనగా శాంతి ర్యాలీ

పటమట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడులకు నిరసనగా వాకర్స్ అసోసియేషన్ ఆఫ్ పటమట, పటమట సీనియర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పటమట హైస్కూల్ రోడ్డులో శాంతి, సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో పరచూరి అజయ్ కుమార్, పి.సాంబశివరావు, కె.రామ్మోహన్‌రావు, లోయ నాగేశ్వరరావు, చిట్టిబొమ్మ శ్రీనివాస్, శివశంకర్రావు, రాజేశ్వరరావులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని తిప్పికొట్టాలి

గుణదల: ఉగ్రదాడిని యావత్ భారత దేశంలోని పౌరులంతా తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని మాచవరం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సుబ్బారావు తెలిపారు. ఉగ్రదాడిలో అశువులు బాసిన వారి ఆత్మశాంతించాలని కోరుతూ ఎస్ఆర్ఆర్ కళాశాల ఆవరణలో మాచవరం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రెండు నిమిషాల పాటు మృతుల ఆత్మ శాంతించాలని కోరుతూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ భారతదేశం పాకిస్తానీయులకు సరైన సమాధానం త్వరలోనే చెప్పనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రంగా శ్రీనివాస్, ట్రెజరర్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కె.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ఆర్ కళాశాల ఆవరణలో మౌనం పాటిస్తున్న మాచవరం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

నల్ల జెండాలతో నిరసన

లబ్బీపేట: లబ్బీపేట మసీదు వద్ద శుక్రవారం నమాజ్ అనంతరం ముస్లింలు నల్ల జెండాలతో, చేతులకు నల్ల రిబ్బన్‌లు కట్టుకుని ప్రదర్శన నిర్వహించారు. పర్సనల్ లా బోర్డు సూచనతో ముస్లీం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు మాట్లాడుతూ పర్యాటకుల పై ఉగ్రమూకలు చేసిన దాడి అత్యంత హేయమైన చర్య అని, భారత ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నామని, దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మునీర్ అహ్మద్, ముక్తార్ అలీ తదితరులు పాల్గొన్నారు.

సెలవులకు సొంతూరు వెళితే స్టేషన్లో చెప్పండి

సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్

గుణదల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులకు సొంత ఊళ్లకు వెళ్లేవారు ముందుగా మీమీ ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్లో ముందుగా తెలియపరచాలని అలా చేస్తే చోరీలు జరగకుండా చెక్ పెట్టేందుకు అవకాశం ఉంటుందని సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో చాలా మంది సొంత ఊళ్లకు వెళ్లే అవకాశం ఉన్నందున అటువంటి వారంతా పోలీస్‌స్టేషన్లలో మీ సమాచారం తెలియజేయాలని కోరారు. వేసవి తాపంతో ఉక్కపోతను ఎదుర్కోవడానికి ఆరుబయట, డాబాల మీద పడుకునే వారు ఇంటికి తాళాలు వేసుకుని పడుకోవాలని సూచించారు. చల్లని గాలి వస్తుందని తలుపులు తెరిచి పడుకోవడం వల్ల నేరస్తులు చోరీలకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. అనుమానితులు సంచ రిస్తుంటే వారి సమాచారం 100కు కాల్‌చేసి చెప్పాలన్నారు. నగదు, బంగారు నగలు బ్యాంకుల్లో భద్రపరచుకుని ఊరు వెళ్లాలని తెలిపారు. వేసవి కాలంలో జరిగే చోరీలకు చెక్ పెట్టేందుకు తాము చేస్తున్న ఈ ప్రయత్నానికి నగరవాసులు సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీ ఆఫ్‌లైన్‌లో ఒకేరోజు నిర్వహించాలి

బెంజిసర్కిల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ పరీక్షను ఆఫ్‌లైన్‌లో ఒకేరోజు నిర్వహించాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇలా చేయడం వల్ల విద్యార్థులకు సమయం కలిసి వస్తుందన్నారు. డీఎస్సీ రాసేవారికి డిగ్రీలో, ఎస్జీటీ వారికి ఇంటర్మీడియట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీకి 40శాతం, ఓసీలకు 45 శాతానికి మార్కులు తగ్గించాలని కోరారు. టెన్త్, ఇంటర్మీడియట్ పర్సెంటేజ్‌తో పనిలేదని అధికారులు చెప్పినా ఆన్‌లైన్ సిస్టంలో ఇంకా సరిచేయలేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పటమట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యుత్‌లైన్ల ఏర్పాటు, చెట్ల నరికివేత కార్యక్రమం ఉంటడంతో శనివారం ఉదయం 7 గంటల నుంచి 11.30 వరకు అయ్యప్ప నగర్ సబ్ స్టేషన్ ఎంప్లాయిస్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని ఈఈ హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివాజీ రోడ్డు, వీర సావార్కర్ రోడ్డు, హనుమాన్ వీధి, లాల్ బహదూర్ శాస్త్రి వీధి, చౌదరి పేట, యలమలకుదురు కాలువ కట్ట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు. **రామలింగేశ్వరనగర్:** విద్యుత్ లైన్ల మరమ్మతులు, మెయింటినెన్స్ నిమిత్తం శనివారం ఉదయం 8గంటల నుంచి 10.30 వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, రామలింగే శ్వరనగర్ విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ పుట్టరోడ్డు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వా హక ఇంజనీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. ఈనాడు కాలనీ, ఎస్‌టీపీ హెచ్‌టి పాయింట్, శ్మశానంవీధి నుంచి రామలింగేశ్వరనగర్ కొండ వరకు, కొల్లిపర వారి వీధి, నిమ్మల వారి వీధి, ఠాగూర్ వీధి, శివగంగ భవానీ వీధి, కొమ్మా పూర్ణచంద్ర రావు వీధి, రాయపాటి రమణమ్మ వీధి, రాయపాటి సత్యయ్య వీధి, సాయిబాబా వీధి, పుట్టరోడ్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

దుర్గామల్లేశ్వరులకు విశేష పూజలు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరులకు శుక్రవారం విశేషపూజలు వైభవంగా జరిగాయి. కనక దుర్గమ్మకు ప్రీతిపాత్రమైన శుక్రవారాన్ని పురస్కరించుకుని భక్తులు ఆర్జిత సేవల్లో విశేషంగా పాల్గొన్నారు. లక్ష కుంకుమార్చన, చండీయాగం, శ్రీచక్ర నవావరణార్చన, ఖడ్గమాలార్చన, శాంతి కల్యాణం పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కనకదుర్గమ్మ దర్శనానికి శుక్రవారం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దర్శనం అనంతరం దేవస్థానం అంది స్తున్న ఉచిత ప్రసాదం, నిత్య అన్నప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు.

అమ్మఒడి పేరుతో సైబర్ నేరగాళ్ల వల

● రూ.లక్షా 10 వేలు చోరీ చేసిన వైనం

ఆటోనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్‌శాఖ హెచ్చరిస్తున్నా..సైబర్ నేరాలు జరుగుతునే ఉంటున్నాయి. పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిడమానూరులో సైబర్ నేరగాళ్ల వలలో పడి రూ. లక్ష 10 వేలు పోగొట్టుకున్నారు. బాధితుల కథనం ప్రకారం..నిడమానూరుకు చెందిన వలంటీర్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఫోను చేసి తాము అమరావతి నుంచి మాట్లాడుతున్నామని తెలిపాడు. వలంటీర్‌గా రాజీనామా చేయకుండా ఉన్నవారిని తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నామని నమ్మబలికాడు. క్లస్టర్‌లో ఉండే లబ్ధిదారులకు పథకాలు అందాయా లేదా అనేది నిర్ధారించుకోవాలని ముగ్గురు ఫోన్ నంబర్లు తీసుకున్నాడు. లబ్ధిదారులు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో తిరిగి వలంటీర్‌కు కాల్ చేసి కాన్ఫరెన్స్ పెట్టించుకున్నాడు. ఈ క్రమంలో అమ్మఒడి నగదు గురించి ఆరా తీసి ఫోన్‌పే నుంచి వివరాలు తీసుకుంటానని చెప్పాడు. గుర్తు తెలియని వ్యక్తి మాటలు నమ్మి ఫోన్ పే ఓపెన్ చేశారు. అతను చెప్పినట్లు చేసి మొదటి విడతగా భర్త నుంచి రూ.40 వేలు, భార్య నుంచి నిమిషాల వ్యవధిలోనే పలు దఫాలుగా రూ.70 వేలు చోరీ చేశాడు. మరో లబ్ధిదారునికి ఫోన్ చేసే ఇదే విధిగా అడిగి వివరాలు తీసుకున్నాడు వారి అకౌంట్‌లో నగదు లేకపోవడంతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. మోసపోయామని తెలుసుకుని పటమట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సైబర్ పోలీస్‌స్టేషన్‌కి ఈ ఫిర్యాదును బదిలీ చేశారు.

విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరం

గవర్నర్‌పేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధి కారి కె.నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ప్రతిరోజు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం జరుగుతుందని, పిల్లలకు కథలు చెప్పడం, పుస్తక సమీక్షలు, పుస్తకాలు చదివిం చడం, స్పోకెన్ ఇంగ్లీషు నేర్పించడం, చిత్రలేఖనం, వివిధ విజ్ఞాన అంశాలపై ప్రసంగాలు నిర్వహిస్తామని తెలిపారు.



దివ్యాంగురాలికి ట్రై సైకిల్ పంపిణీ చేసిన ఎంపీ చిన్ని

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వీల్‌చైర్‌లు పంపిణీ

వన్‌టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్ పశ్చిమ నియోజకవర్గం 42, 46, 47, 56 డివిజన్లలోని దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వీల్ చైర్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు సాయం చేయటంలో టీడీపీ ముందుంటుందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా, మాజీ మేయర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



విదేశీ మద్యం నిల్వలు కలిగి ఉన్న మహిళను అరెస్ట్ చేసిన పోలీసులు

123 విదేశీ మద్యం సీసాలు స్వాధీనం మహిళ అరెస్ట్

వన్‌టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వెస్ట్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నున్న రోడ్డుకు పక్కన, తోటవారి వీధిలో కృష్ణా రెసిడెన్సీలోని ఒక ఫ్లాట్‌లో మహిళ విదేశీ మద్యం నిల్వలు కలిగి ఉండటంతో శుక్రవారం నోటీసు జారీచేసి, అనంతరం అరెస్టు చేశారు. మహిళ అనేక ప్రాంతాల్లో తిరిగినప్పుడు విదేశీ మద్యం కొనుగోలు చేసి నిల్వ ఉంచుతుంది. వివాహాలు, ప్రైవేట్ ఈవెంట్‌లకు ఆమె ఈవెంట్ మేనేజర్‌గా పనిచేస్తుంది. విజయవాడలోని ఎలైట్ వర్గాలకు ఈ మద్యాన్ని సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆమె పోలీసులకు వెల్లడించింది. ఆమె నుంచి 123 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. గోవా, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు మలేషియా, సింగపూర్ వంటి దేశాల నుంచి ఈ మద్యం తీసుకువచ్చినట్లుగా గుర్తించారు. విదేశీ మద్యం నిల్వలపై మరింతగా దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి

● వాహనదారులకు ఇబ్బందులు

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: ప్రధాన రహదారుల వెంబడి అడ్డంగా వేసిన బిల్డింగ్ మెటీరియల్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాగార్జున నగర్ 5వ రోడ్డు, కరెన్సీనగర్ సరిహద్దు రోడ్డులో బిల్డింగ్ యాజమానులు ఇసుక, కంకరను రోడ్డు మీద వేశారు. ఇది రోడ్డు మధ్యలోకి వచ్చాయి. ఈ రోడ్లు ప్రధాన రహదారులు కావడంతో వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు.




నాగార్జున నగర్ 5వ రోడ్డులో, కరెన్సీనగర్ సరిహద్దు రోడ్డుపై వేసిన ఇసుక, కంకర



రాయనపాడు రైల్వేస్టేషన్ లోపలి వ్యూ, ప్రయాణికులు స్టేషన్ బిల్డింగ్‌లోకి చేరుకోవటానికి ప్రధాన మార్గం

రాయల్‌గా రాయనపాడు

సకల సదుపాయాలతో సర్వాంగ సుందరంగా శాటిలైట్ రైల్వేస్టేషన్

- పూర్తయిన తొలిదశ అభివృద్ధి, ఆధునికీకరణ పనులు
- వెస్ట్ బైపాస్ మీదుగా కొద్ది నిమిషాల్లోనే రాజధాని గ్రామాలకు చేరుకునే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాయనపాడు శాటిలైట్ రైల్వేస్టేషన్ తొలిదశ ఆధునీకరణ, అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. సరికొత్త సొబగులద్ది ఈ రైల్వేస్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆధునీకరించిన ఈ రైల్వేస్టేషన్ రాజధాని అమరావతికి గేట్ వేగా నిలవబోతోంది. భవిష్యత్తులో రాజధానిలోని గ్రామీణ ప్రజలు, నగర ప్రజలు దూర ప్రాంతాల నుంచి రాయనపాడు రైల్వేస్టేషన్‌లో దిగి విజయవాడకు రాకుండానే తమ ప్రాంతాలకు చేరుకోవచ్చు. రాయనపాడు నుంచి గొల్లపూడి బయటకు రాగానే విజయవాడ వెస్ట్ బైపాస్ ఉంటుంది. ఈ వెస్ట్ బైపాస్ మీదుగా నేరుగా వెంకటపాలెం, ఇతర రాజధాని గ్రామాలకు నిమిషాల వ్యవధిలోనే చేరుకోవచ్చు. స్మార్ట్ స్టేషన్ ఫీచర్లతో రాయనపాడు రైల్వేస్టేషన్‌ను రూ.100 కోట్లతో రైల్వే శాఖ అభివృద్ధి చేస్తోంది. తొలి దశలో రూ.30 కోట్లతో అభివృద్ధి పనులు చేసింది. రాయనపాడులో నూతన రైల్వేస్టేషన్ భవనం నిర్మించి, ఇందులో అత్యాధునికమైన సదుపాయాలను కల్పించింది. అద్భుతమైన ఇంటీరియర్, ఏసీ వెయిటింగ్ హాల్స్ నిర్మించింది. డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు, ఫ్రీ వైఫై, ఆన్‌లైన్ టికెటింగ్, సోలార్ పవర్, మహిళలు, వృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించింది. ఫుడ్‌కోర్టులు, రిటైల్ దుకాణాలకు కూడా అవకాశం కల్పించింది. ఆధునికమైన మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పించింది. వీటితో పాటు రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సీసీ కెమెరాలు, మెరుగైన ఎల్ఈడీ లైటింగ్ సదుపాయాలను కల్పించింది. ఇవి కాకుండా ప్లాట్‌ఫామ్‌లను అందంగా, విశాలంగా తీర్చిదిద్దింది. ప్లాట్‌ఫామ్‌లపైనా ప్రయాణికులు కూర్చునేందుకు వీలుగా సీటింగ్ ఏర్పాటు చేసింది. స్టేషన్‌లో ఎలక్ట్రిఫికేషన్, సిగ్నలింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. స్టేషన్ బయట కాంక్రీట్ ఫ్లోర్, చూడముచ్చటైన ల్యాండ్ స్కేపింగ్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి.



స్టేషన్ లోపల..



ఆధునీకరించిన ప్లాట్‌ఫామ్‌లు



పార్కింగ్ స్టాండ్



ఏసీ వెయిటింగ్ హాల్, తాగునీటి కుళాయిలు



రాణిగారితోట నుంచి కృష్ణానది మధ్యలోకి క్యూలో వెళ్తున్న గేదెలు

పశువులకూ పద్ధతుంది!

(ఆంధ్రజ్యోతి-రాణిగారితోట): క్రమశిక్షణ, పద్ధతి లేని ఎవరినైనా తిట్టేటప్పుడు నువ్వు మనిషివా..పశువువా అంటాం. కానీ, ఈ చిత్రాన్ని చూశాక ఆ అభిప్రాయాన్ని మార్చుకోవాల్సిందే. మనుషుల్లో పద్ధతి, క్రమశిక్షణ ఉంటుందో లేదో తెలియదు గానీ, పశువుల్లో మాత్రం అవి ఉన్నాయనడానికి రాణిగారితోట నుంచి కృష్ణానదిలోకి 'క్యూ పద్ధతి'లో వెళుతున్న పై చిత్రంలోని గేదెలే ఉదాహరణ. వివరాల్లోకి వెళితే.. రాణిగారితోటలో పలువురు గేదెలను మేపుకొని పాలు విక్రయించుకుని జీవిస్తుంటారు. ఉదయం పాలు పితికిన తర్వాత వాటిని కృష్ణానదిలోకి తోలతారు. ఈ పశువులు నది మధ్యలోకి వెళ్లి సాయంత్రానికి వాటి షెడ్లలోకి చేరతాయి. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం నదిలోకి 'క్యూ పద్ధతి'లో వెళుతున్న గేదెలు కెమెరా కంటికి చిక్కాయి.



పెనమలూరు స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ గంగాధరరావు

వృద్ధురాలి అనుమానాస్పద మృతి కేసులో

వీడిన మిస్టరీ

- యనమలకుదురులో వృద్ధురాలిని అంతమొందించిన మహిళ, ఆమె స్నేహితుడు.. అంతకుముందు మృతురాలి కొడుకును మెదక్‌లో హత్య చేసిన నిందితులు
- కొడుకు ఆచూకీపై ప్రశ్నించడంతో వృద్ధురాలి హత్య
- పెనమలూరు పోలీసుల అదుపులో నిందితులు

పెనమలూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): యనమలకుదురు కృష్ణానది లంకగట్టుపై అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వృద్ధురాలి కేసు మిస్టరీ వీడింది. శుక్రవారం పెనమలూరు పోలీసుస్టేషన్‌లో ఎస్పీ గంగాధరరావు కేసు వివరాలను వివరించారు. 'యనమలకుదురులో అనుమానాస్పదంగా మృతి చెందిన వృద్ధురాలు పోతుల పోచమ్మ స్వగ్రామం మెదక్ జిల్లాలోని ఘన్‌పూర్ మండలం గంగాపూర్. ఆమె కుమారుడు మహేష్, వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. అదే గ్రామానికి చెందిన బండి శోభతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. శోభకు మహేష్ బంగారు గొలుసు ఇచ్చాడు. గొలుసును తాకట్టుపెట్టగా వచ్చిన డబ్బును శోభ ఖర్చు చేసింది. తన గొలుసు ఇవ్వాలని మహేష్ ఒత్తిడి చేస్తుండడంతో అప్పటికే తనకు పరిచయమున్న మరో స్నేహితుడు మామిడి గోపాల్‌తో కలిసి మహేష్‌ను అంతమొందించేందుకు కుట్ర పన్నింది. మహేష్‌ను నమ్మించి వారిద్దరూ మెదక్ జిల్లా ఏడుపాయల వంతెన దగ్గర్లో ఉన్న పోతంశెట్టిపల్లె వద్దకు తీసుకెళ్లారు. ఊరు చివర వాగులో రాయి మీద కూర్చొని కల్లు తాగుతుండగా కిందికి నెట్టేసి అతని మెడలోని తుండును మెడకు బిగించి చంపి, అక్కడే వదిలేశారు. తన కుమారుడు కనిపించకపోవడంతో అనుమానం వచ్చి గోపాల్‌ను శోభను పోచమ్మ నిలదీసింది. నిజం చెప్పకపోతే కేసు పెడతానని బెదించింది. దీంతో వారిద్దరూ మహేష్ విజయవాడ దుర్గమ్మ గుడికి వెళ్లి ఉంటాడని నమ్మించారు. యనమలకుదురు గ్రామానికి ఈనెల నాలుగున తీసుకొచ్చారు. శోభను, పోచమ్మను హోసన్నా మందిర్ వద్ద ఉంచి దగ్గరలోని మద్యం షాపులో మద్యం తెచ్చి గోపాల్ ఇచ్చాడు. కృష్ణానదిలో ఇసుక పనులకు మహేష్ వెళ్లి ఉంటాడని నమ్మించారు. గ్యాస్ గోడౌన్ రోడ్డులోని కృష్ణానది లంక గట్టు మీదికి ఉదయం తీసుకెళ్లి పోచమ్మకు లోబీపీకి దారితీసే ట్యాబ్లెట్లు కలిపిన కల్లు ఇచ్చారు. షాపులో కొన్న మద్యాన్ని గోపాల్, శోభ తాగారు. కల్లు తాగిన పోచమ్మ బీపీ డౌనవడంతో స్పృహ తప్పి కింద పడిపోయింది. ఆమె చీరను మెడకు బిగించి చంపేసి చెవులకు ఉన్న బంగారు దిద్దులు తీసేసుకున్నారు. ముక్కుపుడకను తీయడానికి ప్రయత్నించినా రాకపోవడతో మృతదేహాన్ని అక్కడే పడేసి రైలు ఎక్కి మెదక్ వెళ్లిపోయారు.' అని ఎస్పీ తెలిపారు. బండి గోపాల్ అక్కబావ బతుకుదెరువు కోసం యనమలకుదురు వచ్చి స్థిరపడ్డారని, వారి ఇంటికి రెండు మూడుసార్లు గోపాల్, శోభ వచ్చి వెళ్లారని ఈ పరిసరాలు తెలిసి ఉండడం వల్ల పోచమ్మను ఇక్కడికి తీసుకొచ్చి అంతమొందించారని పోలీసులు చెబుతున్నారు. నిందితుల కోసం పెనమలూరు పోలీసులు మెదక్‌లో విచారిస్తుండగా..మెదక్ పోలీసులు విచారిస్తున్నారనుకుని భయపడి వారిద్దరూ యనమలకుదురులో తలదాచుకుందామని వచ్చారు. చింతలకట్ట వద్ద దుకాణంలో కల్లు తాగుతుండగా పెనమలూరు పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు.

బీసీ యువత ఉన్నతే సీఎం చంద్రబాబు లక్ష్యం

- బీసీ స్టడీ సర్కిల్ శిక్షణ కేంద్రం తనిఖీలో మంత్రి సవిత

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బీసీ యువత ఉన్నతే సీఎం చంద్రబాబునాయుడి లక్ష్యమని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. గొల్లపూడిలోని బీసీ భవన్‌లో బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ శిక్షణ కేంద్రాన్ని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. వంట గది అపరిశుభ్రంగా ఉండటంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్వానికి రాని అరటి పండ్లు ఉండటం పై బీసీ వెల్ఫేర్ అధికారులపై మండిపడ్డారు. పక్వానికి రాని అరటిపండ్లు మీరు తింటారా..మీ పిల్లలకు తినిపిస్తారా అని నిలదీశారు. అభ్యర్థుల విశ్రాంతి గదులు, స్నానాలగదులను పరిశీలించారు. అన్ని గదుల్ని, స్నానాలగదులను శుభ్రం చేయించాలని ఆదేశించారు. మెనూ ప్రకారం అభ్యర్థులకు రుచికరమైన ఆహారం ఎప్పటికప్పుడు తయారు చేసి అందించాలన్నారు. సివిల్ సర్వీసెస్ కోచింగ్ అభ్యర్థులతో కలిసి ఆమె మధ్యాహ్న భోజనం చేశారు. అభ్యర్థులు తెలిపిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్‌కు శిక్షణ పొందుతున్న యువతతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సవిత

పెన్షనర్లపై కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలి

- విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి

విజయవాడ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లపై కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి అన్నారు. శుక్రవారం ఏపీఎస్‌జీఆర్ఈ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పే రివిజన్ జరిగిన ప్రతిసారి ఉద్యోగులతో పాటు పెన్షనర్లకు రివిజన్ జరిగి పెన్షన్ పెరుగుతుందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఆర్థిక బిల్లుతో పాటు పెన్షన్ సవరణ బిల్లు ప్రవేశపెట్టి గెజిట్ పబ్లికేషన్ చేసి జీవోగా ఇచ్చిందన్నారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లను వర్గీకరించే అధికారం పొందిందన్నారు. ప్రస్తుతం పెన్షన్ పొందుతున్న కేంద్ర పెన్షనర్లు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమలు చేయబోతున్న ఎనిమిదో సీపీసీలో వర్గీకరించడానికి అనర్హలవుతారన్నారు. ఇప్పుడు తీసుకుంటున్న పెన్షన్‌లో పెరుగుదల భవిష్యత్తులో ఉండదన్నారు. గతంలోనే సుప్రీం కోర్టు వర్గీకరణ పనికిరాదని తీర్పునిచ్చిందని తెలిపారు. నేడు ఆ తీర్పును తోసిపుచ్చడంతో పెన్షనర్స్‌కు అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ దారిలో రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నడిచే అవకాశం ఉండడంతో, పెన్షనర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. మే 2న ప్రధాని మోదీ రాష్ట్రంలో పర్యటిస్తున్నందున ఏపీఎస్‌జీఆర్ఈఏ సభ్యులందరూ కవర్ క్యాంపెయిన్ ద్వారా వినతి పత్రాలు పంపుతామని తెలిపారు.

యానిమేషన్ స్కాం రూ. 500 కోట్లు పైనే..

సత్యనారాయణపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో వెలుగుచూసిన యూ పిక్స్ యానిమేషన్స్ స్కాంలో బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. వారిలో రైల్వే ఉద్యోగులు, వ్యాపారులతో పాటు పలువురు భారీగా మోసపోయినట్లు తెలుస్తోంది. ఈ స్కాం రూ.500 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. బాధితులు సత్యనారాయణపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. అయితే ఆ సంస్థలో పలువురు బ్లాక్ మనీని పెట్టుబడిగా పెట్టడంతో కేసులు పెట్టేందుకు వారు ముందుకు రావడం లేదని సమాచారం. భారీ మొత్తంలో మోసం చేసి పరారైన సంస్థ యజమాని నిడుమోలు వెంకట సత్యకిరణ్ కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. సత్యనారాయణపురంలోని ఆదిశేషగిరిరావు వీధిలో యూ పిక్స్ సంస్థ కార్యాలయాన్ని కిరణ్ ప్రారంభించి సినిమాలకు యానిమేషన్లను అందిస్తామని నమ్మించి, తమ సంస్థలో పెట్టుబడి పెడితే తక్కువ సమయంలో డబ్బులు రెట్టింపవుతాయన్నాడు. మొదట్లో నమ్మకంగా చెల్లించడంతో నరసరావుపేటకు చెందిన కొందరు భారీగా పెట్టుబడి పెట్టారు. తర్వాత కిరణ్ డబ్బులు ఇవ్వకుండా పరారయ్యాడు. దీంతో మోసపోయామని తెలిసి కె.దిలీప్‌కుమార్, టి.శ్రీనివాసరావు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

28లోగా ప్రధాని పర్యటన ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అధికారులకు రాష్ట్ర నోడల్ అధికారి వీరపాండ్యన్ ఆదేశం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అమరావతిలో మే 2న రాజధాని పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గన్నవరం విమానాశ్రయానికి విచ్చేయుచున్న సందర్భంగా ఈ నెల 28లోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను రాష్ట్ర నోడల్ అధికారి వీరపాండ్యన్ ఆదేశించారు. గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, అధికారులతో కలిసి అంతర్జాతీయ టెర్మినల్ వద్ద గల వీవీఐపీ విరామశాల, ఆగమం, నిర్గమ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 28న ఎస్పీజీ వారు రానున్నారని ఆదేరోజు సాయంత్రం అధికారులందరితో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏర్పాట్లను సమీక్షిస్తారని తెలిపారు. ప్రధానమంత్రి పర్యటించే మార్గంలో రాకపోకలు, నిర్మాణాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రధాని కొంత సమయం విమానాశ్రయంలో గడిపే అవకాశమున్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ఏర్పాట్లు, జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ అధికారులను సంప్రదించి అవసరమైన బస్సులు ఏర్పాటు చేశామని, ప్రధానితో పాటు రానున్న ప్రముఖులను తీసుకెళ్లేందుకు అవసరమైన వాహనాలను సమకూర్చేలా డీటీసీకి సూచించామని నోడల్ అధికారికి కలెక్టర్ బాలాజీ వివరించారు. విమానాశ్రయంలోను, ప్రధాని పర్యటించే మార్గం అంతటా కట్టుదిట్టమైన భద్రతా ప్రణాళిక రూపొందించామని ఎస్పీ గంగాధర్‌రావు వివరించారు. విమానాశ్రయ డైరెక్టర్ ఎం.ఎల్.కె.రెడ్డి, ఆర్డీవోలు బాలసుబ్రహ్మణ్యం, హేలాషారోన్, స్వాతి, డ్వామా, డీఆర్డీయే పీడీ శివప్రసాద్, హరిహరనాథ్, డీపీవో అరుణ, జిల్లా అగ్నిమాపక అధికారి ఏసురత్నం, ఆర్టీవో శ్రీనివాస్, డీఎఫ్‌వో సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ నటరాజు, ఆర్ అండ్ బీ ఇంజనీర్ లోకే ష్, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట పాల్గొన్నారు.



గన్నవరం విమానాశ్రయంలో అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర నోడల్ అధికారి వీరపాండ్యన్, కలెక్టర్ డీకే బాలాజీ

మోదీ పర్యటనకు భారీ బందోబస్తు

గుణదల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ మే 2వ తేదీన అమరావతి పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు తెలిపారు. ప్రధాని పర్యటనకు బందోబస్తు ఏర్పాట్లపై తీసుకోవాల్సిన నిర్ణయాలపై చర్చించేందుకు సీపీ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. నగరం మీదుగా అనేకమంది వీఐపీలు, వీవీఐపీలు ఎంతోమంది గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి అమరావతికి రోడ్డు మార్గాన వెళతారని, ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ అన్ని భద్రతా ఏర్పాట్లు చేయాలని సీపీ ఆదేశించారు. భద్రతా చర్యలు నగర వాసులకు ఇబ్బంది కలిగించకుండా ఉండేలా చూడాలన్నారు. విధుల్లో సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఎక్కడైనా ట్రాఫిక్ జామ్ జరిగితే సత్వరమే నిర్ణయం తీసుకునేలా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. వీఐపీలు బస చేసే హోటళ్ల వద్ద కూడా పహారా ఉండేలా చూడాలన్నారు. డీసీపీలు సరిత, తిరుమలేశ్వరరెడ్డి, ఉదయరాణి, కృష్ణమూర్తినాయుడు, ఎస్వీడీ ప్రసాద్, ఏడీసీపీలు జి.రామకృష్ణ, ప్రసన్నకుమార్, ఎం.రాజారావు, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు

గౌతమ్ సవాంగ్‌పై చర్యలు తీసుకోవాలి

అజిత్‌సింగ్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో డీజీపీగా పని చేసిన గౌతమ్ సవాంగ్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరారు. నాటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో కలిసి ఏపీపీఎస్సీ చైర్మన్‌గా ఉన్న గౌతమ్ సవాంగ్, కార్యదర్శి పీఎస్ఆర్ ఆంజనేయులు పాల్పడ్డ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. అజిత్ సింగ్ నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2022లో జరిగిన ఏపీపీఎస్సీ పరీక్షల్లో 162 పోస్టులు అమ్ముకుని రూ.150 కోట్ల కుంభకోణానికి తెరలేపారని ఆరోపించారు. మాన్యువల్‌గా జరగాల్సిన పరీక్ష వాల్యూషన్‌ను డిజిటలైజేషన్ ద్వారా చేసి వైసీపీకి అనుకూలమైన వారికి పోస్టులు కట్టబెట్టారని, ఇందులో భారీగా ముడుపులు ముట్టాయని ఆరోపించారు. డిప్యూటీ కలెక్టర్ పోస్టు రూ.2.50 కోట్లు, డీఎస్పీ పోస్టు రూ.1.50 కోట్లకు అమ్ముకున్నారని ఆరోపించారు. పరీక్ష రాసిన అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించగా సవాంగ్ కోర్టును కూడా తప్పుదోవ పట్టించారన్నారు. ఆ నోటిఫికేషన్ ద్వారా వివిధ పదవుల్లో ఉన్న 162 మంది నియామకాలు చెల్లవని ఆరు నెలలలోపు మళ్లీ పరీక్షలు నిర్వహించి నియామకపు ప్రక్రియ పూర్తి చేయాలని కోర్టు ఆదేశాలు ఇచినా నేటికి అమలు కాలేదన్నారు. నగర పోలీసు కమిషనర్‌గా పనిచేసిన సమయంలో బంగారం దొంగతనం కేసుల్లో రికవరీపై చాలా ఆరోపణలు ఉన్నాయన్నారు. ప్రైవేట్, ల్యాండ్ సెటిల్‌మెంట్లు చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలున్న సవాంగ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డీజీపీ, హోం సెక్రటరీ, ఏసీబీ, సీఐడీ విభాగాలకు లేఖలు రాశామని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా ఉమా



పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫాదర్ మువ్వల ప్రసాద్ తదితరులు

పోప్ ఫ్రాన్సిస్ మరణం ప్రపంచ క్రైస్తవులకు తీరనిలోటు

బెంజిసర్కిల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతిదూత, జగద్గురువులు పోప్ ఫ్రాన్సిస్ మరణం ప్రపంచ క్రైస్తవులకు తీరనిలోటని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చర్చస్(ఏపీఎఫ్‌సీ) ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ, విజయవాడ సెయింట్ పాల్స్ కథెడ్రల్ విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ మువ్వల ప్రసాద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం బెంజిసర్కిల్‌లోని సెయింట్ పాల్స్ కథెడ్రల్ కమ్యూనిటీ హాలులో ఏపీఎఫ్‌సీ, విజయవాడ పాస్టర్ ఫెలోషిప్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోప్ ఫ్రాన్సిస్ సంతాప సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ప్రసంగించారు. ఆర్థిక సమానత్వం, పేద ప్రజల కోసం పోప్ చేసిన కృషి అభినందనీయమన్నారు. ఏపీఎఫ్‌సీ సెక్రటరీ రెవరెండ్ పాస్టర్ ఇందుపల్లి కరుణానిధి అధ్యక్షత వహించగా ఫాదర్ ప్రసాద్‌తోపాటు నిర్మల కాన్వెంట్ సిస్టర్స్, పాస్టర్లు పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాస్టర్లు పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

లేబర్‌కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటం

- కేంద్ర కార్మిక సంఘాల సదస్సు తీర్మానం

గవర్నర్‌పేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక అనుకూల చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక 4 లేబర్‌కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని, దీనిపై కార్మిక లోకం పోరాటాలు కొనసాగిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకమైన ప్రైవేటీకరణ విధానాలు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 8 గంటల పనిదినాలు అమలు చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకే భవన్‌లో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. పోలారి, ఏఐయూటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్‌బాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

పాక్‌లో ఉన్నవారు వచ్చేందుకు సహకారం అందిస్తాం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ భరోసా

విజయనగరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన వారు ఎవరైనా పాకిస్థాన్‌లో ఉండి, పహల్ గామ్ ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో స్వదేశానికి రావడానికి ఇబ్బంది పడుతుంటే వారికి సహాయం అందిస్తామని ఎంఎస్ఎంఈ, సెర్ప్, ప్రవాసాంధ్రుల సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. వివిధ పనులు, కార్యక్రమాలు, విజిటింగ్ వీసాలపై పాక్‌కు వెళ్లినవారు భారత్‌కు రావడానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సహకారం అందిస్తామని చెప్పారు. టీడీపీ విజయనగరం జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. పాక్ నుంచి స్వదేశానికి రావడానికి ఏమైనా అడ్డంకులు ఉంటే ఎన్నారై విభాగం ద్వారా పరిష్కరిస్తామన్నారు. పాకిస్థాన్‌లో ఉంటున్న ఆంధ్రులెవరైనా స్వరాష్ట్రానికి తిరిగి వస్తే వారి నైపుణ్యాలను అనుసరించి భరోసా కల్పిస్తామన్నారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం


టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు డీడీ అందజేస్తున్న వెటిరో టైల్స్ సంస్థ ప్రతినిధి రమేశ్

తిరుమల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శుక్రవారం రూ.కోటి విరాళంగా అందింది. హైదరాబాద్‌కు చెందిన అపర్ణ ఎంటర్‌ప్రైజస్ లిమిటెడ్ (వెటిరో టైల్స్) ప్రతినిధి రమేశ్ తిరుమలలో చైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళం డీడీని అందజేశారు.

మొరాయించిన టీటీడీ రిసెప్షన్ సర్వర్

టీటీడీ రిసెప్షన్ సర్వర్ శుక్రవారం మొరాయించడంతో గంట పాటు భక్తులకు గదుల కేటాయింపులో అంతరాయం కలిగింది. శుక్రవారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు రిసెప్షన్ సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో గదుల కేటాయింపు నిలిచిపోయాయి. సర్వర్‌లో లోపాన్ని సరిదిద్దడంతో యథాతథంగా గదుల కేటాయింపు కొనసాగింది.

ఏపీఈఏపీసెట్‌కు 3,58,017 దరఖాస్తులు

కాకినాడ(సర్పవరం జంక్షన్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యామండలి నేతృత్వంలో జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇంజనీరింగ్, అగ్రికల్చర్-ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీఈఏపీ సెట్)-2025 కోసం గడువు ముగిసేసరికి 3,58,017 మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఏపీఈఏపీసెట్ చైర్మన్, జేఎన్‌టీయూకే ఉప కులపతి(వీసీ) ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియచేశారు. వీటిలో ఇంజనీరింగ్ విభాగానికి 2,77,507 మంది, అగ్రికల్చర్-ఫార్మసీ విభాగంలో 79,610 మంది దరఖాస్తు చేశారన్నారు. ఈ రెండు విభాగాలకు 900 మంది దరఖాస్తు చేసినట్టు తెలిపారు.

ఏజీపీలుగా మరో 8 మంది నియామకం

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏపీ హైకోర్టులో వాదనలు వినిపించేందుకు మరో 8 మంది సహాయ ప్రభుత్వ న్యాయవాదులు(ఏజీపీలు)గా నియమితులయ్యారు. న్యాయవాదులు కె.స్వరూపారాణి, విజమూరి పెద్ద వెంకయ్య, అంపోలు నర్సింగరావు, వాకా రామకృష్ణ, కొండపావులూరి ఝాన్సీలక్ష్మి, పాల అశోక్ రెడ్డి, కర్రి వరుణ్ శ్యామ్‌కుమార్, కె.ఎన్.కృష్ణకుమార్‌లను ఏజీపీలుగా నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

రూ.1కే రైతులకు క్యూబిక్ మీటర్ చెరువు మట్టి: నిమ్మల

రైతుల అవసరాల కోసం చెరువుల్లోని మట్టిని క్యూబిక్ మీటర్ రూపాయికే అందించాలని జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని ఆ శాఖ క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులతో ఆయన సమీక్ష జరిపారు.

ఏఐతో మెరుగైన పాలన: సీఎస్ విజయానంద్


ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై నిర్వహిస్తున్న వర్క్‌షాపులో ఉన్నతాధికారులు

ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఏఐ పరిజ్ఞానం అందించే లక్ష్యంతో రాష్ట్ర సచివాలయంలో 'ఏఐ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ప్రారంభించిన విషయం తెలిసిందే. రెండో రోజు శుక్రవారం కూడా ఆ వర్క్‌షాప్ కొనసాగి విజయవంతంగా ముగిసింది. అధికారులకు ఏఐపై ప్రాక్టికల్స్‌తో హ్యాండ్స్-ఆన్ శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వశాఖల వారీగా డిజిటల్ ఆధారిత సేవల్లో పరిజ్ఞానం మరింత పెంచుకోవడానికి ఈ వర్క్‌షాప్ సహకరిస్తుందని చెప్పారు. ప్రత్యేకంగా 100 మంది ఏఐ రివల్యూషనిస్టులు, 100 మంది ఏఐ ఛాంపియన్లు, 200 మంది ఏఐ క్యాటలిస్టులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడం ద్వారా దశల వారీగా రాష్ట్రంలోని అన్ని శాఖల సిబ్బందికీ కృత్రిమ మేధ పరిజ్ఞానం అందించేందుకు వీలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

పెట్టుబడులకు ఏపీలో అపార అవకాశాలు: మంత్రి భరత్

ఉక్కు రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఆంధ్రప్రదేశ్‌లో అపారమైన అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ అన్నారు. భారత ఉక్కు మంత్రిత్వశాఖ, ఫిక్కీ ఆధ్వర్యంలో 'ఇండియా స్టీల్స్-2025' పేరుతో ముంబైలో నిర్వహించిన అంతర్జాతీయ ఎగ్జిబిషన్-సదస్సుకు ఏపీ నుంచి మంత్రి భరత్, పరిశ్రమలశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ హాజరయ్యారు. దేశ, విదేశాల నుంచి ఈ సదస్సుకు వచ్చిన పెద్దపెద్ద స్టీల్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి భరత్ ముఖాముఖిగా మాట్లాడారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాల గురించి వారికి వివరించారు.

పాఠశాలల్లో క్లస్టర్ అకడమిక్ టీచర్ల విధానం

పాఠశాల విద్యాశాఖ కొత్తగా క్లస్టర్ అకడమిక్ టీచర్ల విధానం ప్రవేశ పెట్టనుంది. బదిలీల అనంతరం మిగులుగా ఉన్న స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలను క్లస్టర్ అకడమిక్ టీచర్లుగా గుర్తిస్తుంది. వారిని క్లస్టర్లకు కేటాయించి, ఆ క్లస్టర్ పరిధిలోని పాఠశాలల్లో రెగ్యులర్ టీచర్లు సెలవు పెడితే వీరి సేవలను వినియోగించుకోనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు శుక్రవారం ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు. మేలో టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.

గురుకులాలకు ముగిసిన ప్రవేశ పరీక్ష

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశ పరీక్షలు జరిగాయి. 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాల కోసం 19,797 మంది, జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకు 41,118 మంది, డిగ్రీ అడ్మిషన్లకు 1,018 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి వీఎన్ మస్తానయ్య ఓ ప్రకటనలో తెలిపారు.

ఉమ్మడి సర్వీసు రూల్స్ ఏర్పాటు చేయాలి: పీఆర్టీయూ

విజయవాడ(గవర్నర్ పేట), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉమ్మడి సర్వీసు రూల్స్ ఏర్పాటు చేసి అమలు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని పీఆర్టీయూ మాతృసంఘ తెలంగాణా నాయకులు, మాజీ ఎమ్మెల్సీ బి.మోహనరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. డెమొక్రటిక్ పీఆర్టీయూ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ డి.శ్రీను, ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, తెలంగాణా పీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డితో కలిసి శుక్రవారం ఆయన సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు.

కియ ఇంజన్ల రికవరీకి ఢిల్లీ, తమిళనాడుకు సిట్

హిందూపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కియ కార్ ఇంజన్ల మాయం కేసును ఛేదించేందుకు సిట్ పోలీసులు చర్యలు చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న 8 మంది నిందితుల్లో ఎ1, ఎ4 మినహా.. మిగిలిన ఆరుగురిని కస్టడీకి తీసుకున్నారు. ఒకరిద్దరు నిందితులతో ఒక బృందం ఢిల్లీకి, మిగిలిన నిందితులతో మరో బృందం తమిళనాడుకు శుక్రవారం వెళ్లింది. చోరీ చేసిన 940 కార్ ఇంజన్లలో 288 ఇంజన్లను ఢిల్లీలోనే విక్రయించినట్టు సమాచారం. మిగిలినవి తమిళనాడులో విక్రయించినట్టు గుర్తించారు.

'సీబీఐ' పేరిట వృద్ధ దంపతులకు రూ.30 లక్షలకు టోకరా

కొత్తపేట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగ దంపతులను ఆగంతకులు సీబీఐ అధికారులమంటూ బెదిరించి రూ.30 లక్షలకు టోకరా వేసిన ఉదంతమిది. ఎస్ఐ జి.సురేంద్ర తెలిపిన వివరాల ప్రకారం... కొత్తపేట న్యూబ్యాంకు కాలనీలో నివాసముంటున్న కొయ్యా సత్యవతి సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంటులో వార్డెన్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆమె భర్త కొయ్యా శ్రీనివాస్ డీఆర్‌డీఏలో ఉద్యోగిగా పనిచేసి రిటైర్ అయ్యారు. వీరికి ఈ నెల 16న ఓ ఫోన్‌కాల్ వచ్చింది. తాము సీబీఐ అధికారులమని, మీ ఇద్దరిపై అరెస్టు వారెంట్ ఉందని తమ అకౌంట్‌కు రూ.30 లక్షలు జమ చేస్తే అరెస్టు కాకుండా చూస్తామని నమ్మబలికారు. బెదిరింపు కాల్స్ మళ్లీ మళ్లీ రావడంతో దంపతులు భయపడి ఈ నెల 22న వారు చెప్పిన అకౌంట్‌కు ఆర్టీజీఎస్ ద్వారా రూ.30 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. విదేశాల్లో ఉంటున్న కుమారుడికి చెప్పడంతో ఆయన సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మైనార్టీలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా

- వారి సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం
- స్వయం ఉపాధికి రాయితీతో బ్యాంకు రుణాలు
- అర్హులైన వారి కోసం 342.52 కోట్లు
- శిక్షణ కోసం అదనంగా మరో 24 కోట్లు
- మైనార్టీలను చిన్నచూపు చూసిన గత ప్రభుత్వం
- మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ వెల్లడి
- ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ప్రారంభం


ఖాతాలకు నగదు జమను ప్రారంభిస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

అమరావతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మైనార్టీల స్వయం ఉపాధి కోసం రాయితీతో కూడిన బ్యాంకు రుణాల మంజూరు ప్రక్రియకు సంబంధించిన ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్(ఓబీఎంఎంఎస్) వెబ్‌సైట్‌ను మంత్రి ఫరూక్ ప్రారంభించారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మైనార్టీల స్వయం ఉపాధి కోసం రాయితీతో కూడిన బ్యాంకు రుణాలను ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. ఇందుకోసం బడ్జెట్లో రూ. 169.50 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. దీనికి సమానంగా రూ. 173.02 కోట్లు బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయని, మొత్తం రూ. 342.52 కోట్లు అర్హులైన మైనార్టీల స్వయం ఉపాధికి ఖర్చు చేస్తామని తెలిపారు. శిక్షణ, ఉపాధి కోసం అదనంగా మరో రూ. 24 కోట్లు మంజూరు చేశామన్నారు. అర్హులైన వారంతా ఈ ఉపాధి రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలినుంచి తెలుగుదేశం పార్టీ మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తోందని మంత్రి చెప్పారు. ఉమ్మడి ఏపీ నుంచి ఇప్పటి వరకు వేలాది మసీదులు, దర్గాలు, ఖబరస్థాన్లు, చర్చిలు తదితర నిర్మాణాలకు కోట్లాది రూపాయలను ఖర్చు చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని చెప్పారు. గతంలో తమ ప్రభుత్వం మంజూరు చేసిన మైనార్టీ సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. మైనార్టీలను చిన్నచూపు చూసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మైనార్టీల సంక్షేమానికి ప్రణాళికాబద్ధమైన చర్యలను చేపట్టామన్నారు. ఇమామ్‌లు, మౌజన్లు, పాస్టర్లకు పెండింగ్‌లో ఉన్న గౌరవవేతనం ఇచ్చి మైనార్టీల సంక్షేమం పట్ల చిత్తశుద్ధిని కూటమి ప్రభుత్వం నిరూపించుకుందని చెప్పారు.

అందుబాటులోకి ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్: ముస్తాక్ అహ్మద్

ఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చిందని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ సూచించారు. గత ప్రభుత్వం ఏ ఒక్కరికీ రుణం మంజూరు చేయలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 20,933 మందికి స్వయం ఉపాధి రుణాలు ఇస్తున్నామని, అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. స్క్రీనింగ్, సెలక్షన్ కమిటీల ఎంపిక తర్వాత లబ్ధిదారుడికి రెండు బ్యాంకు ఖాతాలు తెరుస్తారని చెప్పారు. జిల్లాల కలెక్టర్ల అనుమతి తర్వాత మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీలు రుణాలు విడుదల చేస్తారని చెప్పారు. యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాక వాటికి జియో ట్యాగింగ్ చేస్తామన్నారు.

ఉప్పు, పంచదార, నూనెలు తగ్గించండి

- బీపీ, షుగర్, గుండె జబ్బులకు ఇవే ప్రధాన కారణం
- దీనిపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం: ఎంటీ కృష్ణబాబు
- గుంటూరులో 'చెక్ బీపీ-స్టాప్ స్ట్రోక్' కార్యక్రమం



ప్రసంగిస్తున్న ఎంటీ కృష్ణబాబు

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'రోజూ మనం తీసుకునే ఆహారంలో ఉప్పు, పంచదార, నూనెల వినియోగం బాగా తగ్గించాలి. వీటిని ఎక్కువగా వాడితే అధిక రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బుల బారినపడే అవకాశాలు మెండుగా ఉంటాయి. వీటిని పరిమితిలోపు వాడితే ఆయా వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చు' అని వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి మువ్వ తిరుమల కృష్ణబాబు తెలిపారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్(ఐఎస్ఏ), రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరులోని భారతీయ విద్యా భవన్ ప్రాంగణంలో శుక్రవారం 'చెక్ బీపీ-స్టాప్ స్ట్రోక్' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన పక్షవాతం అవగాహన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కోసం ఉప్పు, పంచదార, నూనెల వినియోగం తగ్గించాలని ఇటీవల సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. దీనిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆరోగ్య శాఖ నిర్ణయించింది. నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న కుటుంబం నెలకు సగటున 600 గ్రాముల ఉప్పు, 3 కేజీల పంచదార, 1.80 నుంచి 2 కిలోల నూనెను మాత్రమే వినియోగించాలి. ప్రతి రోజూ 40 నిమిషాల సేపు శారీరక వ్యాయామం చేయాలి. అవకాశం ఉంటే మెడిటేషన్ చేస్తే మరింత మంచిది. ఇవన్నీ పాటిస్తే 80 శాతం బీపీ, షుగర్, పక్షవాతం, గుండె జబ్బుల నుంచి రక్షణ లభిస్తుంది.' అని సూచించారు. అధిక రక్తపోటుతో బాధపడే రోగుల్లో 50 శాతం మందికి తమకు బీపీ ఉన్నట్లే తెలియదని, ఇది ఆందోళన కలిగించే అంశమని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పీ విజయ తెలిపారు. 'రోగులందరికీ స్క్రీనింగ్ చేసి బీపీని గుర్తించి మందులు వాడితే 80 శాతం పక్షవాతం నివారించవచ్చు. ఏటా దేశంలో 18 లక్షల మంది దీని బారినపడుతున్నారు. వీరిలో 30 శాతం మంది అంగవైకల్యానికి గురౌతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ బీపీ పరీక్షలు చేసే కార్యక్రమానికి గుంటూరులో శ్రీకారం చుట్టాం. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమం చేపడతాం' అని డాక్టర్ విజయ తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్ క్లినిక్‌లో బీపీ పరీక్షలను ఆమె ప్రారంభించారు. తొలి రోజు గుంటూరులో ఐదు ప్రాంతాల్లో బీపీ పరీక్షల శిబిరం నిర్వహించారు.


యోగీంద్రబాబు, లక్ష్మి

దంపతుల హత్య

- విశాఖలో దారుణం
- 24 గంటల తరువాత వెలుగులోకి

కూర్మన్నపాలెం (విశాఖపట్నం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలోని దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో దంపతులు హత్యకు గురయ్యారు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నేవల్ డాక్‌యార్డు రిటైర్డ్ ఉద్యోగి గంపల యోగీంద్రబాబు (66), ఆయన భార్య లక్ష్మి(52) గత 30 ఏళ్లుగా జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్ నగర్‌లో నివాసముంటున్నారు. ఐదు రోజుల క్రితం ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు హైదరాబాద్ వెళ్లి రెండ్రోజుల క్రితం తిరిగివచ్చారు. శుక్రవారం సాయంత్రం యోగీంద్రబాబు ఇంటికి ఆయన మేనల్లుడు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో ఫోన్ చేస్తే ఇంట్లో రింగ్ అవుతుండడంతో అనుమానం వచ్చి కిటికీ తలుపులు తీసి చూడగా.. రక్తపు మడుగులో యోగీంద్రబాబు కనిపించారు. వెంటనే 100కి ఫోన్ చేశారు. సీపీ ఆదేశాల మేరకు ఏసీపీ టి.త్రినాథ్, దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తాళం పగులగొట్టి లోపలకు వెళ్లి చూస్తే హాల్‌లో యోగీంద్రబాబు, మరో రూమ్‌లో లక్ష్మి రక్తపు మడుగులో పడిఉన్నారు. బంగారం, నగదు కోసం కోసం ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్య జరిగి 24 గంటలు అయి ఉంటుందని (బహుశా గురువారం రాత్రి) పోలీసులు చెబుతున్నారు. కాగా.. వీరి ఇద్దరు పిల్లలు సుజిత్, శిల్ప ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు.

కాపుకాచి కాళ్లూ చేతులు నరికారు

- ఫ్లెక్సీ వివాదంలో పట్టపగలే టీడీపీ కార్యకర్తపై దాడి
- ఇరువర్గాలవారూ వైసీపీ నుంచి వచ్చినవారే
- 'తోట చంద్రయ్య' గ్రామంలో మరో దారుణం


తీవ్ర గాయాలతో ఉప్పుతోళ్ల శ్రీను

వెల్దుర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ కార్యకర్త తోట చంద్రయ్య హత్యోదంతంతో సంచలనం సృష్టించిన పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో మరో దారుణం చోటుచేసుకుంది. ఫ్లెక్సీ వివాదం నేపథ్యంలో టీడీపీ కార్యకర్త ఉప్పుతోళ్ల శ్రీనుపై శుక్రవారం అదేపార్టీలోని మరో వర్గంవారు కత్తులు, గొడ్డళ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. గతంలో వారంతా ప్రత్యర్థి పార్టీలకు చెందిన వారైనా ప్రస్తుతం ఒకే పార్టీలో ఉన్నారు. అయినా గత మనస్పర్థలు వీడకుండా తరచూ గొడవలకు దిగుతున్నారు. వివరాలివీ.. గతంలో వైసీపీలో క్రియాశీలకంగా ఉన్న చల్లా ఏడుకొండలు, ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు, గురవయ్య, మశయ్యల తోపాటు మరికొందరు ఎన్నికల సమయంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇటీవల మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గుండ్లపాడులో శ్రీను వర్గానికి చెందిన వారు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. 30 ఏళ్లుగా ఈ బజారులో టీడీపీ ఫ్లెక్సీ ఏర్పాటు చేయలేదని, మీరెందుకు పెట్టారంటూ వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారు శ్రీను వర్గీయులతో వాగ్వాదానికి దిగారు. మూడు రోజుల క్రితం ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా ఇరువర్గాలను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి బైండోవరు చేశారు. ఈ క్రమంలో శ్రీను తన తల్లి అలివేలమ్మ మాచర్ల బయలుదేరగా, ఆమెను బస్సు ఎక్కించేందుకు ఇంటికి అతి సమీపంలోనే ఉన్న బస్టాండుకు శ్రీను బైకుపై తీసుకెళ్లాడు. తల్లి ఏదో వస్తువు మరిచిపోవపోవడంతో దాన్ని తెచ్చి ఇచ్చేందుకు తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా కాపు కాచిన ప్రత్యర్థులు రాడ్లు, గొడ్డళ్లతో దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో శ్రీను రెండు కాళ్లూ పూర్తిగా విరిగిపోయాయి. అలాగే రెండు చేతులకూ కూడా గాయాలయ్యాయి. సమీప ఇంటి నుంచి భార్య అంజమ్మ, మరికొందరు వచ్చి అడ్డుకున్నా అప్పటికే శ్రీను తీవ్రంగా గాయపడ్డాడు. ఆటోలో మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకురాగా పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు నరసరావుపేటకు రిఫర్ చేశారు. పోలీసులు మాచర్ల రూరల్ ఆస్పత్రికి వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. కాగా, సంచలనం కలిగించిన తోట చంద్రయ్య హత్య తర్వాతి నుంచి ఈ గ్రామంలో పోలీసు పికెటింగ్ కొనసాగుతోంది. అయినప్పటికీ మారణాయుధాలతో దాడులకు తెగబడడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

వచ్చే జన్మలో పెద్దల్ని ఒప్పించి పెళ్లి చేసుకుంటాం!

- నెల్లూరులో ప్రేమ జంట బలవన్మరణం
- అంతకుముందు ప్రియుడికి రూ.3.72లక్షల బదిలీ.. ఇద్దరూ పరార్


రత్నకుమార్


శ్రావణి

నెల్లూరు(క్రైం)/కైకలూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'అమ్మా, నాన్నా మీరంటే మాకు ఎంతో ఇష్టం. మిమ్మల్ని వదలి బతకలేం. అలాగని మేము విడిపోయీ బతకలేము. మా వివాహానికి మీరు అంగీకరించరు. అందుకే ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోతున్నాం. మమ్మల్ని క్షమించండి. వచ్చే జన్మలో అయినా మిమ్మల్ని ఒప్పించి పెళ్లి చేసుకుంటాం' అంటూ నెల్లూరులో ఓ ప్రేమ జంట శుక్రవారం పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. పోలీసుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన బాచ్చు జోసెఫ్ రత్నకుమార్ (23), ఏలూరు జిల్లా కైకలూరు మండలం ఆటపాకకు చెందిన చిల్లుముంత శ్రావణి (23) విజయవాడలో ఇంజనీరింగ్ చదివే సమయం నుంచే ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను పెద్దలు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా శ్రావణి ఆటపాకలో తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఆమె తండ్రి చిల్లిముంత పాల్‌కుమార్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్లో పలు దఫాలుగా రూ.3,72,000లను రత్నకుమార్‌కు బదిలీ చేసింది. దీనిపై కేసు పెట్టాలని ఈ నెల 20న ఇంట్లో చర్చజరిగింది. దీంతో అదే రోజు రాత్రి శ్రావణి ఇంటి నుంచి పరారైంది. ఆ తర్వాత ఈ నెల 21న రత్నకుమార్, శ్రావణి నెల్లూరు వచ్చి ఓ లాడ్జిలో దిగారు. శుక్రవారం వారి గదిలో నుంచి దుర్వాసన వస్తుండటంతో లాడ్జి సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి పరిశీలించగా ప్రేమికులిద్దరూ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుని కనిపించారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూగజీవాలకు అసలైన నేస్తం!

- పశువైద్యులకు గుర్తింపుగా నేడు ప్రపంచ పశువైద్య దినోత్సవం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పశుపాలకులకు మార్గదర్శకులుగా.. మూగజీవాల పాలిట ప్రాణదాతలుగా.. జీవవైవిధ్యంలో కీలక పాత్రపోషించే పశువైద్యుల సేవల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే! మానవాళికి ప్రత్యక్షంగానే ఉపయోగపడే పశువుల ఆరోగ్యానికి పశువైద్యులు, పశువైద్యశాస్త్రవేత్తలు అందిస్తున్న బహుళ సేవలను మననం చేసుకునేందుకు ఏటా ఏప్రిల్ నెలలో చివరి శనివారాన్ని ప్రపంచ పశువైద్య దినోత్సవంగా జరుపుతున్నారు. మచిలీపట్నంలో జరిగే కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు హాజరుకానున్నారు.

పశుసంపదకు వైద్యులే బలం!

రాష్ట్రంలో గ్రామీణ ప్రజల ముఖ్య జీవనాధారం వ్యవసాయం. దీంతోపాటు పశుపోషణ వారి మనుగడలో కీలకమైనది. పాడితో రైతులకు, ఇతర గొర్రెలు, మేకలు, పందుల మాంసం, కోళ్ల నుంచి గుడ్లు, మాంసం ఉత్పత్తితో పెంపకందారులకు ఆదాయం లభిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు మూడున్నర కోట్ల మూగ జీవాలుండగా వీటికి పశువైద్య సిబ్బందే కొండంత అండగా నిలుస్తున్నారు. ఆసుపత్రుల్లో మందులు పంపిణీ చేయడంతో పాటు పశువుల పునరుత్పత్తికి కృత్రిమ గర్భధారణ, శస్త్రచికిత్సలు, వ్యాధి నిరోధక టీకాలు, సంచార వాహనాల ద్వారా పశువులకు ఇంటి వద్దే అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. పశువుల నుంచి సోకే జూనోటిక్ వ్యాధుల నివారణలో పశుపోషకులు ప్రధానపాత్ర పోషిస్తున్నారు. వ్యాధుల నిర్ధారణ, నివారణ, చికిత్స, అవగాహన, ప్రభుత్వ సహాయ పథకాలను పశుపోషకులకు అందిస్తూ, మూగ జీవాలను చీదరించుకోకుండా విశిష్ట సేవలు అందిస్తున్న పశువైద్యులను గౌరవించుకోవడం సముచితంగా ప్రపంచ పశువైద్య దినోత్సవాన్ని నిర్వహించనున్నారు.



ఉగ్రదాడిని నిరసిస్తూ విజయవాడలో కాంగ్రెస్ నేతృత్వంలో కొవ్వొత్తుల ప్రదర్శన

బీజేపీ విధానాలతోనే దేశంలో ఉగ్రవాదం

» సెక్యూరిటీ లేదని ఒప్పుకొన్న మోదీ రాజీనామా చేయాలి: షర్మిల

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న మత విద్వేష విధానాల వల్లే దేశంలో ఉగ్రవాదం పెరిగిపోతోంది. పహల్‌గామ్ టూరిస్టులపై ఉగ్రదాడి భద్రతా వైఫల్యంగానే అంగీకరించినందున ప్రధాని పదవికి నరేంద్ర మోదీ రాజీనామా చేయాలి' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. విజయవాడలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్, సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు ఆధ్వర్యంలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో షర్మిల మాట్లాడుతూ... 'పహల్‌గామ్ ఉగ్రదాడి పూర్తిగా భద్రతా వైఫల్యమే. దేశంలో కశ్మీర్ సేఫ్ ప్లేస్‌గా బీజేపీ ప్రచారం చేసుకుంది. ఇప్పుడు సెక్యూరిటీ లేదని అంగీకరిస్తున్నారు' అన్నారు. ఈ నెల 9న ఏఐసీసీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై అహ్మదాబాద్ డిక్లరేషన్ పేరిట సమావేశంలో చర్చించామని చెప్పారు.

షర్మిల నోరు అదుపులో పెట్టుకోవాలి: యామినీ

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'షర్మిల నోరు అదుపులో పెట్టుకోవాలి. ఎవరి పాలనలో దేశం సురక్షితంగా ఉందో తేల్చుకుందాం. దమ్ముంటే మాతో డిబేట్‌కు రావాలి' అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినీ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో చాలెంజ్ చేశారు. 'కాంగ్రెస్ పార్టీ... మరీ ముఖ్యంగా ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. కేవలం హిందువనే కారణంతో కళ్ల ఎదుట భర్తను ఉగ్రవాదులు కాల్చి చంపారని బాధితులే స్వయంగా చెబుతుంటే షర్మిల మాత్రం ముస్లింలను వెనకేసుకురావడం దేనికి సంకేతం' అని యామినీ శర్మ అన్నారు.

పాకిస్థాన్ పౌరులు తక్షణమే వెళ్లిపోవాలి: డీజీపీ

విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న పాకిస్థాన్ పౌరులు తక్షణమే తమ దేశానికి వెళ్లిపోవాలని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఆదేశాలు జారీచేశారు. పాకిస్థాన్ నుంచి వచ్చిన సాధారణ పౌరులు ఈ నెల 27లోగా, వైద్య సేవల కోసం వచ్చిన వారు ఈ నెల 29 లోగా రాష్ట్రం విడిచి తమ దేశానికి వెళ్లిపోవాలని కేంద్ర హోంశాఖ ఆదేశించినట్లు ఆయన తెలిపారు. దీర్ఘకాలిక వీసాలు, దౌత్య అధికారిక వీసాలున్న వారికి మాత్రం ఈ నిబంధనల నుంచి మినహాయించినట్లు డీజీపీ తెలిపారు.

ఉగ్రదాడి మృతులకు హైకోర్టు నివాళి

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్‌గామ్ ఉగ్రదాడిలో మరణించినవారికి ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది నివాళి అర్పించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు కోర్టు కార్యకలాపాలను నిలిపివేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

పహల్‌గామ్ హంతకులను కాల్చి పారేయాలి: ఫరూక్

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పహల్‌గామ్‌లో అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదులను గుర్తించి కాల్చి పారేయాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. 'దేశంలో పుట్టిన ప్రతి భారతీయుడు పహల్‌గామ్‌లో జరిగిన దుశ్చర్యను ఖండించాలి. మా పిల్లలు కూడా వచ్చే నెలలో కశ్మీర్ వెళ్లాల్సి ఉంది. మతం పేరు చెప్పి, కులం పేరు చెప్పి చంపే సంస్కృతి భారత్‌లో ఎప్పుడూ లేదు. ఏ మతానికి చెందిన వారైనా ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడితే తీవ్రంగా స్పందించి వారిపై చర్యలు తీసుకోవాల్సిందే' అని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు.

చంద్రమౌళికి కన్నీటి వీడ్కోలు


భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సత్యకుమార్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, తదితరులు

విశాఖపట్నం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిలో మరణించిన విశాఖ వాసి చంద్రమౌళికి శుక్రవారం జ్ఞానాపురం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, సత్యకుమార్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, బీజేపీ విశాఖ అధ్యక్షుడు పరశురామరాజు తదితరు లు పాల్గొన్నారు. సీఎం రమేశ్, సత్యకుమార్ చంద్రమౌళి పాడె మోశారు.

నాలుగు కేటగిరీల్లో నర్సులకు అవార్డులు

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మే 12న ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రోగులకు ఉత్తమ సేవలందించిన నర్సులకు ఈ ఏడాది వివిధ కేటగిరీల్లో అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ నర్సింగ్ కౌన్సిల్ నోటిఫికేషన్ జారీచేసింది. నర్స్ అడ్మినిస్ట్రేషన్, నర్స్ ఎడ్యుకేషన్, నర్స్ రిసెర్చ్, నర్సింగ్ సర్వీసెస్ కేటగిరీల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులు ఇవ్వనుంది. అర్హులు ఏప్రిల్ 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ప్రత్యక్షంగా లేదా పోస్టు లేదా కొరియర్ ద్వారా దరఖాస్తు పంపాలని సూచించారు.

పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ కార్యదర్శిగా జానకి

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆర్థిక శాఖలో ఖర్చు విభాగం కార్యదర్శిగా ఉన్న ఎం.జానకిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమెను పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ విభాగం కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఆస్పత్రుల్లో శానిటేషన్ టెండర్ల రద్దు

అమరావతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శానిటేషన్ టెండర్లలో పాల్గొన్న కంపెనీలపై పలు ఆరోపణలు రావడం, కోర్టులో వ్యాజ్యాలు నడవడంతో ఆ టెండర్లను ఆరోగ్యశాఖ రద్దు చేసింది. అలాగే జోన్-3 పెస్ట్ కంట్రోల్ టెండర్లలో అర్హత కలిగిన కంపెనీలు రాకపోవడంతో వాటినీ రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. వీటికి త్వరలో టెండర్లు పిలవనున్నారు.

ఎండ తీవ్రత.. వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరి

అమరావతి, విశాఖపట్నం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో వడగాడ్పులు, రాయలసీమలో అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 169 మండలాల్లో 40 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కడప జిల్లా వేంపల్లెలో 42.9, నంద్యాల జిల్లా గాజులపల్లె, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 42.5, కర్నూలు జిల్లా లద్దగిరిలో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

గ్రామీణ స్థానిక సంస్థలకు 1121 కోట్లు విడుదల

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ స్థానిక సంస్థల బేసిక్(అన్‌టైడ్) గ్రాంట్ కింద పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ రెండో విడతగా రూ.446.48 కోట్లు విడుదల చేసింది. అదేవిధంగా టైడ్ గ్రాంట్ రూ.674.71 కోట్లతో కలుపుకొని మొత్తం రూ.1121 కోట్లు విడుదల చేస్తూ ఆ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు.

అన్న క్యాంటీన్‌లో కలెక్టర్ అల్పాహారం




విజయవాడ(అజిత్‌సింగ్‌నగర్), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం సింగ్‌నగర్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. నగర మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి అన్న క్యాంటీన్‌కు వచ్చిన కలెక్టర్ లైనులో నిలబడి రూ.5 చెల్లించి టోకెన్ కొని, అల్పాహారాన్ని రుచి చూశారు. ఆహార పట్టిక, టోకెన్ కౌంటర్, ఆహార పదార్థాలను వడ్డిస్తున్న శైలి, డైనింగ్ ఏరియాతోపాటు మంచినీరు, చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశాలను పరిశీలించారు. నాణ్యత, క్యాంటీన్‌లో పరిశుభ్రతపై అక్కడ ఆహారం తీసుకుంటున్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టడం ద్వారా ఎంతో సంతృప్తి కలుగుతుందన్నారు.



అమరావతిలో మరో అధ్యాయం

(మొదటి పేజీ తరువాయి)


ఢిల్లీలో శుక్రవారం ప్రధాని మోదీని కలిసిన సీఎం చంద్రబాబు, పక్కన కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ లావు కృష్ణదేవరాయలు

శుక్రవారం ఢిల్లీలో ప్రధానితో సమావేశమయ్యారు. రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇద్దరూ దాదాపు గంటసేపు చర్చలు జరిపారు. రాజధాని నగర నిర్మాణం చేపడుతున్న తీరును, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చంద్రబాబు ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. పోలవరం ప్రాజెక్టు పురోగతిని, విశాఖ ఉక్కు కర్మాగారం పనితీరును వివరించారు. రాజధాని పనులు ప్రారంభించేందుకు తాను తప్పకుండా వస్తానని చెప్పిన మోదీ.. రాజధానిని వేగవంతంగా నిర్మించేందుకు పలు సూచనలు చేశారు. దేశంలో అనేక మౌలిక సదుపాయాలను తన ప్రభుత్వం ఎంత వేగంగా నిర్మించిందో సీఎంకు తెలియజేశారు. అమరావతిలో పచ్చదనం పెంచేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని.. జపాన్ వన్య శాస్త్రవేత్త అకిరా మియావకీ అనుసరించిన అటవీ మొక్కల పెంపకం పద్ధతులను అమలు చేయాలని సూచించారు. ముఖ్యంగా పట్టణాల్లో స్వయం ఆధారిత సాంద్ర అడవులను పెంచేందుకు మియావాకీ సహజ అటవీ విధానాలు తోడ్పడతాయని, జీవ వైవిధ్యానికి కూడా ఉపయోగమని పేర్కొన్నారు.

నిరంతర సాయానికి ధన్యవాదాలు..

ప్రధానిని కలిసి వచ్చాక చంద్రబాబు 'ఎక్స్'లో వివరాలు పంచుకున్నారు. ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మించేందుకు మోదీ దూరదృష్టితో కూడిన సూచనలు చేశారని, వాటిని అమలు చేస్తామన్నారు. 'రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న నిరంతర సహాయానికి ప్రధానికి కృతజ్ఞతలు తెలిపాను. అలాగే ఎస్సీ వర్గీకరణకు కేంద్రం ఆమోదం తెలిపినందుకు.. ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ, ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంటుకు మద్దతిచ్చినందుకు.. బీపీసీఎల్ రిఫైనరీ మంజూరు చేసినందుకు, ఇందులో ఆరాంకో భాగస్వామ్యాన్ని ఖరారు చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశాను. ఈసారి రాష్ట్ర పర్యటనలో శ్రీశైలాన్ని కూడా సందర్శించాలని కోరాను' అని వివరించారు. ఏపీ పర్యటన సందర్భంగా ప్రధాని ప్రకటించాల్సిన అభివృద్ధి పథకాల గురించి కూడా వారి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది.

ఉగ్రవాదులకు గట్టిగా జవాబివ్వాలి: బాబు

పహల్‌గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రదాడి తమకు తీవ్ర ఆందోళన కలిగించిందని, ఉగ్రవాదులకు గట్టి సమాధానమిచ్చి తీరాలని చంద్రబాబు ప్రధానితో అన్నారు. ఉగ్రవాదంపై పోరులో రాష్ట్ర ప్రజలు, ప్రభుత్వం కేంద్రానికి అండగా నిలుస్తారని.. ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పేందుకు తీసుకునే ఏ నిర్ణయానికైనా తమ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

శాంతిభద్రతల్లో రాజీపడం


పిఠాపురంలో నిర్మించనున్న వంద పడకల ఆసుపత్రి భవన నమూనాను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

» తప్పుచేస్తే ఏ పార్టీ వారైనా ఉపేక్షించేది లేదు
» డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరిక
» పిఠాపురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

కాకినాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలను కాపాడే విషయంలో కూటమి ప్రభుత్వం ఎక్కడా రాజీపడబోదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. తప్పుచేస్తే ఏ పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో పవన్ శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. తొలుత యు.కొత్తపల్లి మండలానికి చేరుకుని టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి, అక్కడినుంచే గొల్లప్రోలు, చేబ్రోలు సీతారామ స్వామి దేవస్థానాల్లో ప్రాకారమండపం,కాలక్షేప మండపం, రథశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పిఠాపురం 30 పడకల ప్రభుత్వాస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ చేపట్టనున్న ఆస్పత్రి భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పూజా ప్రదేశంలో ఇటుకలపై సిమెంట్ వేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిఠాపురం నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. గత పది నెలల్లో నియోజకవర్గంలో రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశామని తెలిపారు. పిఠాపురం ఆర్వోబీ నిర్మాణానికి త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదలవుతుందని ప్రకటించారు. గొల్లప్రోలు సీతారామస్వామి దేవస్థానంలో రూ.1.32 కోట్లతో ప్రాకార మండపం నిర్మిస్తున్నామని వివరించారు. పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంపీ, వర్మ, జనసేన నేతలంతా కలిసి పనిచేస్తామని చెప్పారు. అంతకుముందు 8.64 కోట్లతో ఉచిత దర్జీ శిక్షణ పథకాన్ని ప్రారంభించారు.

వర్మ, ఎస్పీ మధ్య వాగ్వాదం

పవన్ కల్యాణ్ పర్యటన సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వర్మ, ఎస్పీ బిందుమాధవ్‌కు మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. పర్యటన సందర్భంగా పవన్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ వద్దకు రానుండగా.. అప్పటికే అక్కడ ఉన్న వర్మతోపాటు టీడీపీ నేతలను అక్కడి నుంచి దూరంగా వెళ్లాలని ఎస్పీ సూచించారు. దీంతో వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. పొమ్మంటే వెళ్లిపోతామని హెచ్చరించారు. దీంతో ఎస్పీ ఆయనను సముదాయించారు.

2026 చివరికి టార్గెట్!

హైవే, రైల్వే ప్రాజెక్టుల పూర్తిపై అధికారులకు మంత్రి జనార్దన్‌రెడ్డి ఆదేశం

» భూసేకరణ, అటవీ క్లియరెన్స్ సమస్యలు పరిష్కరించుకోవాలని నిర్దేశం
» నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచన

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపట్టిన జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను 2026 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో జాతీయ రహదారులు, రైల్వే శాఖ ఉన్నతాధికారులతో 2వ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. గత డిసెంబరులో నిర్వహించిన తొలి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలపై సాధించిన ప్రగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంత్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఆయా ప్రాజెక్టులను వేగంగా పూర్తిచేసేందుకు నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు భూసేకరణ, అటవీ క్లియరెన్స్ వంటి పెం డింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకుని, నిర్ణీత కాల వ్యవధిలో జాతీయ రహదారులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలో జాతీయ రహదారుల పనుల్లో భాగంగా సీనరేజీ చార్జీల ముందస్తు చెల్లింపులు జరిగేవని, ప్రస్తుతం బిల్లు వచ్చిన తర్వాత చెల్లించే వెసులుబాటు కాంట్రాక్టర్లు ఇచ్చారని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న హైవే ప్రాజెక్టులకు ఇప్పటికి 237 కిలోమీటర్ల మేర భూసేకరణ పూర్తయ్యిందని అధికారులు తెలిపారు. మిగిలిన భూసేకరణ కూడా త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రి వారికి సూచించారు. ఓర్వకల్లు, కృష్ణపట్నం పారిశ్రామిక పట్టణాలను రైల్వేలైన్లకు అనుసంధానం చేయాలని ఆదేశించారు. కాగా, రాష్ట్రంలోని ఓడరేవులు, విమానాశ్రయాలు, వీసీఐసీ, హెచ్‌బీఐసీ వంటి పారిశ్రామిక కారిడార్లకు జాతీయ రహదారులను అనుసంధానం చేసేందుకు నేషనల్ హైవేస్ అథారిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో పలు పెండింగ్ పనులకు ఆమోదం లభించింది.

మత్స్యకారులకు పండుగే!

నేడు 'మత్స్యకారుల సేవలో..' పథకానికి చంద్రబాబు శ్రీకారం

» సిక్కోలులో నిధులు విడుదల చేసి మరో హామీని నెరవేర్చనున్న సీఎం

అమరావతి/శ్రీకాకుళం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మత్స్యకార కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. వేట నిషేధ కాలంలో జీవనాధారం కోల్పోతున్న జాలర్ల కుటుంబాలకు.. ప్రభుత్వం రూ.20 చొప్పున సాయం చేయనుంది. రాష్ట్రంలోని 1,29,178 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.258 కోట్లను అందించనుంది. 'మత్స్యకారుల సేవలో..' అనే ఈ పథకానికి శనివారం శ్రీకాకుళం జిల్లా.. ఎచ్చెర్ల నియోజకవర్గం బుడగట్లపాలెం గ్రామంలో సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు. మత్స్యకారులకు, ఆక్వా రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్న నమ్మకాన్ని నిజం చేయనున్నారు. రాష్ట్రంలో పాలనను పరుగులు పెట్టిస్తున్న సీఎం చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే మరో వాగ్దానాన్ని నెరవేస్తున్నారు. మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకునే పథకాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేటను నిషేధించారు. దీంతో మత్స్యకార కుటుంబాలు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ఒక్కొక్క కుటుంబానికి రూ.20 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వేట నిషేధ సమయంలో గత జగన్ ప్రభుత్వం ఒక్కొక్క మత్స్యకార కుటుంబానికి కేవలం రూ.10 వేలు మాత్రమే ఇచ్చింది. అది కూడా చాలా మందికి దక్కలేదన్న విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా కరెంటు బిల్లులు, ఇతరత్రా కారణాలు చూపి చాలా మందిని లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించారు. ఇక, ఎన్నికల ఏడాది(2024)లో ఎవరికీ పైసా ఇవ్వకుండా 'కోడ్' పేరుతో తప్పించుకున్నారు. రెండు నెలల పాటు వేటకు వెళ్లకపోతే మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితి తలెత్తుతుందనే విషయాన్ని అర్థం చేసుకుని, ఎన్నికల ముందే మత్స్యకార కుటుంబాలకు రూ.10 వేల సాయాన్ని రూ. 20 వేలకు పెంచుతామని కూటమి మ్యానిఫెస్టోలో ప్రకటించింది. ఆ హామీని సీఎం చంద్రబాబు శనివారం నెరవేర్చనున్నారు.

మొదలు పెట్టింది చంద్రబాబే

రాష్ట్ర విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం.. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో నగదు రూపంలో సాయం చేయడం ప్రారంభించింది. తొలుత ఒక్కొక్క మత్స్యకార కుటుంబానికి రూ.2 వేలు చొప్పున సాయం చేసిన సీఎం చంద్రబాబు దాన్ని 2018-19లో రూ.4 వేలకు పెంచారు. దీనికిగాను 2014-19 మధ్య రూ.788 కోట్లు వెచ్చించారు. దీంతో పాటు వలలు, పడవలు, ఐస్‌బాక్సులు అదనంగా అందించారు. మత్స్యకారుల పిల్లలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఆరు ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేశారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆక్వా రంగానికి, మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేసింది.

నేడు శ్రీకాకుళానికి సీఎం

ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం శ్రీకాకుళం జిల్లాకు రానున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో 'మత్స్యకారుల సేవలో' పథకాన్ని ఆయన ప్రారంభిస్తారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఇదే జిల్లాకు చెందిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పరిశీలించారు. సీఎం చంద్రబాబు విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి శనివారం ఉదయం 11.35 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి బుడగట్లపాలెం చేరుకుంటారు. స్థానిక మత్స్యకారులతో మాట్లాడి వేట నిషేధ కాలంలో వారు ఎదుర్కొనే సమస్యలను తెలుసుకుంటారు. అనంతరం, ఒక్కొక్క మత్స్యకారుడి కుటుంబానికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నారు.

కొల్లేరుపై 12 వారాల్లో నివేదిక ఇవ్వండి

» కేంద్ర సాధికార కమిటీకి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్యాన్ని మరోసారి తనిఖీ చేసి 12 వారాల్లోగా నివేదిక సమర్పించాల్సిందిగా కేంద్ర సాధికార కమిటీకి(సీఈసీ)సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసింది. 2006లో కొల్లేరు అభయారణ్యంలో పర్యావరణ పరిరక్షణకు, అభివృద్ధి, అవసరాలకు మధ్య సమతుల్యం పాటించాలని జారీచేసిన ఆదేశాలను అమలు చేస్తున్నదీ లేనిదీ తెలుసుకోవాలని జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనం శుక్రవారం ఆదేశించింది. కొల్లేరులో ప్రైవేట్ భూములను నోటిఫై చేసిన వ్యవహారంలో సుప్రీంకోర్టును ప్రైవేటు మత్స్యకారుల సంఘం ఆశ్రయించింది. ప్రైవేటు భూ యజమానుల హక్కులను ఎలా సెటిల్ చేశారని సీఈసీని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. మరో 12 వారాల్లోగా దీనిపై నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

కనిపించని పోలీసులు మీరే

» తిరుమల ట్యాక్సీ డ్రైవర్లతో ఎస్పీ హర్షవర్ధనరాజు


డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుమల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'మేము కనిపించే పోలీసులం. తిరుమల ట్యాక్సీ డ్రైవర్లు కనిపించని పోలీసులు. కొన్నిసార్లు డ్రైవర్లు ఇచ్చే చిన్న సమాచారమే పెద్దపెద్ద ఉపద్రవాల నుంచి కాపాడుకునేందుకు అవకాశం ఇస్తుంది' అని తిరుపతి ఎస్పీ, టీటీడీ సీవీఎస్వో (ఎఫ్ఏసీ) హర్షవర్ధనరాజు అన్నారు. పహల్‌గామ్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో తిరుమలలోని ఆస్థాన మండపంలో 450 మంది ట్యాక్సీ డ్రైవర్లు, ఓనర్లతో శుక్రవారం ఎస్పీ సమావేశమయ్యారు. తిరుమలకు ఎవరైనా నిషేధిత వస్తువులు తీసుకొస్తున్నట్లు తెలిసినా, నేరస్తులనే అనుమానం కలిగినా వెంటనే 112 నంబరుకు సమాచారమివ్వాలని కోరారు. ఇకపై డ్రైవర్ల వాట్సాప్ గ్రూపుల్లో పోలీసులు కూడా ఉంటారని తెలిపారు.


ఏయూ @100

దేశంలోని పురాతన విద్యా సంస్థల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) ఒకటి. 1926 ఏప్రిల్ 26న ఏర్పాటైన ఏయూ 99 ఏళ్లను పూర్తి చేసుకుని వందో సంవత్సరంలోకి అడుగు పెడుతోంది. ఈ నేపథ్యంలో శనివారం నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 26వ తేదీ వరకు శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. నేడు ఏయూ ఆవిర్భావ దినోత్సవంతో పాటు శతాబ్ది వేడుకల ప్రారంభాన్ని పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

» నేటి నుంచి ఏడాది పాటు శతాబ్ది వేడుకలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రులకు ప్రత్యేక విశ్వవిద్యాలయం ఉండాలన్న పోరాట ఫలితంగా ఆంధ్ర విశ్వకళాపరిషత్ ఏర్పాటైంది. దేశంలోనే ఇది తొలి భాషా ప్రయుక్త విద్యా సంస్థ. దేశంలో పేరొందిన విద్యా సంస్థల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఒకటి. ఆంధ్ర ప్రాంతంలో వర్సిటీ ఏర్పాటు కోసం 1913 నుంచి ఐదేళ్లపాటు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్వహించారు. ఆ తరువాత ఉమ్మడి మద్రాస్ రాష్ట్రానికి జరిగిన తొలి రెండు ఎన్నికల్లో జస్టిస్ పార్టీ విజయం సాధించగా.. కౌన్సిల్‌కు ఎన్నికైన ఆంధ్ర ప్రాంత ప్రజాప్రతినిధులు యూనివర్సిటీ ఏర్పాటు చేయాలన్న వాదనను బలంగా వినిపించారు. అప్పటి విద్యా శాఖా మంత్రి సర్ అన్నెపు పరశురామ్ పాత్రో ఏయూ ఏర్పాటుకు 1925 ఆగస్టు 20న బిల్లు ప్రవేశపెట్టారు. 1926 ఏప్రిల్ 26న బెజవాడ కేంద్రంగా ఏర్పాటు చేశారు. తొలి వైస్ చాన్సలర్‌గా కట్టమంచి రామలింగారెడ్డి (సీఆర్ రెడ్డి), రిజిస్ట్రార్‌గా సీడీ శెట్టి నియమితులయ్యారు. అప్పట్లో ఉపకులపతికి ప్రతి నెలా వచ్చే రెండు వేల వేతనంలో సీఆర్ రెడ్డి సగం మొత్తాన్ని వర్సిటీ అభివృద్ధికి విరాళంగా ఇచ్చేవారు. ఏయూ అభివృద్ధికి దాతలు సహకరించాలన్న సీఆర్ రెడ్డి పిలుపు మేరకు పిఠాపురం, విజయనగరం, బొబ్బిలి, నిజాం రాజులు భారీగా విరాళాలు అందించేందుకు ముందుకువచ్చారు. ప్రభుత్వం కూడా కొంత మొత్తాన్ని గ్రాంటుగా అందించింది. ఈ నిధులను భవన నిర్మాణాలతో పాటు ఇతర అవసరాలకు వినియోగించారు. బెజవాడలో ఏర్పాటు చేసిన ఏయూను కొద్దికాలానికే మరో ప్రాంతానికి తరలించాలన్న డిమాండ్ వచ్చింది. 1930 సెప్టెంబరు ఐదో తేదీన విశాఖలో ఏయూ ఏర్పాటైంది. సర్క్యూట్ హౌస్ డౌన్‌లోని వాల్తేరు అప్‌ల్యాండ్ ప్రాంతంలో భవనాన్ని అద్దెకు తీసుకుని కార్యాలయాలను ఏర్పాటు చేశారు. తర్వాత రెవెన్యూ, దాతలు సమకూర్చిన సుమారు వేయి ఎకరాల సువిశాల విస్తీర్ణంలో ఏయూ ఏర్పాటైంది. కాగా వీసీ పదవికి సీఆర్ రెడ్డి రాజీనామా చేయడంతో బాధ్యతలు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు అప్పగించారు. ఆయన పదవీకాలం ముగిసిన తరువాత తిరిగి సీఆర్ రెడ్డి వీసీగా నియమితులయ్యారు. రెండోసారి వీసీగా 13 ఏళ్లపాటు సుదీర్ఘకాలం సేవలందించారు. ఏయూ ప్రభ దశదిశలా వ్యాపించేలా పలు సంస్కరణలు చేశారు.



మేధావుల పుట్టినిల్లు

ప్రపంచంలో గొప్ప మేధావులుగా పేరొందినవారు ఏయూలో పాఠాలు చెప్పారు. హిరెన్ ముఖర్జీ, సూరి భగవంతం, టీఆర్ శేషాద్రి, హుమయూన్ కబీర్, వీఈఆర్‌వీ రావు, మామిడిపూడి వెంకటరంగయ్య, పింగళి లక్ష్మీకాంతం వంటి ఎందరో మహనీయుల బోధనలతో వర్సిటీ పునీతమైంది. నోబెల్ గ్రహీత సీవీ రామన్ ఏయూ పూర్వ విద్యార్థి. కొన్నాళ్లు గౌరవ ఆచార్యులుగా పనిచేసి పరిశోధనల్లో భాగస్వామ్యమయ్యారు. సుప్రసిద్ధ సాంఖ్యక శాస్త్ర నిపుణుడు, పద్మవిభూషణ్ సీఆర్‌రావు కూడా ఏయూ పూర్వ విద్యార్థే. వర్సిటీ పూర్వ విద్యార్థుల్లో ఐదుగురు శాంతి స్వరూప్ భట్నాగర్, ఇద్దరు పద్మవిభూషణ్, ఐదుగురు పద్మశ్రీ అవార్డులను అందుకున్నారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్, అమెరికాలో ఎఫ్‌డీఏ డైరెక్టర్ డాక్టర్ ప్రభ ఆత్రేయ, జీఎంఆర్ గ్రూపు సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావు వంటి ఎంతోమంది ప్రముఖులు ఏయూలో విద్యను అభ్యసించారు.

20 వేలమంది విద్యార్థులు

తొలుత 20 మందితో ప్రారంభమైన వర్సిటీలో ప్రస్తుతం సుమారు 20 వేల మంది విద్యార్థులు వివిధ కోర్సులు చదువుతున్నారు. వర్సిటీలో 59 దేశాలకు చెందిన వేయి మంది విదేశీ విద్యార్థులు చదువుకుంటున్నారు. తొలుత తెలుగు, హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్ విభాగాలు ఉండేవి. ప్రస్తుతం 58 విభాగాలు, 16 ప్రత్యేక పరిశోధన కేంద్రాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, జీఐఎస్ ల్యాబ్‌లు, 76 సమావేశ మందిరాలతో వర్సిటీ విరాజిల్లుతోంది. ప్రస్తుతం 450 ఎకరాల్లో 215 భవనాల్లో వర్సిటీ నిర్వహిస్తున్నారు. వర్సిటీలో తొలుత 1931లో ఆర్ట్స్ కళాశాల ప్రారంభమైంది. ఆ తరువాత సైన్స్, న్యాయ, ఫార్మసీ, ఇంజనీరింగ్, మహిళా ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటయ్యాయి. ఈ క్రమంలోనే దూరవిద్యను ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఏయూ పరిధిలో 200కుపైగా కాలేజీలు ఉన్నాయి. వర్సిటీకి ఇప్పటి వరకూ 18 మంది వైస్ చాన్సలర్లు సేవలు అందించారు. ప్రస్తుత వీసీ జీపీ రాజశేఖర్ నేతృత్వంలో శతాబ్ది వేడుకలు జరుగుతున్నాయి.

మేకప్

చెమటకు చెదరకుండా

వేసవిలో ఉక్కపోతకు మేకప్ చెదిరిపోతుందనే భయం వెంటాడుతూనే ఉంటుంది. ఇలాంటి భయాలకు లోను కాకుండా ఉండాలంటే 'స్వెట్ ప్రూఫ్ మేకప్' ఎంచుకోవాలి. అందుకోసం...

వేసవి ఉక్కపోత, చెమటలతో మస్కారా కారిపోవచ్చు. ఫౌండేషన్ చెదిరిపోవచ్చు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే చెమటకు చెదరిన మేకప్ మెలకువలు పాటించాలి.

చల్లని నీళ్లతో: స్వేద రంధ్రాలు కుంచించుకుపోయి, చర్మం నిగనిగలాడాలంటే, చల్ల నీళ్లలో ముఖాన్ని ముంచాలి. మేకప్ ముందు కొన్ని నిమిషాల పాటు గడ్డకట్టే చల్ల నీళ్లలో ముఖాన్ని ముంచి ఉంచి, ఆ తర్వాత మేకప్ వేసుకోవడం మొదలుపెట్టుకోవాలి. అప్పుడు చెమట తగ్గుతుంది

ప్రైమర్‌తో: వాటర్ రెసిస్టెంట్ ప్రైమర్‌తో చర్మపు నూనెల ప్రభావానికి కారిపోకుండా ఉంటుంది. వేసుకున్న మేకప్ చెమటకు కారిపోకుండా నియంత్రించాలంటే, చక్కని మ్యాటిఫైయింగ్ ప్రైమర్‌ను ఎంచుకోవాలి



ఫౌండేషన్: తేలికగా ఉండే సీరమ్ ఫౌండేషన్స్ వేసవికి తగినవి. వీటిని ఉపయోగించుకుంటే మేకప్ ముద్దలుగా ఊడిపోకుండా ఉంటుంది. అలాగే ఆల్ ఇన్ వన్ ఫౌండేషన్ లేదా టింటెడ్ మాయిశ్చరైజర్‌లలో ఏదో ఒకదాన్ని వాడుకోవాలి

చెదిరిపోకుండా: ఐషాడో, లేదా మస్కారా చెమటకు కారిపోతూ ఉంటుంది. కాబట్టి నీటితో చెక్కుచెదరి ఐ మేకప్‌ను ఈ కాలంలో ఎంచుకోవాలి. ఖోల్, జెల్ ఐలైనర్లు, మస్కారాలు, ఐషాడోలు ఈ కోవకు చెందినవే అయి ఉండాలి. స్మడ్జ్ ప్రూఫ్ ఉత్పత్తులు చర్మపు జిడ్డుకు చెక్కుచెదరకుండా ఉంటాయి.

పౌడర్ బ్లష్ వద్దు: చెక్కిళ్ల మీద గులాబీ రంగు బ్లష్ అద్దుకోనిదే మేకప్ పూర్తి కాదు. కానీ చెమటలు ఎక్కువగా పట్టే తత్వం ఉన్నవాళ్లు పౌడర్ బ్లష్‌కు బదులుగా క్రీమ్ బ్లష్ ఎంచుకోవాలి. దీంతో చెక్కిళ్లకు సహజసిద్ధమైన గులాబీ రంగు సమకూరడంతో పాటు, ఈ రంగు చెమటకు కారిపోకుండా కూడా ఉంటుంది.

సెట్టింగ్ స్ప్రే: మేకప్ కరిగిపోకుండా ఉంచే మరొక చిట్కా సెట్టింగ్ స్ప్రే. నాణ్యమైన సెట్టింగ్ స్ప్రేతో మేకప్ ముద్దలు కట్టదు, చెదిరిపోదు. ఈ స్ప్రేలోని దినుసులు చెమటకు అవరోధంగా మారి, వాటర్‌ప్రూఫ్ మేకప్ లుక్‌ను తెచ్చిపెడతాయి. స్ప్రే బాటిల్‌ను ముఖానికి అడుగు దూరంలో ఉంచి ముఖం మీద స్ప్రే చేసుకోవాలి. ఇదే సరైన పద్ధతి.

బ్లాటింగ్ పేపర్: ఎన్ని జాగ్రత్తలు పాటించినా ఎంతో కొంత చెమట ముఖానికి పడుతూనే ఉంటుంది. దీన్ని అద్దుకోవడం కోసం బ్లాటింగ్ పేపర్స్ అందుబాటులో ఉంచుకోవాలి.



45 శాతం మేమే

శ్రీలంకలో పుట్టారు. ఆరేళ్లకే కుటుంబంతో సహా స్విట్జర్లాండ్ వెళ్లారు. అక్కడే నర్సింగ్ విద్య అభ్యసించారు. కొవిడ్ సమయంలో అత్యవసరమైన వైద్య సేవలు అందించారు. నర్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలిగా హక్కుల కోసం పోరాటం చేశారు. ఆ నేపథ్యమే ఆమెను రాజకీయాల వైపు నడిపించింది. గ్రెంచెన్‌బర్గ్ మున్సిపల్ కౌన్సిలర్‌గా, సొంత రాష్ట్రం సోలోథర్న్ కౌన్సిల్ సభ్యురాలిగా... ఆ తరువాత స్విట్జర్లాండ్ పార్లమెంటు ఎంపీగా గెలిచారు. రాజకీయ నాయకురాలిగానే కాకుండా... ఎన్నో సేవా కార్యక్రమాల్లో భాగస్వామి అయ్యారు... స్విట్జర్లాండ్ ఎంపీ **ఫరా రూబీ**. హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆమెతో 'నవ్య' ప్రత్యేక ఇంటర్వ్యూ.

'భారత్ సమ్మిట్' లక్ష్యం ఏంటి?

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రగతిశీల శక్తులన్నీ ఒక చోట చేరి... సమానత్వం, శాంతి, సౌభ్రాతృత్వం, న్యాయ సాధనల కోసం ఒక విధానం, ఒక కార్యాచరణ తయారు చేయడం.

నర్సింగ్ సేవల నుంచి రాజకీయాల వైపు పయనం ఎలా? ఎందుకని?

నర్సింగ్‌లో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశా. మేముండే గ్రెంచెన్‌బెర్గ్‌లోనే పని చేసేదాన్ని. అయితే కొవిడ్‌లో భయంకర పరిస్థితులు చూడాల్సి వచ్చింది. ఆ మహమ్మారి అప్పటివరకు వైద్య రంగంలో ఉన్న అనేక లోపాలను బయటపెట్టింది. అయితే దాని ఫలితం అనుభవించింది మాత్రం సంరక్షణ సేవలు అందిస్తున్న నర్సులు, సహాయకులు, వైద్యులే. కొవిడ్‌లో నిరంతరాయంగా పని చేశాం. ఒకసారి 48 గంటలపాటు నిరంతరంగా సేవలు అందించాం. ఆ సమయంలో నాతో పని చేసే ఒకామె బోరున ఏడ్చింది. ఆ పరిస్థితుల్లో పని చేయడం అత్యంత అవసరం. కానీ అంత సుదీర్ఘ పని గంటలు మానసికంగా దెబ్బతీసేవి. అంతే కాకుండా అటు ప్రజలతో పాటు ఇటు సంరక్షకులుగా ఉన్న మాకూ రక్షణ లేకుండా పోయింది. అప్పటికి మా రాష్ట్ర నర్సింగ్ సంఘం ఉపాధ్యక్షురాలిగా ఉన్న నేను... సంరక్షకులకు కూడా రక్షణ ఉండాలనే ప్రచారం ప్రారంభించా. దీనికి ప్రజలు, రోగుల నుంచి కూడా మద్దతు లభించింది. ఈ ప్రతిపాదనపై ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. ఒక కార్మిక సంఘం పెట్టిన ప్రతిపాదన స్విట్జర్లాండ్‌లో తొలిసారి 61 శాతం ఓట్లతో విజయం సాధించింది. ఈ నేపథ్యంలోనే నాకు రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచన వచ్చింది. ఆ లక్ష్యంతోనే 'సోషల్ డెమొక్రటిక్ పార్టీ'లో చేరా. తొలుత మా గ్రెంచెన్‌బర్గ్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యురాలిగా ఎన్నికయ్యా. ఆ తర్వాత సోలోథర్న్ కౌన్సిల్ సభ్యురాలిగా గెలిచా. అనంతరం స్విట్జర్లాండ్ పార్లమెంటు దిగువసభ సభ్యురాలిగా ఎన్నికయ్యా.

స్విట్జర్లాండ్‌లో పార్లమెంటు ఎన్నికల్లో ఖర్చు ఏ స్థాయిలో ఉంటుంది? మీకెంత ఖర్చయింది?

ఎన్నికల్లో డబ్బు అవసరం అనేది అంత ముఖ్యం కాదు. అయితే మా దేశంలోనూ డబ్బు ఖర్చుపెట్టి ఎన్నికల్లో గెలవాలనుకునేవారు ఉన్నారు. కానీ డబ్బున్నవాళ్లు చాలామంది ఎన్నికల్లో గెలవలేదు. నేను కొన్ని వందల స్విస్ ఫ్రాంక్స్ మాత్రమే ఖర్చు చేశా. మా నియోజకవర్గాల్లో భారత్‌లోలా భారీ సంఖ్యలో ఓటర్లు ఉండరు. మాదేశ జనాభానే 89 లక్షలు. నా నియోజకవర్గ జనాభా 30 వేల మంది. అందులో ఓటర్లు ఇంకా తక్కువ మంది ఉంటారు. నా ఉద్దేశంలో రాజకీయాల్లో డబ్బుకు ఉన్న ప్రాముఖ్యత కొద్ది శాతమే. అదే సమయంలో రాజకీయాల్లో తెలివితేటలతో సంబంధం లేదు. స్మార్ట్‌గా మాత్రం ఉండాలి. స్విస్‌లో భారీ డబ్బు అవసరం లేదు. ఒక ఆలోచన కావాలి. దానిపై పని చేయాలి. మార్పు కోసం పోరాడాలి. నేను నర్సును. నర్సులు, వైద్యులం కొవిడ్‌లో ఏం కావాలో చూశాం. రాజకీయంగా చేసిందేమీ లేదు. మేం సేవ చేశాం. మార్పు కోసం ప్రయత్నించా. అనేక అంశాలపై మాట్లాడా. ప్రజలతో ఉన్నా. ఆ తర్వాత ఎంపీ అయ్యా.

ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సామాజిక, న్యాయ సవాళ్లు ఏంటి?

ప్రపంచ వ్యాప్తంగా రైట్ పార్టీలు ఎన్నికవడంతో సమస్యలు వస్తున్నాయి. భవిష్యత్తులోనూ ఇది సమస్యలకు దారి తీస్తుంది. ఇక మా దేశంలో ద్వేషం, తప్పుడు సమాచారం, లింగ సమానత్వం ప్రధాన సవాళ్లు. మాది బలమైన ప్రజాస్వామ్య దేశమే అయినా కొన్ని సమస్యలున్నాయి. భవిష్యత్తులో ఏమవుతుందో అన్న భయం కూడా ఉంది. అదే సమయంలో జీవన వ్యయం పెరిగిపోతోంది. మాది ధనిక దేశమే. కానీ పేద ప్రజలూ ఉన్నారు. అంతేకాదు... ఆసియా దేశాలతో పోలిస్తే ఎంతో ఉన్నతంగా స్విస్ ఉన్నా... మా దేశంలోనూ గత మూడు నెలల్లో 14 భ్రూణ హత్యలు జరిగాయి. ఆడపిల్లలను గర్భంలోనే చంపేశారు. అందుకే వచ్చే అక్టోబరులో మా దేశంలో లింగ సమానత్వంపై ఒక సదస్సు పెట్టాం.

మీ దేశంలో మహిళలకు రాజకీయాల్లో రిజర్వేషన్లు ఉన్నాయా?

స్విస్‌లో మహిళలకు మంచి ప్రాతినిధ్యం ఉంటుంది. ప్రగతిశీలంగా ఉన్నాం. మహిళల విద్య చాలా ఎక్కువ. మేం చాలా ఇన్నోవేటివ్‌గా ఉంటాం. మా దేశానికి వలసలు ఎక్కువ. దేశ జనాభాలో 33 శాతం వలస వచ్చినవారే. అయితే స్విస్, విదేశీయులు అన్న తేడా అక్కడ ఉండదు. అందరికీ సమానావకాశాలే. ఇక మా దగ్గర రాజకీయాల్లో మహిళలకు రిజర్వేషన్లు లాంటివి లేవు. అయినా మొత్తం చట్టసభల సభ్యుల్లో 45 శాతం మంది మహిళలమే ఉన్నాం. మా దగ్గర రెండు సీట్లు ఉంటే ఒకటి మగ, ఒకటి ఆడ అన్నట్లుగానే అనుకుంటాం. అలాగని దానికి సంబంధించిన కచ్చితమైన నిబంధన ఏదీ లేదు. కానీ అది పూర్తిగా లాజిక్ కదా! సమానత్వం ఉండాలి కదా!

సామాజిక న్యాయం సాధించేందుకు ఎలాంటి విధానాలు కావాలంటారు?

క్లిష్టమైన ప్రశ్నే. ప్రస్తుతం అనేక దేశాల మధ్య భారీ వాణిజ్య, స్వేచ్ఛా వ్యాపార ఒప్పందాలు జరుగుతున్నాయి. మరోవైపు సుంకాల యుద్ధం కూడా జరుగుతోంది. కానీ ఈ వాణిజ్య, వ్యాపార ఒప్పందాలే కాదు... సామాజిక న్యాయం, లింగ సమానత్వం లాంటివికూడా కావాలి. వీటి కోసం ప్రతి స్థాయిలో సంస్కరణలు కావాలి. మనం ఎలాంటి సమాజంలో జీవించాలని అనుకుంటున్నామనేది ముఖ్యం. దానికి అనుగుణంగా, అందులో అంతా ఉండేలా విధానాలు రూపొందించుకోవాలి. దానికి భారత్ సమ్మిట్‌లాంటివి ఉపకరిస్తాయి.

ప్రపంచ సంతోషకర దేశాల్లో స్విట్జర్లాండ్ మూడో స్థానంలో ఉంది? ఎలా?

మేం మా లక్ష్యం ఏంటో తెలుసుకుంటాం. దాని కోసమే పనిచేస్తాం. అదే సమయంలో ఆ లక్ష్యం సాధించేశాం అనుకుంటే... ఆ తర్వాత వెంటనే ఇంకా ప్రపంచ బాగుకోసం ఏం చేయాలి. మనిషి జీవితం బాగుండేందుకు ఇంకా ఏం చేయాలి అని ఆలోచిస్తాం. అయితే ఒత్తిడితో పని చేయం. ఇష్టంతోనే, ఇష్టమైన రంగంలోనే పని చేస్తాం. అదే బహుశా మా సంతోషానికి కారణాల్లో ఒకటి కావొచ్చు.

కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిపై మీ స్పందనేంటి?

మనసును పిండేసే ఘటన. దుర్మార్గం. అంతా ఖండించాల్సిందే. చర్చలు, పరస్పరం మాట్లాడుకోవడం, అదే సమయంలో ఉగ్రవాదంపై పోరు చాలా ముఖ్యం. ఇలాంటి సమయంలో విడిపోవడం కాదు. దేశమంతా దీనికి వ్యతిరేకంగా నిలబడాలి. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం.

• ఉప్పులూరి మురళీకృష్ణ, హైదరాబాద్

జార్జియాలో లొకేషన్ల అన్వేషణ





నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న చిత్రం 'అఖండ 2: తాండవం'. ఎమ్.తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. సంయుక్త కథానాయికగా నటిస్తున్నారు. దసరా పండుగ సందర్భంగా సెప్టెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా, ఈ చిత్రం తదుపరి షెడ్యూల్ జార్జియాలో జరగనుంది. దర్శకుడు బోయపాటి శ్రీను ప్రస్తుతం అక్కడ అందమైన లొకేషన్ల వేటలో ఉన్నారు. ఈ క్రమంలోనే బోయపాటి తన పుట్టినరోజును జార్జియాలో జరుపుకున్నారు. బాలకృష్ణ, ఇతర ప్రముఖ నటులు పాల్గొనే కొన్ని కీలక సన్నివేశాలను అక్కడ చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి థమన్ స్వరాలు సమకూర్చుతున్నారు. సినిమాటోగ్రాఫర్ సి.రామ్‌ప్రసాద్, ఎడిటర్ తమ్మిరాజు.



తన కోసమే...

నాని, శ్రీనిధి శెట్టి జంటగా శైలేశ్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. వాల్ పోస్టర్ సినిమా, నాని యునానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్లపై ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. మే 1న ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా నుంచి 'తన కోసమే నా పొగరే..' అంటూ సాగే పాటను విడుదల చేశారు. మిక్కీ జె మేయర్ స్వరాలు సమకూర్చగా అనిరుధ్ ఆలపించారు.

చిత్రజ్యోతి
SINCE 1965

'సింగిల్'గా వస్తున్నాడు

శ్రీవిష్ణు హీరోగా, కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా కార్తిక్ రాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సింగిల్'. నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో విద్యా కొప్పినీడి, భాను ప్రతాప్, రియాజ్ చౌదరి నిర్మించారు. తాజాగా మేకర్స్ ఈ సినిమా మే 9న ప్రేక్షకుల ముందుకు వస్తున్నట్లు అనౌన్స్‌మెంట్ వీడియో రిలీజ్



చేశారు. వీడియోలో హీరో విష్ణు మే 9న విడుదలైన సూపర్ హిట్ మూవీస్ గురించి చెబుతుండగా చివర్లో నిర్మాత అల్లు అరవింద్ ప్రవేశించారు. జైలర్ హుకుం స్టయిల్‌లో మే 9న రిలీజ్ డేట్‌ని అల్లు అరవింద్ లాక్ చేయడం ఆసక్తిగా అనిపించింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

వక్ఫ్ చట్టంపై స్టే ఇవ్వొద్దు



- వక్ఫ్ ఆస్తుల నమోదుపై స్టే ఇచ్చినా ఇబ్బందే
- ఇస్తే న్యాయ వ్యవస్థే చట్టం చేసినట్లవుతుంది
- పార్లమెంటు చేసిన చట్టం రాజ్యాంగబద్ధమే
- సుప్రీంలో కేంద్రం కౌంటర్ అఫిడవిట్ దాఖలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: సవరించిన వక్ఫ్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం గట్టిగా సమర్థించింది. దానిపై పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ స్టే విధించాలన్న ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించింది. చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టేయాలని సుప్రీంకోర్టును అభ్యర్థించింది. పార్లమెంటు ఆమోదించిన చట్టం కనుక రాజ్యాంగ ధర్మాసనం భిన్నమైన తీర్పు ఇచ్చేవరకు ఆ చట్టాన్ని రాజ్యాంగ బద్ధంగానే రూపొందించి ఉంటారని భావించాలని చెప్పింది. పిటిషనర్లు దురుద్దేశపూరితమైన తప్పుడు వాదనలను ముందుకు తెచ్చారని వ్యాఖ్యానించింది. వాటిని కోర్టు పరిశీలిస్తున్న దశలో స్టే విధించరాదని కోరింది. రేపు ఆ పిటిషన్లు కొట్టివేసిన తర్వాత ఏ కమ్యూనిటీ తరఫున పిటిషన్లు వేశామంటున్నారో ఆ కమ్యూనిటీయే స్టే వల్ల వల్ల నష్టపోయే ప్రమాదం ఉందని, ఇది అవాంఛనీయ పరిస్థితని వ్యాఖ్యానించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం తన వాదనను అఫిడవిట్ రూపంలో సుప్రీంకోర్టులో దాఖలు చేసింది. 1332 పేజీల ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్‌లో ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని గట్టిగా సమర్థించుకుంది. 2013 వక్ఫ్ చట్టం తర్వాత దాదాపు 21 లక్షల ఎకరాల భూమి వక్ఫ్ జాబితాలో తాజాగా చేరిందని ప్రస్తావించింది. మొఘలుల కాలం నుంచి స్వతంత్ర్యం వచ్చినప్పటి వరకు ఉన్న వక్ఫ్ భూములన్నీ కలిపి 18.29 లక్షల ఎకరాలు మాత్రమేనని వెల్లడించింది. గత చట్టంలోని నిబంధనలను అవకాశంగా చేసుకొని ప్రైవేటు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నారన్న ఆరోపణలు ఉన్నట్లు పేర్కొంది. మైనారిటీ వ్యవహారాల శాఖ సంయుక్త కార్యదర్శి షేర్షా సీ షేక్ మొహినుద్దీన్ పేరిట అఫిడవిట్‌ను దాఖలు చేశారు. సాధారణంగా తుది తీర్పు ఇచ్చేవరకు రాజ్యాంగ ధర్మాసనాలు పార్లమెంటు ఆమోదించిన చట్టాలపై స్టే విధించవని గుర్తు చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం వక్ఫ్ బిల్లుపై మధ్యంతర ఆదేశాలు జారీ చేయాలన్న విజ్ఞప్తిపై మే 5న విచారణ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్టే ఆలోచన వద్దని సుప్రీంకోర్టును కోరింది. ఏప్రిల్ 8వ తేదీలోగా వక్ఫ్ బై యూజర్ ఆస్తులను నమోదు చేసుకోవాలని చట్టంలో ఉన్న నిబంధనపైనా నియంత్రణలు విధించాలని పిటిషనర్లు చేసిన విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. దానిపై ఎలాంటి స్టే విధించినా న్యాయస్థానం ఆదేశాలతో చట్టం చేసినట్లు అవుతుందని వ్యాఖ్యానించింది. కొత్త చట్టంతో కేంద్ర, రాష్ట్రాల వక్ఫ్ బోర్డుల్లో ముస్లిములు మైనారిటీలు అవుతారన్న పిటిషనర్ల వాదనను కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. సెంట్రల్ వక్ఫ్ బోర్డులో 22 మంది సభ్యుల్లో కేవలం నలుగురు ముస్లిమేతరులు ఉంటారని, దానివల్ల ముస్లిం మెజారిటీకి ఎలాంటి భంగం కలగదని పేర్కొంది. వక్ఫ్ బై యూజర్ ఇప్పటిదాకా భూమిని రిజిస్టర్ చేసుకోలేదన్న వాదనను కేంద్ర ప్రభుత్వం కొట్టిపారేసింది. ఇప్పుడు ఈ విషయంలో సుప్రీంకోర్టు కనుక స్టే ఇస్తే చాలా తేడాలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. చట్టం లక్ష్యమే నెరవేరకుండా పోతుందని వ్యాఖ్యానించింది. రాజ్యాంగబద్ధంగా భావిస్తున్న ఒక చట్టాన్ని మార్చాలన్న ప్రతిపాదనను అనుమతించరాదని స్పష్టం చేసింది. న్యాయసమీక్ష కూడా ఒక రాజ్యాంగ బద్ధ చట్టాన్ని ఆపకూడదని వ్యాఖ్యానించింది. పిటిషనర్లు కోరిన వాటికి అనుకూలంగా ఏ ఉత్తర్వు ఇచ్చినా మొత్తం చట్టంపై స్టే ఇచ్చినట్లేనని కేంద్ర ప్రభుత్వం వాదించింది. కొత్త చట్టం ద్వారా వక్ఫ్ ఆస్తుల గుర్తింపు, నియంత్రణకు న్యాయస్థానాల ప్రామాణికత వస్తుందని వ్యాఖ్యానించింది. ఆస్తి హక్కు విషయంలో ఏ వ్యక్తీ కోర్టుకు వెళ్లలేని పరిస్థితి ఉండకూడదని ఈ మార్పులు చేసినట్లు తెలిపింది. ఈ చట్టంతో ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందన్న వాదనను కూడా కేంద్రం ఖండించింది. ముస్లింల మతాచారాలను గౌరవిస్తూ చట్టాన్ని రూపొందించామని, విశ్వాసం, ప్రార్థన లాంటి అంశాల జోలికి పోలేదని, వక్ఫ్ నిర్వహణలో లౌకిక అంశాలపైనే చట్టం చేశామని వివరించింది.

ప్రజ్ఞా ఠాకూర్‌కు ఉరి శిక్ష వేయండి

మాలేగావ్ పేలుళ్ల కేసులో కోర్టుకు ఎన్ఐఏ విజ్ఞప్తి



ముంబై, ఏప్రిల్ 25: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాలేగావ్ పేలుళ్ల కేసులో.. సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ సహా ఏడుగురు నిందితులకూ చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా)లోని సెక్షన్ 16 కింద మరణ శిక్ష విధించాలని ఎన్ఐఏ కోర్టుకు విజ్ఞప్తిచేసింది. ముంబై ప్రత్యేక కోర్టులో కొనసాగుతున్న ఈ కేసు విచారణ కిందటి శనివారం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ కేసును విచారించిన జడ్జి ఏకే లహోటీ.. తీర్పును మే 8వ తేదీకి వాయిదా వేశారు. 1389 పేజీలతో తన తుది వాదనలను సమర్పించిన ప్రాసిక్యూషన్.. నిందితులందరికీ మరణశిక్ష విధించాలని అందులో కోరింది. నిజానికి ఈ కేసులో నిందితులకు ఎనిమిదేళ్ల క్రితం క్లీన్‌చిట్ ఇచ్చిన ఎన్ఐఏ.. ఆ తర్వాత పూర్తి యూటర్న్ తీసుకోవడం గమనార్హం. కేసు వివరాల్లోకి వెళ్తే.. 2008 సెప్టెంబరు 29న మహారాష్ట్రలోని మాలేగావ్‌లో రంజాన్ ప్రార్థనల సమయంలో రెండు పేలుళ్లు జరిగి ఆరుగురు ముస్లింలు మరణించారు. 100 మందికి పైగా గాయపడ్డారు. ఈ కేసును తొలుత మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ విచారించి.. ప్రజ్ఞా ఠాకూర్, శివనరాయణ్ గోపాల్ సింగ్ కల్సంగ్రా, శ్యామ్ భవర్లాల్ సాహూను అరెస్టు చేసింది. ఆ ముగ్గురితో సహా.. మొత్తం 16 మందిని నిందితులుగా పేర్కొంటూ ఎంకోకా (మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్) కింద అభియోగాలు నమోదు చేయడంతో వారికి ఎక్కడా బెయిల్ దొరకలేదు. 2011లో ఎన్ఐఏ ఈ కేసు దర్యాప్తు చేపట్టింది. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చాక.. 2015లో ఎన్ఐఏ ఈ కేసులో సాక్షులను తిరిగి విచారించి, ప్రజ్ఞా ఠాకూర్ సహా మరికొందరికి క్లీన్‌చిట్ ఇస్తూ 2016లో చార్జిషీట్ దాఖలు చేసింది. ఇదే కేసులో.. లెఫ్టినెంట్ కర్నల్ పురోహిత్ సహా మరో 10 మందిపై ఎంకోకా చట్టం కింద దాఖలు చేసిన అభియోగాలన్నింటినీ తొలగించింది. కానీ, కోర్టు ప్రజ్ఞా ఠాకూర్ విచారణను ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసి విచారణను కొనసాగించింది. దాదాపు 17 సంవత్సరాలపాటు సుదీర్ఘంగా కొనసాగిన ఈ కేసు విచారణ ఎట్టకేలకు 2025 ఏప్రిల్ 19న ముగిసింది. అయితే.. ఈ కేసులో నిందితులకు 2016లో క్లీన్‌చిట్ ఇచ్చిన అదే ఎన్ఐఏ.. ఆ తర్వాత యూటర్న్ తీసుకుంది. ప్రజ్ఞాఠాకూర్ తదితరులకు మరణశిక్ష విధించాలని కోరింది.

హైపర్‌సోనిక్ స్క్రామ్‌జెట్ కంబస్టర్ పరీక్ష సక్సెస్

- హైదరాబాద్‌లోని డీఆర్‌డీఎల్‌లో ప్రయోగం



అల్వాల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అత్యంత వేగంగా దూసుకుపోయే హైపర్ సోనిక్ క్షిపణుల సాంకేతికతలో రక్షణ పరిశోధన సంస్థ (డీఆర్‌డీఓ) మరో ముందడుగు వేసింది. ధ్వని కంటే ఐదు రెట్లు ఎక్కువ వేగంతో అంటే గంటకు 6,100 కిలోమీటర్లకు పైగా వేగంతో దూసుకెళ్లే క్షిపణుల్లో వినియోగించే.. అత్యాధునిక స్క్రామ్‌జెట్ ఇంజన్‌కు సంబంధించి క్షేత్రస్థాయి పరీక్షను శుక్రవారం విజయవంతంగా నిర్వహించింది. హైదరాబాద్‌లోని రక్షణ పరిశోధన, అభివృద్ధి ల్యాబొరేటరీ (డీఆర్‌డీఎల్)లో కొత్తగా ఏర్పాటు చేసిన అత్యాధునిక 'స్క్రామ్‌జెట్ కనెక్ట్ టెస్ట్ ఫెసిలిటీ'లో ఈ పరీక్ష నిర్వహించారు. ఇది స్క్రామ్‌జెట్ ఇంజన్ సబ్‌స్కేల్ పరీక్ష (అసలైన పెద్ద ఇంజన్‌కు సంబంధించిన అచ్చమైన చిన్న ప్రతిరూపాన్ని తయారు చేసి పరీక్షించడం). ఈ విజయం సాధించిన డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అభినందించారు.

మాపై వైసీపీ దుష్ప్రచారం : అర్సా

అమరావతి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా అర్సా క్లస్టర్స్‌పై వైసీపీ, జగన్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని అర్సా క్లస్టర్స్ ప్రమోటర్ హరీష్ కోయా, సంస్థ కో-ఫౌండర్ సతీశ్ అబ్బూరి ఖండించారు. ఈ మేరకు వారు అమెరికా నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. తాము 28 సంవత్సరాలుగా ఐటీ, సప్లయ్ చైన్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, మేనేజ్‌మెంట్ రంగాల్లో విజయవంతంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నామని, 100 మిలియన్ డాలర్లకుపైగా నెట్‌వర్త్‌ను కలిగి ఉన్నామని హరీష్ పేర్కొన్నారు. తమకున్న అనుభవంతో ఏఐ రంగంలోకి కూడా అడుగుపెట్టి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని భావించినట్లు తెలిపారు. ఏఐ, డేటా మేనేజ్‌మెంట్ రంగాల్లో తనకు అపారమైన అనుభవం ఉందని, ఆ అనుభవంతోనే సొంత రాష్ట్రంపై ప్రేమతో ఏపీకి వచ్చామని చెప్పారు. వైసీపీ నేత, మాజీ ఎంపీ కేశినేని నాని చేసిన ఆరోపణలు నిరాధారమైనవన్నారు.

మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో.. పెద్దిరెడ్డి అనుచరుడు మాధవరెడ్డికి బెయిల్

చిత్తూరు/తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డికి చిత్తూరు సీఐడీ కోర్టు శుక్రవారం రాత్రి బెయిల్ మంజూరుచేసింది. గతేడాది జూలై 21వ తేదీ రాత్రి అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కీలక ఫైళ్లు కాలిపోయాయి. వైసీపీ హయాంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిధిలో పెద్దిరెడ్డి, ఆయన అనుచరులు అనేక భూఅక్రమాలకు పాల్పడ్డారని, ప్రభుత్వం మారాక ఈ అక్రమాలు వెలుగులోకి రాకుండా చేసేందుకే ఫైళ్లను దహనం చేశారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇది అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ప్రభుత్వం దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని దర్యాప్తు బాధ్యత సీఐడీకి అప్పగించింది. ఫైళ్ల దహనం ఘటనలో కీలక సూత్రధారిగా భావిస్తున్న మాధవరెడ్డిని గురువారం చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండల పరిధిలోని ఫాంహౌస్‌లో సీఐడీ అధికారులు అరెస్టు చేసి తిరుపతి తీసుకొచ్చారు. సీఐడీ కార్యాలయంలో డీఎస్పీ కొండయ్య, సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన్ను దాదాపు ఆరు గంటల పాటు విచారించారు. ఫైళ్ల దహనం వెనుక కీలక సూత్రధారి ఎవరని అడుగగా.. 'నాకు తెలియదు, నాకు సంబంధం లేదు' అని ఆయన జవాబిచ్చినట్లు తెలిసింది. ఈ ఘటనలో పెద్దిరెడ్డి, ఆయన వ్యక్తిగత కార్యదర్శి తుకారాం పాత్రపై వివిధ కోణాల్లో ప్రశ్నించగా.. ఆయన నుంచి సమాధానం రాలేదని తెలిసింది. ఏమడిగినా మాట్లాడకపోవడం.. తెలియదనే జవాబులే ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. అనంతరం మాధవరెడ్డిని రుయా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాక.. చిత్తూరు తరలించి సీఐడీ కోర్టులో హాజరుపరిచారు. మాధవరెడ్డి తరఫున హైకోర్టు న్యాయవాది రాజేంద్ర, సీఐడీ తరఫున ఏపీపీ ఉమాదేవి వాదనలు వినిపించారు. రిమాండ్ రిపోర్టు సరిగా లేదని, మార్పులుచేసి సమర్పించాలని న్యాయాధికారి షేక్ బాబాజాన్ ఆదేశించారు. దీంతో వారురిమాండు రిపోర్టును తిరిగి సమర్పించారు. అనంతరం మాధవరెడ్డికి బెయిల్ ఇస్తూ న్యాయాధికారి ఆదేశాలిచ్చారు. సోమవారంలోగా లక్ష పూచీకత్తుతో రెండు ష్యూరిటీలు సమర్పించాలన్నారు.

రాహుల్ గాంధీకి సుప్రీం చీవాట్లు

'సావర్కర్ బ్రిటిష్ సేవకుడు' అన్న.. వ్యాఖ్యలపై మండిపడ్డ న్యాయస్థానం







- గాంధీ కూడా బ్రిటిష్ పాలకులకు 'యువర్ సర్వెంట్' అనే లేఖ రాసేవారని వెల్లడి
- దేశ చరిత్ర తెలియనప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారని నిలదీసిన ధర్మాసనం
- సమరయోధులను ఎగతాళి చేయరాదని హితవు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టింది. స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్‌పై ఆయన చేసిన వ్యాఖ్యల పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేశారంటూ మండిపడింది. 'మన స్వాతంత్ర్య సమరయోధులను అపహాస్యం చేయరాదు' అని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. స్వాతంత్ర్య సమరయోధులను ఎగతాళి చేస్తూ మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ 2022లో మహారాష్ట్రలో నిర్వహించిన ర్యాలీలో సావర్కర్ బ్రిటిష్ సేవకుడని, వారి నుంచి పెన్షన్ కూడా తీసుకున్నారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు వీర సావర్కర్‌ను కించపరిచేలా ఉన్నాయంటూ నృపేంద్ర పాండే యూపీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాహుల్ వ్యాఖ్యలు సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు సమన్లు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ రాహుల్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ దశలో తమ జోక్యం అనవసరమని, సెషన్స్ కోర్టులోనే రివిజన్ పిటిషన్ దాఖలు చేయాలని హైకోర్టు లఖ్‌నవూ బెంచ్ సూచించింది. ఈ నేపథ్యంలో తనపై క్రిమినల్ చర్యలను నిలిపివేయాలని కోరుతూ రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం.. రాహుల్ గాంధీని తీవ్రంగా మందలించింది. "మహాత్మా గాంధీ కూడా బ్రిటిష్ పాలకులకు లేఖ రాసినప్పుడు 'మీ విశ్వాసపాత్రుడైన సేవకుడు' అనే రాసేవారు. ఈ విషయం మీ కక్షిదారు(రాహుల్)కు తెలుసా? మహాత్ముడు లేఖలో రాశారని.. ఆయన్ను కూడా బ్రిటిషర్లకు సేవకుడని అంటారా? ఆ రోజుల్లో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తులు కూడా 'యువర్ సర్వెంట్' అనే రాసేవారు. మీకు(రాహుల్) దేశ చరిత్ర గురించి ఏమీ తెలియనప్పుడు.. అలాంటి వ్యాఖ్యలు చేయకూడదు" అని ధర్మాసనం రాహుల్ తరఫున వాదనలు వినిపించిన అభిషేక్ మను సింఘ్వీకి స్పష్టం చేసింది. ఒక ప్రముఖ రాజకీయ పార్టీ నేత అయి ఉండీ ఇలాంటి వ్యాఖ్యలు ఎలా చేస్తారని నిలదీసింది. మనకు స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన వారి పట్ల ఇలాగేనా వ్యవహరించేది? అని నిలదీసింది. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సుమోటోగా తీసుకుంటామని హెచ్చరించింది. అయితే రాహుల్‌పై క్రిమినల్ చర్యలను నిలిపివేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఫిర్యాదుదారు నృపేంద్ర పాండేకు, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

సోనియా, రాహుల్‌లకు నోటీసుల జారీకి నో

- నిరాకరించిన ఢిల్లీ ప్రత్యేక కోర్టు
- నేషనల్ హెరాల్డ్ కేసు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: నేషనల్ హెరాల్డ్ ఆస్తుల బదిలీలో మనీలాండరింగ్ జరిగిందన్న ఆరోపణలపై కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇతరులకు నోటీసులు ఇచ్చేందుకు శుక్రవారం ఇక్కడి ప్రత్యేక కోర్టు నిరాకరించింది. వారికి నోటీసులు ఇవ్వాలన్న ఈడీ వినతిని ప్రత్యేక జడ్జి విశాల్ గోగ్నే అంగీకరించలేదు. కొత్త నిబంధనల ప్రకారం నిందితుల వాదనలు వినకుండా ఈడీ సమర్పించిన చార్జిషీటును పరిగణనలోకి తీసుకోకూడదని అందువల్ల వారికి నోటీసులు ఇవ్వలేమని తెలిపారు. అవసరముందని భావించినప్పుడు నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. చార్జిషీటులో ఏమైనా లోపాలు ఉన్నాయా అన్న విషయాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు.



శుక్రవారం సాకేత్ కోర్టు ఆవరణలో మేధా పాట్కర్

పరువు నష్టం కేసులో మేధా పాట్కర్ అరెస్టు, విడుదల

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పరువు నష్టం కేసులో సామాజిక ఉద్యమకారిణి మేధా పాట్కర్‌ను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. అయితే, కొద్ది గంటల వ్యవధిలోనే ఆమె విడుదలయ్యారు. మరోవైపు ఆమెకు విధించిన శిక్షను హైకోర్టు సస్పెండ్ చేసింది. 24 ఏళ్ల నాటి ఈ కేసులో ప్రొబేషన్ బాండు సమర్పించనందున ఆమెను అరెస్టు చేయాలని బుధవారం అదనపు సెషన్స్ జడ్జి నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేశారు. దాంతో పోలీసులు ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రాంతంలో ఉన్న ఆమె ఇంటికి వెళ్లి కస్టడీలోకి తీసుకున్నారు. ప్రస్తుత ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా మేధాపాట్కర్‌పై నర్మదా బచావో ఆందోళన్ సమయంలో పరువు నష్టం దావా వేశారు. దీనిపై ఈ నెల 8న విచారణ జరిపిన అదనపు సెషన్స్ జడ్జి సమాజానికి చేసిన సేవల దృష్ట్యా మేధా పాట్కర్‌కు జైలు శిక్ష నుంచి మినహాయింపు ఇచ్చారు. అయితే రూ.లక్ష జరిమానా విధించారు. అరెస్టు చేయకుండా ఏడాది పాటు ప్రొబేషన్ ఇచ్చారు. ఈ నెల 23లోగా రూ.25వేలకు ప్రొబేషన్ బాండు చెల్లించాలన్నారు. కానీ ఆ రోజున జరిగిన విచారణకు మేధా హాజరుకాకపోవడంతో అరెస్టు చేయాలంటూ తాజాగా వారెంట్లు జారీ చేశారు. ప్రస్తుతం రూ. లక్ష జరిమానా చెల్లించడంతో పాటు, ప్రొబేషన్ బాండు సమర్పించడంతో ఆమెను విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. మరోవైపు, మేధా పాట్కర్ రివిజన్ పిటిషన్‌పై విచారించిన ఢిల్లీ హైకోర్టు ఆమె జైలు శిక్షను సస్పెండ్ చేసింది.

అమెరికాకు పంపే ఐఫోన్లు.. ఇక భారత్‌లోనే తయారీ!


- చైనాలో ఉన్న తమ పరిశ్రమను భారత్‌కు తరలించాలని ఆపిల్ యోచన
- ట్రంప్ విధించిన సుంకాలే కారణం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: అమెరికాలో విక్రయించే ఐఫోన్‌ల తయారీ యూనిట్‌ను చైనా నుంచి భారత్‌కు తరలించాలని ఆపిల్ కంపెనీ యోచిస్తున్నట్లు వెల్లడైంది. చైనా మీద ఆధారపడటాన్ని తగ్గించుకోవాలన్న కంపెనీ దీర్ఘకాలిక వ్యూహంతోపాటు, ఇటీవలి కాలంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల ప్రభావమూ దీనికి కారణమని సమాచారం. చైనా దిగుమతుల మీద ట్రంప్ 145 శాతం సుంకం విధించిన సంగతి తెలిసిందే. దీనికి తాత్కాలికంగా 90 రోజుల మినహాయింపు ఇచ్చినప్పటికీ.. చైనా మీద ట్రంప్ తొలినుంచీ గుర్రుగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో, చైనాలో తయారయ్యే ఐఫోన్లను అమెరికాకు తీసుకెళ్తే సుంకం కారణంగా వాటి ధర భారీగా పెరుగుతుంది. దీంతో, ఈ తయారీకేంద్రాన్ని భారత్‌కు తరలించాలని ఆపిల్ భావిస్తోంది. భారత ఉత్పత్తుల మీద సుంకాన్ని ట్రంప్ 26 శాతానికే పరిమితం చేశారు. ప్రస్తుతం ఇది కూడా అమలులో లేదు. ఇప్పటికే భారత్‌లో ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థల సహకారంతో ఆపిల్ యూనిట్లు నడుస్తున్నాయి. అమెరికా మార్కెట్లో ఆపిల్ ఏటా సగటున ఆరు కోట్ల ఐఫోన్లను విక్రయిస్తోంది. 2026 నాటికి ఈ ఆరు కోట్ల ఐఫోన్ల తయారీని మొత్తంగా భారత్‌లోనే చేపట్టాలని ఆపిల్ భావిస్తోంది.

కస్తూరిరంగన్ కన్నుమూత

- తొమ్మిదేళ్లపాటు ఇస్రో చైర్మన్‌గా విశేష సేవలు



బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష రంగంలో విశేష సేవలందించిన ఇస్రో మాజీ చైర్మన్ కృష్ణస్వామి కస్తూరిరంగన్ బెంగళూరులో కన్నుమూశారు. కొన్ని నెలలుగా వృద్ధాప్య సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న కస్తూరి రంగన్ (84) శుక్రవారం మారతహళ్ళిలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. చివరి చూపు కోసం ఆయన పార్థివదేహాన్ని ఆదివారం రామన్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఆర్ఆర్ఐ)లో ఉంచి అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు. కేరళలోని ఎర్నాకుళంలో కృష్ణస్వామి అయ్యర్, విశాలాక్షి దంపతులకు 1940 అక్టోబరు 24న కస్తూరి రంగన్ జన్మించారు. 1994లో ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కస్తూరిరంగన్ తొమ్మిదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగి 2003 ఆగస్టులో పదవీ విరమణ చేశారు. ఆ సమయంలో ఇస్రో చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ ప్రయోగాలు విజయవంతమయ్యాయి. అంతకు ముందు ఆయన ఇస్రో ఉపగ్రహ కేంద్రం డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఇన్‌శాట్-2, ఐఆర్ఎస్-1ఏ, 1బీ విజయవంతానికి శ్రమించారు. భాస్కర-1, 2 ప్రాజెక్టులకు డైరెక్టర్‌గానూ సేవలందించారు. సివిల్ శాటిలైట్ ఐఆర్ఎస్-1సీ, 1డీ ప్రయోగాలతో పాటు మూడోతరానికి అవసరమైన ప్రయోగాలను సైతం విజయవంతం చేశారు. ఐఆర్ఎస్ పీ3, పీ4ల లాంచింగ్‌లో కీలకపాత్ర పోషి ంచారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ చాన్స్‌లర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ సెం టర్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన.. 2003-2009 మధ్యకాలంలో రాజ్యసభ సభ్యుడిగానూ సేవలందించారు. భారత ప్రణాళికా సంఘం సభ్యుడిగానూ పనిచేశారు. దేశానికి చేసిన సేవలకుగానూ పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డులు ఆయనను వరించాయి.

మహోన్నత వ్యక్తిని కోల్పోయాం: మోదీ


ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరిరంగన్ మృతిపట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ సహా పలువురు ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయనకు ఘన నివాళి అర్పించారు. 'భారత వైజ్ఞానిక, విద్యారంగంలో మహోన్నత వ్యక్తి కస్తూరి రంగన్ మరణం తీవ్రంగా కలచివేసింది. ఆయన దార్శనిక నాయకత్వం, దేశానికి చేసిన నిస్వార్థ సేవ ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఎంతో అంకిత భావంతో ఇస్రోకు సేవలందించిన ఆయన.. భారత అంతరిక్ష రంగాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లారు' అని మోదీ కొనియాడారు. కాగా, కస్తూరి రంగన్ మృతి దేశానికి తీరని లోటని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. కస్తూరి రంగన్ మృతి దేశానికి తీరని లోటని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు. అంతరిక్ష శాస్త్రవేత్తగానే కాక విద్యావేత్తగా జాతీయ విద్యావిధానం 2020ను రూపొందించడంతో కస్తూరిరంగన్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేసుకున్నారు. కస్తూరి రంగన్ మరణ వార్త తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని, ఆయన మృతి దేశానికి తీరని లోటని మంత్రి లోకేశ్ అన్నారు.

కస్తూరి రంగన్ ఒక ఆణిముత్యం: ఇస్రో చైర్మన్ నారాయణన్

కస్తూరిరంగన్ ఒక లెజెండరీ నాయకుడని, 20వేల మందితో కూడిన ఇస్రోకు ఆయన కుటుంబం లాంటివారని ఇస్రో చైర్మన్ వి నారాయణన్ అన్నారు. ఇస్రోను ప్రపంచస్థాయి సంస్థగా ఆయన తీర్చిదిద్దారని, తనలాంటి యువకులను ఎంతగానో ప్రోత్సహించారని కొనియాడారు. చంద్రయాన్ ప్రయోగం విజయవంతమైనప్పుడు ఆయన బాగా సంతోషించారని, వృత్తిపరంగా, వ్యక్తిగతంగా ఆయన ఒక ఆణిముత్యమని పేర్కొన్నారు. కస్తూరిరంగన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. కాగా.. కస్తూరిరంగన్ తన మాయాజాలంలో ఇస్రోకు అనేక అద్భుత విజయాలు కట్టబెట్టారని ఆయన సహచరులు, జూనియర్లు గుర్తుచేసుకున్నారు.

పాక్‌కు గుణపాఠం ఖాయం!

- స్థలం, సమయం ఖరారు చేయాలంతే
- అదీ సీసీఎస్ భేటీలో జరిగే ఉంటుంది
- 'ఆంధ్రజ్యోతి'తో జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ రాజేంద్రకుమార్



హైదరాబాద్, ఏప్రిల్ 25, (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పడం ఖాయమని జమ్మూకశ్మీరు మాజీ డీజీపీ రాజేంద్రకుమార్ అన్నారు. అయితే స్థలం, సమయం ఎప్పుడన్నదే తేలాల్సి ఉందని చెప్పారు. "పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయం. దీనిపై భద్రతా వ్యవహారాలపై ఏర్పడిన క్యాబినెట్ కమిటీ(సీసీఎస్) సమావేశంలో నిర్ణయం జరిగే ఉంటుంది. ఆ సమావేశంలో అన్ని ప్రతిపాదనలూ ఉంటాయి. మనం దాడిచేస్తే పాక్ ఎలా స్పందించవచ్చు? ఎప్పుడు, ఎక్కడ దాడి చేయాలి? ఇవన్నీ చర్చించే ఉంటారు" అని రాజేంద్రకుమార్ చెప్పారు. మనకు అనుకూలమైన సమయం, స్థలం చూసి, దాడి చేస్తారని.. ఇది జరగడం వంద శాతం ఖాయమని తెలిపారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఆయన జమ్మూకశ్మీర్‌లో వివిధ హోదాల్లో పనిచేసి డీజీపీగా పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ట్రస్ట్ సీఈవోగా ఉన్న రాజేంద్రకుమార్‌తో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకంగా మాట్లాడింది. సింధు జలాల ఒప్పందం రద్దు, భవిష్యత్ పరిణామాలు, ఉగ్రవాదానికి పాక్ మద్దతిస్తున్న తీరు.. తదితర అంశాలపై మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

మన బ్యారేజీల ఎత్తు పెంచుకోవచ్చు..

సింధు నది జలాల ఒప్పందం తర్వాత పాకిస్థాన్‌తో మనకు మూడు యుద్ధాలు జరిగాయి. కానీ, ఎన్నడూ ఆ ఒప్పందాన్ని రద్దు చేయలేదు. ఈసారి మాత్రమే కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ఒప్పందం రద్దుతో నీళ్ల వెళ్లకుంటే పాక్‌లోని పశ్చిమ పంజాబ్‌లో 80% వ్యవసాయం పడావు పడుతుంది. ఈ ఏడాదా? వచ్చే ఏడాదా? అన్నదే ప్రశ్న. అదే జరిగితే పాక్ జీడీపీలో 22 శాతం నేరుగా కోత పడుతుంది. మరోవైపు ఇప్పుడు మనం కావాలనుకుంటే మన బ్యారేజీల ఎత్తు పెంచుకోవచ్చు. విద్యుత్తు ప్రాజెక్టులకు ఎక్కువ నీటిని వినియోగించుకోవచ్చు.

జీ-7 దేశాల ఎఫ్ఏటీఎఫ్‌తో మళ్లీ బ్లాక్‌లిస్ట్ చేయించాలి

ఉగ్రవాద ప్రోత్సాహం అనేది పాకిస్థాన్ సిద్ధాంతం. హఫీజ్ సయీద్‌తో పాటు ప్రపంచం ఉగ్రవాదులుగా గుర్తించిన 90% మందికి పాకిస్థానే ఆశ్రయం కల్పిస్తోంది. ఇలా ఉగ్రవాదానికి సాయం చేసే దేశాలకు ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ లాంటి సంస్థల నుంచి నిధులు, విదేశీ సాయం అందకుండా చూసేందుకు జీ-7 దేశాలు 'ఫైనాన్షియల్ అసిస్టెన్స్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)' సంస్థను ఏర్పాటు చేశాయి. మనీలాండరింగ్, ఉగ్రవాదానికి సాయం చేసే దేశాలను ఇది గుర్తించి.. ఆయా దేశాలను బ్లాక్ లిస్ట్‌లో పెడుతుంది. ఒకప్పుడు పాక్‌కు విదేశీ ఆర్థిక సాయం నిలిపివేయాలని ఇది సిఫారసు చేసింది. దాంతో నిలిపివేశారు. ఆ తర్వాత తాను ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం లేదని పాక్ చెప్పుకోవడంతో నిషేధాన్ని తొలగించారు. ఇప్పుడు మళ్లీ పాక్ ఉగ్రవాదానికి మద్దతిస్తున్న అంశాన్ని లేవనెత్తి బ్లాక్‌లిస్ట్‌లో పెట్టించాలి.

వాణిజ్య మార్గాలు బంద్

జమ్మూకు రెండు, కశ్మీర్‌కు రెండు వ్యాపార మార్గాలు ఉండేవి. గత ప్రభుత్వాలు మన కశ్మీర్, పాక్ ఆక్రమిత కశ్మీర్ మధ్య అంతర్గత వాణిజ్యానికి, సరుకుల రవాణాకు అనుమతించాయి. దీంతో అక్కడి కూరగాయలు, వస్తువులు ఇక్కడకు, ఇక్కడి వస్తువులు అక్కడకు సరఫరా చేసేవారు. ఈ వస్తువుల మాటున పాక్ మాదకద్రవ్యాలను సరఫరా చేసేది. ఆర్టికల్ 370 రద్దుతో ఇవన్నీ ఆగిపోయాయి. అంతేకాదు, అక్కడ పర్యాటకం వృద్ధి చెంది ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కూడా బాగా పెరిగాయి.

పాక్ రెండు జాతుల సిద్ధాంతం విఫలం

ముస్లింల సంఖ్య పాక్ కంటే మనదేశంలోనే ఎక్కువ. జిన్నా నుంచి మొన్న పాక్ ఆర్మీ చీఫ్ అసిఫ్ మునీర్ వరకు చెప్పిన రెండు జాతుల సిద్ధాంతం తప్పని నిరూపితమైంది. పాకిస్థాన్‌లో ప్రస్తుతం తోలుబొమ్మ ప్రభుత్వం ఉంది. మరోవైపు మిలటరీ కూడా బలూచిస్థాన్‌లో దెబ్బలు తింది. వారిపైనా ప్రజల్లో వ్యతిరేకత. అందుకే ప్రజల దృష్టి మరల్చేందుకే పహల్గాం దాడి. అనంతనాగ్‌లో గతంలో ఇలాంటి దాడే జరిగింది.

గైడ్ కాదు.. దేవుడు!

11మంది పర్యాటకులను కాపాడిన కశ్మీరీ గైడ్ నజకత్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పహల్గాం ఉగ్రదాడి నుంచి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పర్యాటకులు, వారి పిల్లలను ఓ కాశ్మీరీ గైడ్ తన ప్రాణాలు పణంగా పెట్టి కాపాడాడు. ఛత్తీస్‌గఢ్‌లోని మనేంద్రగఢ్-చిర్మిరి- భరత్‌పూర్ జిల్లాకు చెందిన 11 మంది కశ్మీర్ యాత్రకు వెళ్లారు. వీరిలో నలుగురు దంపతులతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కశ్మీర్‌లో వీరికి నజకత్ అహ్మద్ షా(28) గైడ్‌గా వ్యవహరించారు. ఉగ్రదాడి జరిగిన సమయంలో వారంతా బైసారన్ మైదానంలో ఫొటోలు తీసుకుంటూ సరదాగా గడుపుతున్నారు. ఇంతలో తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించాయి. పర్యాటకులంతా తలో దిక్కుకు పరిగెత్తడం గమనించిన నజకత్.. ముగ్గురు చిన్నారులను తీసుకొని ఒక చిన్న మార్గం నుంచి బయటపడ్డాడు. ప్రమాదకరమైన కొండ దారుల్లో దాదాపు 14 కిలోమీటర్లు పరిగెత్తుకుంటూ వెళ్లి పహల్గాం పట్టణానికి చేరుకున్నాడు. అక్కడ సురక్షిత ప్రాంతంలో పిల్లలను ఉంచి మరోసారి వెనక్కువచ్చి మిగిలిన నాలుగు జంటలను కూడా కాపాడాడు. కాగా, పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో తన మేనమామ కుమారుడు ఆదిల్ ముష్కరుల తూటాలకు బలయ్యాడని నజకత్ ఆవేదన వ్యక్తం చేశారు. తనను నమ్ముకున్న పర్యాటకులు క్షేమంగా తిరిగి వెళ్లేవారకూ వారి వెంటే ఉండటం తన బాధ్యతగా భావించానని, అందుకే ఆదిల్ అంత్యక్రియలకు కూడా హాజరు కాలేకపోయానని తెలిపారు.

కాల్చేసి.. ప్రాణం పోయాకే వెళ్లారు

- హిందువులు, ముస్లింలను వేర్వేరుగా నిల్చోమన్నారు
- ఉగ్రదాడిలో భర్త శైలేశ్‌ను కోల్పోయిన శీతల్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: భార్యాభర్తలు.. వారి ఇద్దరు పిల్లలు 'మినీ స్విట్జర్లాండ్'గా పేరున్న ఆ పెహల్గాంకు వచ్చి అప్పటికి కేవలం 15-20 నిమిషాలే అవుతోంది. దూరం నుంచి తుపాకీ చప్పుళ్ల మోత వినిపించింది.. అప్రమత్తయ్యే లోపు సాయుధులైన ఉగ్రవాదులు దగ్గరికొచ్చేశారు. దంపతుల్లో భర్తను కాల్చేశారు. రక్తపు మడుగులో కొట్టుకుంటున్న అతడు చనిపోయే దాకా అక్కడే ఉన్నారు. ఇలా ముష్కరుల చేతిలో ప్రాణాలు పోగొట్టుకున్న శైలేశ్ కాలతీయ గురించి ఆయన భార్య శీతల్ గుర్తుచేసుకున్నారు. ఉగ్రవాదులు వచ్చీ రాగానే పురుషుల్లో హిందువులు, ముస్లింలు వేర్వేరు బృందాలుగా నిలబడాలంటూ చెప్పి.. రెండు, మూడు నిమిషాల్లో హిందువులను కాల్చిచంపారని శీతల్ చెప్పారు. తూటాల గాయాలతో కుప్పకూలిన తన భర్త తలను ఒళ్లో పెట్టుకొని సాయం కోసం అర్థించినా ఎవ్వరూ రాలేదని.. ఉగ్రవాదులు పారిపోయాక కూడా వెంటనే సహాయక చర్యలు చేపట్టలేదని ఆమె వాపోయారు. పిల్లలను తీసుకొని అక్కడి నుంచి పారిపోండంటూ స్థానికులు గట్టిగా అరవడంతో తాను తన ఇద్దరు పిల్లలను వెంటబెట్టుకొని చెప్పుల్లేని కాళ్లతో మోకాలి లోతులో ఉన్న బురదను దాటుకుంటూ వెళ్లాలని.. ఓ చోట ఆర్మీ జవాను తారసపడి " అసలు మీరు అక్కడికి ఎందుకు వెళ్లారు?" అని ప్రశ్నించాడని వెల్లడించారు. తాము ప్రభుత్వాన్ని, భద్రతా దళాలపై నమ్మకం పెట్టుకొనే అక్కడికి వెళ్లామని చెప్పారు.

గుర్రం యజమానులతో బేరమే బతికించింది!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: మరీ.. అంతా? బాబ్బాబూ చార్జీలు కొంచెం తగ్గించరూ! పెహల్గాంకు వెళ్లేందుకు ఇలా గుర్రాల యజమానులను ఆ బృందం బతిమాలుకుంది! వారేమో కుదరదంటున్నారు.. వీరేమో బతిమాలుతునే ఉన్నారు! ఇలా ఓ 15 నిమిషాల పాటు బేరమాడటమే ఆ బృందం ప్రాణాలను కాపాడింది. మహారాష్ట్రలోని కొల్హాపూర్, సాంగ్లీ, పుణె, రత్నగిరి ప్రాంతాలకు చెందిన ఓ 28 మంది ఈనెల 17న కశ్మీర్‌లోని బైసారన్ లోయకు వెళ్లారు. 22న పెహల్గాం సమీపంలోకి చేరుకున్నారు. గుర్రాల మీద అక్కడికి చేరుకొనేందుకు వాటి యజమానులతో బేరమాడి.. అప్పటికే పర్యాటకులను ఎక్కించుకొని వెళ్లిన గుర్రాల రాక కోసం ఎదురుచూస్తున్నారు. అంతలోనే.. గుర్రాల నిర్వాహకుల్లో ఒకరు పరుగుపరుగున అక్కడికి వచ్చి.. ఎవ్వరూ అక్కడికి వెళ్లకండి.. అక్కడ కాల్పులు జరుగుతున్నాయి అని చెప్పాడు. "మృత్యువు నుంచి త్రుటిలో తప్పించుకున్నాం. 'మేం బేరమాడక పోతే గనక.. ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల్లో మా పేర్లూ ఉండేవి" అని 28 మంది బృందంలో కురానే అనే వ్యక్తి భయంభయంగా చెప్పాడు.

ముసాఫిర్, సమీర్..నా ప్రాణాలు కాపాడారు!



కొచ్చి, ఏప్రిల్ 25: ఆమె కేరళకు చెందిన మహిళ. పేరు ఆరతి మేనన్! ప్రస్తుతం తనకు కశ్మీర్‌లో ముసాఫిర్, సమీర్ అనే సోదరులు ఉన్నారని ఆమె చెబుతోంది. ఆరతి కూడా పెహల్గామ్ ఉగ్రదాడి బాధితురాలు. ఆరేళ్ల వయసున్న ఇద్దరు కుమారులు, తల్లిదండ్రులతో కలిసి బైసారన్‌కొచ్చింది. తల్లి షీలా మాత్రం దూరంగా కార్లో కూర్చుంటే మిగతా వారంతా అక్కడ ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తూ గుర్రపు స్వారీ చేస్తున్నారు. అయితే ఆరతి కళ్లెదుటే తండ్రి, 65 ఏళ్ల రామచంద్రన్‌ను ఉగ్రవాదులు కాల్చి చంపారు. పిల్లలను తీసుకొని భయంతో తాను దారితెన్నూ లేకుండా అడవులవైపు పరుగెత్తి సురక్షిత ప్రాంతానికి చేరుకున్నానని చెప్పింది. ఇంతటి విషాద సమయంలో తనకు ఏమాత్రం పరిచయం లేకున్నా ముసాఫిర్, సమీర్ అనే ఇద్దరు కశ్మీరీ ట్యాక్సీ డ్రైవర్లు ఓ సోదరిలా భావించి ఎంతో సాయం చేసి, అండగా నిలిచారని ఆరతి చెప్పింది. తన వెంట ఇద్దరూ కలిసి మార్చురీ దాకా వచ్చారని.. లాంఛనాలన్నీ పూర్తయ్యేదాకా దగ్గరుండి అన్నీ చూసుకున్నారని.. ఎయిర్‌పోర్టు దాకా కూడా వచ్చారని ఆమె వివరించింది. తనకు ముసాఫిర్, సమీర్ ఇద్దరూ సోదరులని.. వారిని అల్లా ఎప్పుడూ కాపాడాలని ఆరతి భావోద్వేగానికి గురైంది.

మా బిడ్డను కాపాడండి!

- పాక్ చెరలో ఉన్న జవాను పట్ల తల్లిదండ్రుల ఆందోళన

హుగ్లీ, ఏప్రిల్ 25: పాక్ చెరలో ఉన్న బీఎస్‌ఎఫ్ జవాను, పశ్చిమ బెంగాల్‌కు చెందిన పూర్ణం సాహూ క్షేమ సమాచారం తెలియక ఆయన తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ బిడ్డను ఎలాగైనా విడిపించి.. క్షేమంగా ఇంటికి తీసుకురావాలంటూ భారత ప్రభుత్వాన్ని వారు వేడుకుంటున్నారు. పూర్ణం సాహూ సెలవుల్లో ఇంటికొచ్చి మూడు వారాల క్రితమే విధుల్లో చేరాడని.. తమ బిడ్డ పరిస్థితి ఎలా ఉందో తెలియడం లేదని తండ్రి బోలేనాథ్ సాహూ ఆవేదన వ్యక్తం చేశాడు. కుమారుడు క్షేమంగా ఉన్నాడా? బతికే ఉన్నాడా? అనేదానిపై ఎవ్వరూ సమాచారం ఇవ్వడం లేదన్నారు. పెహల్గాం ఉగ్రదాడి ఘటనతో పాకిస్థాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ.. పూర్ణం సాహూ దాయాది చేతికి చిక్కడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

ఉగ్రవాదులు దేశభక్తులా?

- పాక్ ఉపప్రధానిని ప్రశ్నించిన క్రికెటర్ కనేరియా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పహల్‌గామ్‌లో దాడులకు పాల్పడ్డ ఉగ్రవాదులు దేశభక్తులని పాక్ ఉప ప్రధాని ఇషాక్ దర్ ప్రశంసించడాన్ని ఆ దేశ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా తప్పుపట్టారు. ఆయన ఎక్స్‌లో పోస్టు పెడుతూ ఉగ్రవాదులను దేశభక్తులనడం అవమానకరమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వమే ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందన్న వాదనను బహిరంగంగా అంగీకరించినట్టయిందని పేర్కొన్నారు.

చుక్క నీరు పోనివ్వం

(మొదటి పేజీ తరువాయి)

చర్యలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. త్వరలోనే ఆయా నదుల్లో పూడికతీత పనులు పూర్తిచేసి, నీటిని మళ్లిస్తాం" అని ఆయన వివరించారు. అనంతరం.. "సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయం న్యాయబద్ధమైనది. అది దేశ ప్రయోజనాల కోసం తీసుకున్న నిర్ణయం. సింధు జలాల్లో ఒక్క చుక్క నీరు కూడా పాకిస్థాన్‌కు వెళ్లకుండా మేం చూస్తాం" అని ఆయన 'ఎక్స్'లో కూడా పోస్ట్ చేశారు. పర్యాటకులపై దాడి నేపథ్యంలో అత్యంత కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా.. ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమన్న బలమైన సందేశాన్ని భారతదేశం పాక్‌కు పంపిందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు.. తాజా పరిణామాల నేపథ్యంలో సింధు జలాల వినియోగం నిమిత్తం చేపట్టిన వివాదాస్పద కాల్వల ప్రాజెక్టును పాక్ ఉపసంహరించుకుంది.

మరిన్ని దాడులు?

కశ్మీర్‌లోని స్థానికేతరులు, రైల్వే ఆస్తులు, పండిట్లే లక్ష్యంగా దాడులకు ఉగ్రవాదులు క్రియాశీలంగా ప్రణాళికలు రచిస్తున్నారంటూ నిఘా వర్గాలు అందించిన సమాచారంతో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. కశ్మీర్ లోయలో పనిచేస్తున్న రైల్వే సిబ్బందిలో చాలా మంది స్థానికేతరులే. చాలా మంది రైల్వే భద్రతా సిబ్బంది తరచుగా తమ బ్యారక్‌ల నుంచి బయటకు వచ్చి స్థానిక మార్కెట్లకు వెళ్తుంటారు. నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో.. బ్యారక్‌ల నుంచి బయటకు వెళ్లినవారిపై దాడులు జరిగే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది కాబట్టి, అలా వెళ్లొద్దంటూ అధికారులు వారిని ఆదేశించారు. ఉగ్రవాదులే కాక.. పాక్ గూఢచార సంస్థ ఐఎస్ఐ కూడా శ్రీనగర్, గాందర్‌బల్ జిల్లాల్లో కశ్మీరీ పండిట్లు, పోలీసులే లక్ష్యంగా దాడులకు ప్రణాళికలు రచిస్తున్నట్టు హెచ్చరికలు జారీ అయ్యాయి. మరోవైపు.. పహల్గాం దాడి నేపథ్యంలో భారత సైన్యం ఉగ్రవాదులపై వేటను ముమ్మరం చేసింది. పారామిలటరీ బలగాలకు సెలవులు రద్దు చేసింది. సెలవుపై ఉన్న జవాన్లు వెంటనే తిరిగి వచ్చి విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేసింది. జమ్ముకశ్మీర్ అంతటా భద్రత బలగాలను మోహరించారు. శ్రీనగర్ విమానాశ్రయంలో భద్రతను పెంచారు. అన్ని వైమానిక స్థావరాల్లో యుద్ధ విమానాలను సిద్ధం చేస్తున్నారు. సైనికులను సరిహద్దులకు తరలిస్తున్నారు. కాగా.. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శుక్రవారం ఉదయం శ్రీనగర్‌కు చేరుకుని భద్రత పరిస్థితిని సమీక్షించారు.

పాక్ దుస్సాహసం..ఎల్‌వోసీ వద్ద కాల్పులు

పహల్‌గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన భారత్‌పై పాకిస్థాన్ కాల్పులకు తెగబడింది. కాల్పుల విరమణను ఉల్లంఘించి నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో భారీఎత్తున కాల్పులు ప్రారంభించింది. భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది శ్రీనగర్, ఉధంపూర్‌లో పర్యటించడానికి కొన్ని గంటల ముందు ఈ దుశ్చర్యకు దిగింది. అయితే భారత జవాన్లు దీటుగా తిప్పికొట్టారు. కాగా.. ఎల్‌వోసీ వెంబడి పాక్ తన సేనలను రెట్టింపు చేసింది. భారత్ ఏ క్షణమైనా సైనిక దాడి చేయవచ్చన్న అంచనాతో పెద్దఎత్తున బలగాలను తరలిస్తోంది. అయితే సైనికులంతా బంకర్లలోనే ఉండి.. పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించింది. పాక్ ఆపరేషనల్ కంట్రోల్-కమాండ్ చూసే పదాతిదళం పూర్తి సన్నద్ధతతో ఉండాలని ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ ఆదేశించారు.



బాంబు పేలుడులో ధ్వంసమైన ఉగ్రవాది ఆదిల్ ఇల్లు

అది ముమ్మాటికీ ఉగ్రదాడే!

జమ్ముకశ్మీర్‌లోని పహల్ గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని అమెరికాలోని ప్రముఖ మీడియా సంస్థ 'న్యూయార్క్ టైమ్స్'.. 'తీవ్రవాద దాడి'గా పేర్కొనడాన్ని అగ్రరాజ్యానికి చెందిన విదేశీ వ్యవహారాల హౌస్ కమిటీ తీవ్రంగా ఖండించింది. "అది ముమ్మాటికీ ఉగ్రదాడే. మీరు తీవ్రవాద దాడి అని ఎలా తీర్మానిస్తారు?" అని మీడియా సంస్థను నిలదీసింది. అంతేకాదు.. సదరు పత్రిక ఈ కథనానికి పెట్టిన శీర్షికను సవరించి 'తీవ్రవాదులు' అనే పదాన్ని 'ఉగ్రవాదులు'గా మార్చి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కమిటీ సభ్యులు షేర్ చేశారు.

సరిహద్దుల్లో రాఫెల్స్ గర్జన

జమ్ము కశ్మీర్‌లోని పహల్ గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో భారత వాయుసేన(ఐఏఎఫ్) పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరికలే పంపించింది. సరిహద్దు వెంబడి 'ఎక్సర్‌సైజ్ ఆక్రమణ్' పేరుతో యుద్ధ విన్యాసాలు చేసింది. గురువారం చేపట్టిన ఈ విన్యాసాల్లో భారీ సంఖ్యలో రాఫెల్స్, ఎస్‌యూ-30ఎంకేఐ, ఎస్-400, మిగ్-21 యుద్ధ విమానాలు గగనతలంలో గర్జించాయి. వీటితోపాటు.. గరుడ కమాండోలు, ఎయిర్‌బార్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్, మిడ్ ఎయిర్ రెఫ్యూయెలర్స్ కూడా పాల్గొన్నాయి. ముఖ్యంగా ఉగ్రవాదులు దాడి జరిపిన చోట ఉన్న మైదాన ప్రాంతాలు, ఎత్తయిన పర్వత ప్రాంతాల పైన ఈ విన్యాసాలు సాగినట్టు మీడియా తెలిపింది. రాబోయే చార్‌ధామ్ యాత్ర కోసం ఉత్తరాఖండ్ పోలీసులు భద్రతను కట్టు దిట్టం చేశారు.

భద్రతాదళాలే లక్ష్యంగా..

పహల్గాం దాడిలో కీలకపాత్ర పోషించిన ఇద్దరు ఉగ్రవాదులు.. ఆదిల్ హుసేన్, అసిఫ్ షేక్ ఇళ్లలో గురువారం రాత్రి భారీ పేలుళ్లు జరిగాయి. రెండు ఇళ్లూ నేలమట్టమయ్యాయి. దర్యాప్తులో భాగంగా వారి నివాసాలను తనిఖీ చేసేందుకు వెళ్లిన భద్రతా దళాలు.. అక్కడ అనుమానాస్పద వస్తువులను గుర్తించి బయటకు వచ్చేశాయి. ఆ తర్వాత పేలుళ్లు సంభవించాయి. దర్యాప్తు అధికారులు తమను వెతుక్కుంటూ అక్కడికి వస్తారని ముందుగానే ఊహించి.. వారిని లక్ష్యంగా చేసుకుని పేలుడు జరిపేందుకే ఉగ్రవాదులు వాటిని అక్కడ ఉంచారని జమ్ముకశ్మీర్ పోలీసు అధికారి ఒకరు అన్నారు.

హమాస్ హస్తం?

మరోవైపు 2023, అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడికి, తాజాగా పహల్గాంలో ఉగ్రవాదుల మారణకాండకు పోలికలు ఉన్నాయని భారత్‌కు ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజార్ అన్నారు. రెండు ఘటనల్లోనూ సాధారణ పౌరులను లక్ష్యంగా చేసుకున్నారని పేర్కొన్నారు. ఉగ్రవాద గ్రూపుల మధ్య సమన్వయం పెరుగుతోందని, అన్ని స్థాయిల్లో సహకరించుకుంటున్నారని, ఒకరినొకరు అనుకరిస్తున్నారని హెచ్చరించారు. ఇజ్రాయెల్‌లో మ్యూజిక్ ఫెస్టివల్‌ను జరుపుకుంటున్న వారిపై హమాస్ దాడులకు తెగబడినట్లుగానే.. పహల్గాంలో అమాయక పర్యాటకులకు ఉగ్రవాదులు దాడి చేశారన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో ఇటీవల హమాస్ నేతలు పర్యటించారని, అక్కడ జైషే మహ్మద్ ఉగ్రవాదులు తదితరులను కలిసినట్లు తెలిసిందని తెలిపారు. ఆ తర్వాతనే జరిగిన పహల్గాం దాడి అనుమానాలకు తావిస్తోందన్నారు. పహల్గాం ఉగ్రదాడి బాధ్యులైన వారిని వేటాడుతామని ప్రధాని మోదీ చేసిన ప్రకటనతో పాటు భారత్ తీసుకున్న 1960 నాటి సింధూ జలాల ఒప్పందం రద్దు తదితర చర్యలను ప్రశంసించారు.

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు పెట్టండి

పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ పార్లమెంట్‌లో తీర్మానం చేసి ప్రపంచానికి దేశ ఐకమత్యాన్ని చాటుదామని, ఇందుకోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించాలని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబాల్ ప్రధాని మోదీని కోరారు. అంతేకాక, అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలను వివిధ దేశాలకు పంపి పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడిని పెంచాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ ఆర్మీకి చెందిన 10 మంది సైనికులు బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ చేతిలో హతమయ్యారు. బలూచిస్థాన్ ప్రావిన్స్ రాజధాని క్వెట్టా శివారు ప్రాంతంలో పాకిస్థాన్ ఆర్మీకి చెందిన సైనికులు ప్రయాణిస్తున్న వాహనాన్ని బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్‌ఏ).. రిమోట్ కంట్రోల్ ఐఈడీ ఉపయోగించి పేల్చేసింది.

అవును.. ఉగ్రవాదాన్ని పోషించాం..



ఉగ్రవాదం విషయంలో దాయాది దేశం తన ముసుగు తానే తొలగించుకుంది. 'అవును.. ఉగ్రవాదులకు మా గడ్డపై శిక్షణ, నిధులు అందిస్తున్నాం' అంటూ పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పశ్చిమదేశాల కోసం ముప్ఫై ఏళ్లుగా ఈ చెత్త పనులు తాము చేస్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు. 'స్కై న్యూస్.ఇన్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో.. పాక్ నిజ స్వరూపాన్ని ఆయన బయటపెట్టేశారు. ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడటానికే ఇదంతా చేశామనే అర్థం వచ్చేలా ఆయన మాట్లాడారు. "నిజమే, మేం ఈ చెత్త పనులను (ఉగ్రవాదులకు నిధులు, శిక్షణ) అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసం చేశాం" అని ఖవాజా తెలిపారు. ఇంతలోనే సర్దుకుని, ఆ పొరపాటును గ్రహించామని, దాని ఫలితాన్ని కూడా అనుభవిస్తున్నామని చెప్పారు. పహల్గాం దాడి తమ పనేనని లష్కరే తాయిబా అనుబంధ సంస్థ ద రెసిస్టెన్స్ ఫ్రంట్ ప్రకటించుకుంది. దీనిపై వేసిన ప్రశ్నకు ఖవాజా స్పందిస్తూ.. లష్కరే తాయిబా ఇప్పుడు పాక్‌లో ఉనికిలో లేదని, రెసిస్టెన్స్ ఫ్రంట్ అనే సంస్థ పేరు విననే లేదని చెప్పే ప్రయత్నం చేశారు. ఈ దాడిని పురస్కరించుకుని పాక్‌పై రక్షణ చర్యలకు భారత్ ఉపక్రమిస్తోందంటూ ఆయన ఎదురుదాడికి ప్రయత్నించారు. తమ భూభాగంలో భారత్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోందంటూ నోరు పారేసుకున్నారు.

"మీరు నీళ్లు ఆపేస్తే.. మేము మీ ఊపిరి ఆపేస్తాం"

- హఫీజ్ సయీద్ భారత్‌ను బెదిరిస్తున్న పాత వీడియో వైరల్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 : పహల్గాం ఉగ్రదాడికి బదులుగా భారత్ సింధు జలాల ఒప్పందం అమలును నిలిపివేసిన నేపథ్యంలో పాకిస్థాన్ పరోక్ష బెదిరింపులకు దిగింది. 2008 ముంబై ఉగ్రదాడి సూత్రధారి, లష్కరే తాయిబా చీఫ్ హఫీజ్ సయీద్.. సింధు జలాల అంశంలో భారతదేశాన్ని, ప్రధాని మోదీని తీవ్రంగా హెచ్చరిస్తున్న ఓ పాత వీడియోను బయటకు తీసింది. "మీరు పాకిస్థాన్‌కు నీళ్లు ఆపేస్తే, మేము మీ ఊపిరి ఆపేస్తాం. నదుల్లో రక్తం పారుతుంది" అంటూ హఫీజ్ సయీద్ ఓ బహిరంగ సభలో భారత్‌ను హెచ్చరించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసింది.

బందీపోరాలో ఎదురుకాల్పులు: లష్కర్ కమాండర్ లల్లీ హతం

శ్రీనగర్, ఏప్రిల్ 25: జమ్మూ-కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేతకు భద్రతా బలగాలు ముమ్మరంగా కృషి చేస్తున్నాయి. శుక్రవారం బందీపోరా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో లష్కర్ ఎ తోయిబాకు చెందిన అగ్రస్థాయి కమాండర్ అల్తాఫ్ లల్లీ హతమయ్యాడు. పహల్గాం దుర్ఘటన అనంతరం పోలీసులు-భద్రతా బలగాలు ఉమ్మడిగా గాలింపు చర్యలు చేపడుతుండగా కుల్నార్ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్టు కచ్చితమైన సమాచారం అందింది. బలగాలు అజాస్ ప్రాంతం వద్దకు రాగా ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో మొదట ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. అనంతరం జవాన్లు దీటుగా సమాధానం ఇవ్వడంతో అల్తాఫ్ లల్లీ హతమయ్యాడు. గాయపడ్డ పోలీసులను వెంటనే ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం వారు కోలుకుంటున్నారు.

పాకిస్థానీలను వెనక్కి పంపండి

- మా సూచనలు అమలు చేయండి
- అన్ని రాష్ట్రాల సీఎంలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఫోన్

హైదరాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్ చేశారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్‌పై అనేక ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా దేశంలో ఉన్న పాకిస్థానీలను ఈ నెలాఖరుకల్లా తిరిగి పంపించేయాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలని అమిత్ షా ముఖ్యమంత్రులను కోరారు. పాకిస్థానీలకు ఇచ్చిన వీసాలను రద్దు చేసిన నేపథ్యంలో నిర్దేశిత గడువు తర్వాత ఒక్క పాకిస్థానీ కూడా దేశంలో ఉండవద్దని షా స్పష్టం చేశారు. ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రులను కోరారు. ఆయా రాష్ట్రాల్లో ఎంత మంది పాకిస్థానీలు ఉన్నారో లెక్క తీయాలని, వారందరినీ తిప్పి పంపేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

హైదరాబాద్‌లో 208 మంది పాకిస్థానీలు..

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల నేపథ్యంలో డీజీపీ జితేందర్ ఓ ప్రకటన విడుదల చేశారు. సాధారణ వీసాలపై వచ్చిన పాకిస్థానీలు ఈ నెల 27 కల్లా, వైద్య వీసాలపై వచ్చినవారు 29 కల్లా దేశం విడిచి వెళ్లాలని స్పష్టం చేశారు. ఈ నెల 30 తర్వాత అట్టారీ సరిహద్దును మూసివేస్తున్నట్లు తెలిపారు. నిర్దేశిత గడువులోగా పాకిస్థాన్‌కు తిరిగి వెళ్లకుంటే చట్టరీత్యా చర్యలుంటాయని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో 208 మంది పాకిస్థానీలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిలో 8 మంది మెడికల్ వీసాలపై, 156 మంది లాంగ్‌టర్మ్ వీసాలపై, నలుగురు షార్ట్ టర్మ్ వీసాలతో వచ్చారని, మిగిలిన వారు ఇతర పనులపై వచ్చారని తేల్చారు.



హైదరాబాద్‌లో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో రేవంత్ రెడ్డి, విజయశాంతి, దామోదర రాజనరసింహ, అసదుద్దీన్ ఒవైసీ తదితరులు

బెంగళూరులో పాకిస్థానీయులను గుర్తిస్తాం

- హోం మంత్రి పరమేశ్వర్

బెంగళూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో అధికారికంగా, అనధికారికంగా నివసిస్తున్న పాకిస్థానీయులను గుర్తిస్తామని కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పాకిస్థానీలను వెనక్కు పంపే విషయంలో వివాదం లేదని, ఇప్పటికే వీసాలు రద్దు చేశారని వివరించారు. బెంగళూరులో అనధికారికంగా ఉంటున్న పాకిస్థానీల కోసం పోలీసులు గాలిస్తున్నారని తెలిపారు. జాతీయ భద్రత విషయంలో ఇంకా కఠినమైన నిర్ణయాలు రావాల్సి ఉందని పరమేశ్వర్ అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, పహల్‌గామ్‌లో ప్రభుత్వం ఎందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని ప్రశ్నించిన సీనియర్ జర్నలిస్టుపై బీజేపీ కార్యకర్తలు దాడి చేశారు. జమ్మూ-కశ్మీర్‌లోని కథువాలో బీజేపీ కార్యకర్తలు పహల్‌గామ్ దాడికి నిరసనగా ధర్నా చేశారు. అయితే అక్కడ భద్రతపరమైన లోపాలు ఎందుకు ఉన్నాయని దైనిక్ భాస్కర్ రిపోర్టర్ రాకేశ్ శర్మ, మరికొందరు విలేకరులు వారిని ప్రశ్నించారు. ఇలాంటి ప్రశ్నలు వేసి, వేర్పాటువాదుల భాష మాట్లాడుతావా అంటూ బీజేపీ కార్యకర్తలు ఆయనపై దాడి చేశారు.

సైనికంగా బుద్ధి చెప్పేందుకు నాలుగు మార్గాలు

- పాక్‌పై మిలటరీ చర్యల అంశంలో రక్షణ నిపుణుల అంచనాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 25: పహల్‌గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై భారత్ సైనికపరంగా ఎలాంటి చర్యలు చేపట్టవచ్చనే దానిపై రక్షణ రంగ నిపుణులు నాలుగు అంశాలను వివరిస్తున్నారు.

ఆధునిక యుద్ధ విమానాలతో దాడి

రఫేల్, మిరేజ్ 2000 వంటి అత్యాధునిక యుద్ధ విమానాలు, వాటికి అమర్చిన క్షిపణులతో పాకిస్థాన్‌లోని లక్ష్యాలపై దాడులు చేయవచ్చు. అత్యంత వేగంగా, కచ్చితత్వంతో ఉగ్ర, మిలటరీ స్థావరాలను ధ్వంసం చేసేందుకు అవకాశం ఉంటుంది. పాక్‌కు భారీ నష్టం కలిగించవచ్చు. అయితే ఇది ఒక రకంగా యుద్ధానికి పురికొల్పడమే. అంతర్జాతీయంగా ఒత్తిళ్లు వచ్చే అవకాశాలు ఎక్కువ.

నియంత్రణ రేఖ వెంట దాడులు

పాకిస్థాన్ సిమ్లా ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో.. సరిహద్దుల్లోని నియంత్రణ రేఖ (ఎల్వోసీ)కు విలువ లేకుండా పోతుంది. అంటే మన సైన్యం దాన్ని దాటి ముందుకు చొచ్చుకెళ్లి.. పాక్ ఔట్‌పోస్టులు, ఉగ్ర స్థావరాలపై దాడి చేయవచ్చు. కానీ అక్కడి భౌగోళిక పరిస్థితులపై అవగాహన లేక ఇబ్బంది తప్పదు. పాక్ సైన్యం ముందే సిద్ధంగా ఉండి దూకుడుగా ప్రతిదాడి చేయవచ్చు. నష్టం ఇరువైపులా ఉంటుంది.

సర్జికల్ దాడులు: వ్యూహాత్మక మిలటరీ స్థావరాలు, ఉగ్ర క్యాంపులపై సర్జికల్ దాడులు చేయవచ్చు. కానీ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పాక్ ముందే సిద్ధంగా ఉండే అవకాశాలు ఎక్కువ. పక్కా ప్రణాళిక, లక్ష్యాల వద్ద పరిస్థితిని నిరంతరం గమనించే నిఘా, అధునాతన బలగాలు అవసరం. దీనితో పాక్‌కు కలిగే నష్టం అంత ఎక్కువగా ఉండకపోవచ్చు.

సరిహద్దు ఇవతలి నుంచే

నియంత్రణ రేఖ లోపలే ఉండి.. శతఘ్నులు, భారీ మోర్టార్లు, గన్‌లతో నియంత్రణ రేఖ వెంట పాక్ స్థావరాలు, ఔట్‌పోస్టులు, సరఫరా వ్యవస్థలను ధ్వంసం చేయవచ్చు. కచ్చితంగా గురిపెట్టి లక్ష్యాలను ఛేదించే స్నైపర్ ఆపరేషన్లు నిర్వహించవచ్చు. కానీ దీనివల్ల ఆ దేశానికి జరిగే నష్టం పరిమితంగానే ఉంటుంది.

ఉగ్రవాదంపై పోరుకు ఐక్యంగా భారత్

- లోక్‌సభలో విపక్ష నేత రాహుల్‌గాంధీ

శ్రీనగర్, ఏప్రిల్ 25: ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు భారత్ ఐక్యంగా నిలుస్తుందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఉద్ఘాటించారు. దేశ ప్రజలను విభజించేందుకే జరిగిన ఉగ్రదాడిని తిప్పికొట్టేందుకు ప్రతి భారతీయుడు ఒక్కటిగా కలిసి పోరాడాలని అన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో గాయపడిన క్షతగాత్రులను పరామర్శించడానికి ఆయన శుక్రవారం ఉదయం జమ్మూకశ్మీర్ చేరుకున్నారు. బాదామీబాగ్‌లోని ఆర్మీ 92 బేస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడిని పరామర్శించిన అనంతరం రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. ఇక్కడ జరిగిన ఉగ్రదాడి గురించి తెలుసుకుని సాయపడేందుకు వచ్చానన్నారు. 'ఇది భయానక విషాదం. ఉగ్రదాడిని జమ్మూకశ్మీర్ ప్రజలందరూ ముక్తకంఠంతో ఖండించారు. వారు పూర్తిగా జాతికి మద్దతుగా నిలిచారు. ఈ పరిస్థితుల్లో దేశ ప్రజలందరూ ఒక్కటిగా నిలవాలని కోరుతున్నాను. ఉగ్రదాడిలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వారికి నా ప్రేమాభిమానాలు ఉంటాయి' అని పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష భేటీలోనూ కేంద్రానికి బాసటగా నిలిచిన ఐక్య విపక్షం ఉగ్రదాడిని ఖండించిందని గుర్తు చేశారు. అటుపై శ్రీనగర్‌లో జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లాలతోనూ రాహుల్ గాంధీ సమావేశమయ్యారు.

కంచి పీఠం ఉత్తరాధికారిగా గణేశ శర్మ



- అన్నవరం రుగ్వేద పండితుడికి అవకాశం
- 30న సన్యాస దీక్ష ఇవ్వనున్న శంకరాచార్య విజయేంద్ర సరస్వతి

చెన్నై/అన్నవరం/బాసర, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం కాంచీపురంలోని సుప్రసిద్ధ కంచి కామకోటి పీఠం ఉత్తరాధికారిగా అన్నవరానికి చెందిన దుడ్డు సత్య వెంకట సూర్య సుబ్రహ్మణ్య గణేశ శర్మ ద్రావిడ్ నియమితులయ్యారు. ఈ నెల 30న అక్షయ తృతీయ సందర్భంగా ఆయనకు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు విజయేంద్ర సరస్వతి శంకరాచార్యులు సన్యాస దీక్ష ఇస్తారని కంచి పీఠం శ్రీకార్యం మేనేజర్ చల్లా విశ్వనాథ శాస్త్రి శుక్రవారం తెలిపారు. అన్నవరం దేవస్థానం వ్రత పురోహితుడిగా పనిచేస్తున్న దుడ్డు ధన్వంతరి, మంగాదేవి దంపతులకు 2000 ఏప్రిల్ 24న గణేశ శర్మ జన్మించారు. తల్లి గృహిణి. గణేశశర్మ ఆరో ఏటనే రత్నాకర భట్టు వద్ద రుగ్వేదం అభ్యసించి నిష్ణాతులయ్యారు. అనంతరం తెలంగాణలోని బాసర జ్ఞానసరస్వతి దేవస్థానంలో పండితుడిగా వ్యవహరించారు. ఆ సమయంలో బాసర పర్యటనకు వచ్చిన విజయేంద్ర సరస్వతి ఆయనను శంకర మఠానికి తీసుకెళ్లారు. అక్కడ తర్కం, మీమాంసతో పాటు సామవేదం, యజుర్వేదంలో స్వామీజీ స్వయంగా శిక్షణ ఇచ్చారు. 2018 జనవరి 28న జయేంద్ర సరస్వతి మహాసమాధి చెందడంతో అప్పట్లో ఉత్తరాధికారిగా ఉన్న విజయేంద్ర సరస్వతి 70వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. తర్వాత ఆరేళ్ల పాటు ఉత్తరాధికారి ఎంపిక వాయిదా పడుతూ వచ్చింది. కాగా, సన్యాస దీక్ష స్వీకరించిన అనంతరం మే 2న కంచి పీఠంలో జరిగే ఆదిశంకర జయంతి ఉత్సవాల్లో విజయేంద్ర సరస్వతితో పాటు ఉత్తరాధికారి కూడా పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు. గణేశ శర్మ నియామకంపై స్థానిక పండితులు, పురోహితులు, గ్రామస్థులు, బాసర దేవస్థానం సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

చక్కెర వ్యాధిని నియంత్రించే స్మార్ట్ కుక్కర్..!



పేటెంట్ లభించిన స్మార్ట్ కుక్కర్ గురించి వివరిస్తున్న శాస్త్రవేత్త సందీప్ రాజా

- బాపట్ల శాస్త్రవేత్త అద్భుత ఆవిష్కరణకు పేటెంట్
- మధుమేహ రోగులు, ఊబకాయులకు ఉపయుక్తం

బాపట్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మధుమేహ రోగులు, ఊబకాయులకు ఉపయోగపడేలా రూపొందించిన స్మార్ట్ కుక్కర్‌కు పేటెంట్ లభించింది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన సీనియర్ శాస్త్రవేత్త దోనేపూడి సందీప్ ఈ స్మార్ట్ కుక్కర్‌ను రూపొందించారు. దేశంలోనే తొలిసారిగా రూపొందించిన దీనికి ఇటీవలే పేటెంట్ వచ్చిందని, త్వరలో మార్కెట్‌లోకి వస్తుందని అధికారులు తెలిపారు. గ్లైసెమిక్ ఇండెక్స్ (జీఐ) స్థాయిలు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. ఈ కుక్కర్‌లో బియ్యాన్ని ఉడికించడం వల్ల జీఐ తగ్గుతుంది. దీంతో మధుమేహులకు చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. అన్నంలోని జీఐను తగ్గించి నెమ్మదిగా జీర్ణమయ్యేలా చేయడమే డయాబెటిక్ స్మార్ట్ రైస్ కుక్కర్ ప్రత్యేకత అని సందీప్ తెలిపారు. ఇందులో వండిన అన్నం తింటే అరుగుదల నిదానంగా జరిగి రక్తంలో చక్కెరస్థాయి పెరగకుండా చేస్తుందని చెప్పారు. జీవక్రియ మెరుగవుతుందని, శరీర బరువును నియంత్రణలో ఉంచుతుందని పేర్కొన్నారు. ఈ కుక్కర్‌ను మొబైల్ యాప్‌తో నియంత్రించవచ్చన్నారు. గతేడాది సందీప్ రూపొందించిన రెండు పరికరాలకు కూడా పేటెంట్ లభించింది.

కబ్జాల పునాదిపై 'సజ్జల' సామ్రాజ్యం



- 63 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ
- 'ఆంధ్రజ్యోతి' చెప్పింది అక్షర సత్యం

(కడప-ఆంధ్రజ్యోతి)

కడప శివారులోని సీకేదిన్నెలో ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ ఎస్టేట్ గురించి 'ఆంధ్రజ్యోతి' చెప్పిందే నిజమని తేలింది. కోట్లాది రూపాయలు విలువ చేసే 63 ఎకరాల ప్రభుత్వ భూములను ఈ ఎస్టేట్‌లో కలిపేసుకున్నారని అధికార యంత్రాంగం నిర్ధారించింది. చివరకు రెవెన్యూ, అటవీ భూములను సైతం లాగేసుకుని తమ ఎస్టేట్‌ను విస్తరించారని గుర్తించింది. మాజీ సీఎం జగన్‌కు ఇడుపులపాయ ఎలానో, సజ్జల కుటుంబానికి సీకే దిన్నె అంత...అన్నట్టు గత ప్రభుత్వంలో కబ్జాలపర్వం యథేచ్ఛగా సాగింది. సజ్జల సామ్రాజ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. 'రిజర్వు ఫారెస్టులో సజ్జల సామ్రాజ్యం' అనే కథనం ప్రచురించింది. వెంటనే ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీనికోసం కలెక్టరు చెరుకూరి శ్రీధర్ ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశారు. రెవెన్యూ రికార్డుల్లో సజ్జల ఎస్టేట్‌లో అటవీశాఖ భూములు ఉన్నట్టు స్పష్టంగా ఉంది. అయితే అటవీ శాఖాధికారులు ఈ భూమి మాది కాదంటూ చేతులెత్తేశారు. కలెక్టరు సీరియస్‌గా తీసుకుని గట్టి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు జేసీ అదితిసింగ్, అటవీశాఖ ల్యాండ్ సర్వేయర్లు పలుమార్లు క్షుణ్ణంగా పరిశీలించారు. తొలుత ప్రాథమికంగా 42 ఎకరాలు కబ్జా అయిందని భావించారు. అయితే, తుది పరిశీలనలో అది 63 ఎకరాల ప్రభుత్వ భూమిగా తేలింది. సజ్జల ఎస్టేట్‌లో ఫారెస్టుతోపాటు రెవెన్యూ భూములు కూడా ఉన్నాయి. ఇక్కడ మామిడి, నేరేడు, టేకు సాగుతోపాటు గెస్ట్‌హౌస్ నిర్మాణం చేసుకున్నారు. అధికార యంత్రాంగం సర్వే నంబర్ల వారీగా రైతులందరినీ పిలిపించి విచారించింది. ప్రభుత్వానికి తన నివేదికను అందించింది.



సజ్జల ఎస్టేట్‌లో మామిడి తోట

అసలేం జరిగిందంటే..

ప్రభుత్వానికి చేరిన నివేదికను అనుసరించి.. సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబానికి కడప, చిత్తూరు, హైదరాబాద్ జాతీయ రహదారిలోని సీకే దిన్నె మండలంలో వ్యవసాయ భూములు ఉన్నాయి. ఈ భూములన్నీ కడప నగర శివారులో ఉన్నాయి. రోడ్డు పక్కనే అయితే ఎకరం రూ.5 కోట్ల నుంచి రూ.7 కోట్లు పలుకుతోంది. కొద్దిగా దూరమైతే రూ.3 కోట్లు పైమాటే. కడపకు చెందిన కొందరు పారిశ్రామికవేత్తలు, డాక్టర్లు కడప-చిత్తూరు రహదారిలో ఫాంహౌస్‌లు ఏర్పాటుచేసుకున్నారు. సజ్జల కుటుంబీకులకు కూడా ఇక్కడ రెవెన్యూ పొలం సర్వే నం.1599, 1600/1, 2, 1601/1, 1ఎ, 2తోపాటు మరికొన్ని సర్వే నెంబర్లలో 200 ఎకరాలకుపైగా భూములు ఉన్నాయి. ఇందులో సజ్జల సోదరుడు దివాకర్‌రెడ్డి తనయుడు సందీప్‌రెడ్డి పేరిట 130 ఎకరాలు, కుటుంబసభ్యుల పేరుతో మిగతా భూములు సజ్జల ఎస్టేట్‌లో ఉన్నాయి. వీటిలో కొన్ని రిజిస్ట్రేషన్ అయిన భూములున్నాయి. ఇందులో సుమారు 146 ఎకరాలు పట్టా భూమి. ఇక డీకేటీ 5.14 ఎకరాలు, చుక్కల భూమి రెండు ఎకరాల పైచిలుకు ఉన్నాయి. వీటితోపాటు పక్కన ఉన్న భూములు కూడా బలవంతంగా లాక్కుని ఎస్టేట్‌లో కలిపేసుకున్నారు. అటవీ, రెవెన్యూకు సంబంధించిన భూములను కూడా ఆక్రమించారు. సీకే దిన్నె రెవెన్యూ సర్వే నం. 1629లో అటవీ భూములు, రిజర్వు ఫారెస్టు భూములు కూడా ఉన్నాయి.

దారితప్పిన వైద్యులపై చర్యలు

- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశం
- ఏసీబీ ప్రాథమిక విచారణలో ఆరోపణలు నిర్ధారణ

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): దారితప్పి వ్యవహరించారని ఆరోపణలొచ్చిన ఆరుగురు ప్రభుత్వ వైద్యులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. విధులకు హాజరు కాకుండా వచ్చినట్లు రిజిస్టర్లలో సంతకం చేయడం, లంచాలు తీసుకుని వైకల్య ధ్రువపత్రాలు జారీ చేయడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారని పలువురు వైద్యులపై ఆరోపణలొచ్చాయి. దీనిపై మంత్రి ఏసీబీ విచారణకు ఆదేశించారు. గుడివాడలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరాదేవి ఆస్పత్రికి రాకుండా హాజరు రిజిస్టర్లలో సంతకాలు చేస్తున్నారంటూ ఒక వ్యక్తి చేసిన ఫిర్యాదును డీసీహెచ్ ఉన్నతాధికారులు పరిశీలించారు. గతేడాది జనవరి-మార్చి కాలంలో ఆమె 22రోజులు ఆస్పత్రికి రాలేదని తేలింది. ఆయా రోజుల్లోనూ ఆమె రిజిస్టర్‌లో సంతకాలు చేయడంతో పాటు ముఖ ఆధారిత హాజరు కూడా నమోదు చేశారు. అయితే ఆ సమయంలో ఆమె ఒకరోజు మచిలీపట్నంలో, 8 రోజులు తణుకులో, 13 రోజులు విశాఖపట్నంలో ఉన్నట్లు వెల్లడైంది. ఇందిరా దేవిపై చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఎమ్మిగనూరు ఏరియా ఆస్పత్రిలో సివిల్ సర్జన్ స్పెషలిస్ట్‌గా పనిచేస్తున్న సుధ 2022 ఫిబ్రవరి నుంచి ఏడాది పాటు అనుమతులు తీసుకోకుండా విధులకు దూరంగా ఉన్నారు. దీనికి సంబంధించి హేతుబద్ధమైన కారణాలు చూపనందున విచారణకు మంత్రి ఆదేశించారు. కాగా, దివ్యాంగులకు వైకల్య ధ్రువపత్రాలు జారీ చేసేందుకు రూ.10వేల నుంచి రూ.25వేలు లంచం తీసుకుంటున్నట్లు ఏలూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులపై వచ్చిన ఫిర్యాదులపై ఏసీబీ విచారణ జరిపింది. సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఎస్.రాజేంద్రప్రసాద్, టి. రామమోహన్‌రావు, స్వర్ణ శ్రీనివాసులుకు భారీ జరిమానా విధించి, శాఖాపరమైన విచారణ చేపట్టనున్నారు. కాగా, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆరోగ్యాధికారిగా ఉంటున్న డాక్టర్ పి.వెంకటరమణయ్య కార్పొరేషన్‌కు రావాల్సిన రూ.12కోట్ల ఆదాయం వసూలు విషయంలో నిర్లక్ష్యం వహించారని ఏసీబీ నివేదిక ఇచ్చింది.

మద్యం స్కామ్‌లో మరో అరెస్టు



సజ్జల శ్రీధర్ రెడ్డిని పట్టుకున్న 'సిట్'.. హైదరాబాద్ నుంచి బెజవాడ తరలింపు

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంలో మరో కీలక వ్యక్తిని 'సిట్' అధికారులు అరెస్టు చేశారు. నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని సజ్జల శ్రీధర్ రెడ్డి(ఏ6)ని హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో అదుపులోకి తీసుకున్నారు. మొత్తం మద్యం కుంభకోణం సూత్రధారి రాజ్ కసిరెడ్డి కాగా... కమీషన్లు చెల్లించేలా కంపెనీలను బెదిరించడం, ఒత్తిడి చేయడంలో సజ్జల శ్రీధర్ రెడ్డిది కీలక పాత్ర. మద్యం కుంభకోణంలో ఇప్పటికే రాజ్ కసిరెడ్డి (ఏ1), ఆయన తోడల్లుడు చాణక్య (ఏ8)ను 'సిట్' అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు.. శ్రీధర్ రెడ్డిని అరెస్టు చేశారు. ఆయన వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి వ్యాపారంలో వాటా ఇచ్చి, వేల కోట్ల మద్యం వ్యాపారం చేసి వందల కోట్లు వెనకేసుకున్నట్లు సిట్ అధికారులు సమాచారం సేకరించారు. కొన్నాళ్లుగా ఆయన కదలికలపై దృష్టి సారించారు. ఎట్టకేలకు... శుక్రవారం సాయంత్రం శ్రీధర్ రెడ్డిని అరెస్టు చేసి. విజయవాడకు తీసుకొచ్చారు. శనివారం ఆయనను ఏసీబీ కోర్టులో ప్రవేశ పెడతారు.

ఇదీ శ్రీధర్ రెడ్డి పాత్ర...

మద్యం కుంభకోణంలో సజ్జల శ్రీధర్‌రెడ్డి పాత్ర గురించి చాణక్య రిమాండ్ రిపోర్టులోనే 'సిట్' క్లుప్తంగా వివరించింది. దీని ప్రకారం... 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్లో శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో ఒక భేటీ జరిగింది. తెలుగు రాష్ట్రాల్లోని మద్యం డిస్టిలరీస్ యజమానులను రప్పించారు. లిక్కర్ సరఫరా చేయాలంటే కనీసం 12శాతం కమీషన్ ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేశారు. కొందరు అంగీకరించారు. మరికొందరు నిరాకరించారు. కమీషన్లు ఇచ్చేందుకు సరేనన్న వారికి మాత్రమే ఆర్డర్లు ఇచ్చి... ఆ సరుకునే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉంచారు. కమీషన్ మొత్తం 2024నాటికి 20శాతం వరకూ పెంచడంలోనూ శ్రీధర్‌రెడ్డిదే మాస్టర్ మైండ్ అని 'సిట్' గుర్తించింది. ప్రతి నెలా కనీసం రూ.50-60 కోట్లు వసూలు చేయడం ఎలా.. అనే అంశంపై హైదరాబాద్‌లోని స్టార్ హోటళ్లలో సజ్జల శ్రీధర్ రెడ్డి, విజయసాయి రెడ్డి, మిథున్ రెడ్డి, రాజ్ కసిరెడ్డి, అప్పటి ఎండీ వాసుదేవరెడ్డి, ప్రత్యేక అధికారి సత్య ప్రసాద్ పలుమార్లు చర్చలు జరిపారు. కమీషన్లు ఇచ్చే కంపెనీలకే ఆర్డర్లు వెళ్లాయి. అలాగే అప్పటికే ఏపీలో ఉన్న డిస్టిలరీస్‌ను బలవంతంగా లాక్కుని సొంతంగా మద్యం తయారు చేయడం మొదలుపెట్టారు. సొంత ప్రభుత్వం.. సర్కారీ మద్యం దుకాణాలు.. సొంత బ్రాండ్లు! ఇలా... తామే ఆర్డర్లు పొంది, తమ డిస్టిలరీలలో తయారైన నాసిరకం మద్యాన్నే సరఫరా చేశారు. శ్రీధర్‌రెడ్డి ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌లో మిథున్‌రెడ్డికి వచ్చేలా ప్లాన్ చేశారు. వైసీపీ హయాంలో మద్యం దుకాణాల్లో పుష్కలంగా అందుబాటులో ఉన్న సదరన్ బ్లూ, నైన్ హార్స్ వంటివి వీరి ఉత్పత్తులే కావడం గమనార్హం.

ఎవరీ సజ్జల శ్రీధర్ రెడ్డి!

నంద్యాల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో అరెస్టయిన సజ్జల శ్రీధర్‌రెడ్డి నంద్యాల ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్. ఆయనది కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం తొండూరు మండలం తుమ్మలపల్లి! వైసీపీ కీలక నేత సజ్జల రామకృష్ణారెడ్డికి సమీప బంధువు. హైదరాబాద్, కర్నూలులో ఆయన విద్యాభ్యాసం సాగింది. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో 1997లో ఇంజనీరింగ్ చదివే సమయంలో అప్పటి నంద్యాల ఎంపీ ఎస్పీవై రెడ్డి కుమార్తె సుజలతో ఆయనకు పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు. వైసీపీలో చేరకముందు.. 2019లో నంద్యాల జనసేన ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి... ఓటమి పాలయ్యారు. 2012 పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. మద్యం స్కామ్‌పై విచారణ మొదలయ్యాక.. సజ్జల శ్రీధర్‌రెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

బోరుగడ్డకు సుప్రీంలో చుక్కెదురు

- మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణకు కోర్టు నిరాకరణ



న్యూఢిల్లీ/అనంతపురం క్రైం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. మధ్యంతర బెయిల్ కోసం అతడు దాఖలు చేసుకున్న పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌తో పాటు మరికొందరిని అసభ్య పదజాలంతో దూషించిన కేసులో బోరుగడ్డను పోలీసులు అరెస్టు చేశారు. అయితే తన తల్లికి అనారోగ్యమని చెబుతూ అతడు మధ్యంతర బెయిల్ పొందాడు. నకిలీ మెడికల్ సర్టిఫికెట్ సృష్టించి.. కోర్టును తప్పుదోవ పట్టించి.. మధ్యంతర బెయిల్ పొడిగింపు పొందిన అతడు.. హైకోర్టు ఆగ్రహంతో గత నెల 12న రాజమండ్రి జైల్లో లొంగిపోయాడు. గుంటూరు లలిత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ పీవీ రాఘవశర్మ పేరిట సర్టిఫికెట్ సృష్టించిన నేపథ్యంలో.. ఆ వైద్యుడి వాంగ్మూలాన్ని రికార్డు చేయించి పంపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తిని హైకోర్టు ఆదేశించింది. అది అందిన తర్వాతే బోరుగడ్డ బెయిల్ పిటిషన్‌పై విచారణ జరుపుతామని స్పష్టంచేసింది. ఈ క్రమంలో బోరుగడ్డ మధ్యంతర బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఆ పిటిషన్ శుక్రవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. నకిలీ పత్రాలు సమర్పించి బెయిల్ తీసుకున్నారనే ఆరోపణలపై హైకోర్టులో విచారణ జరుగుతున్నందున.. బెయిల్ అంశంపైనా అక్కడే తేల్చుకోవాలని ధర్మాసనం ఆదేశించింది. పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించింది. కాగా, బోరుగడ్డ అనిల్ కేసును అనంతపురం జిల్లా ఫ్యామిలీ కోర్టు మే 9వ తేదీకి వాయిదా వేసింది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు అనంతపురం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్లో అతడిపై కేసు నమోదైంది.

పైలట్ అనిల్ 2న విచారణకు రావాల్సిందే

- జగన్ పర్యటనలో హెలికాప్టర్ ఘటనపై విచారణకు పిలుపు

పుట్టపర్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పాపిరెడ్డిపల్లికి మాజీ సీఎం జగన్ వచ్చిన సమయంలో కుంటిమద్ది హెలికాప్టర్ వద్ద చోటు చేసుకున్న ఘటనలపై విచారించేందుకు పైలట్ అనిల్ కుమార్‌కు పోలీసులు రెండో నోటీసు జారీ చేశారు. మే 2న చెన్నేకొత్తపల్లిలోని రామగిరి పోలీసు సర్కిల్‌కార్యాలయానికి కచ్చితంగా రావాలని నోటీసు ఇచ్చారు.

కసిరెడ్డి రిమాండ్ ఉత్తర్వులపై పిటిషన్

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో రాజ్ కసిరెడ్డికి రిమాండ్ విధిస్తూ ఏసీబీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించి, రద్దు చేయాలని కోరుతూ ఆయన తండ్రి ఉపేందర్‌రెడ్డి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని అత్యవసరంగా విచారించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది అభ్యర్థించడంతో, ధర్మాసనం లంచ్‌మోషన్‌గా విచారణకు స్వీకరించింది. విచారణ ప్రారంభమైన వెంటనే ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) టి.విష్ణుతేజ స్పందిస్తూ.. పిటిషన్ కాపీ తమకు అందలేదన్నారు. లంచ్‌మోషన్ సమాచారం కూడా తమ వద్ద లేదన్నారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం నిందితుడు రాజ్ కసిరెడ్డి ఇప్పటికే జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్నారని, పిటిషన్‌పై సోమవారం విచారణ జరుపుతామని స్పష్టంచేసింది.

కసిరెడ్డిని పది రోజులు కస్టడీకి ఇవ్వండి.. సిట్ పిటిషన్

విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో కీలక సూత్రధారిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డిని పది రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. డిస్టలరీ కంపెనీల నుంచి వసూలు చేసిన డబ్బులు ఎక్కడెక్కడకు ఏయే మార్గాల ద్వారా వెళ్లాయో రాబట్టడానికి అయన్ను విచారించాలని నివేదించారు.

రూ.5 కోట్లు ఇస్తారా.. ఫైన్ కడతారా?



50 కోట్లు

- స్టోన్ క్రషర్ యజమానికి రజని బెదిరింపు
- వదిన తరపున ఒత్తిడి పెంచిన మరిది విడదల గోపి
- రిమాండ్ రిపోర్టులో ఏసీబీ వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): 'మీరు ఇబ్బంది లేకుండా వ్యాపారం చేసుకోవాలంటే నాకు 5కోట్లు ఇవ్వండి.. లేదంటే 50 కోట్లు జరిమానా చెల్లించేందుకు సిద్ధంగా ఉండండి' అంటూ మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు విడదల రజని స్టోన్ క్రషర్ యజమాని చలపతిరావును బెదిరించినట్లు న్యాయస్థానానికి ఏసీబీ తెలియజేసింది. తన మరిది విడదల వేణుగోపీనాథ్ అలియాస్ గోపి, నాటి ప్రాంతీయ విజిలెన్స్ అధికారి పల్లె జాషువా(ఐపీఎస్), పీఏ రామకృష్ణ ద్వారా అధికార దుర్వినియోగానికి, బెదిరింపులకు పాల్పడినట్లు స్పష్టం చేసింది. ఈ కేసులో మూడో నిందితుడైన గోపిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచిన ఏసీబీ అధికారులు.. రిమాండ్ రిపోర్ట్ కూడా సమర్పించారు. 'చిలకలూరిపేట వైసీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన విడదల రజని తన నియోజకవర్గంలోని యడ్లపాడు వద్ద స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్న చలపతిరావును 2020 సెప్టెంబరు 4న రూ.5కోట్లు డిమాండ్ చేశారు. తాను సక్రమంగా వ్యాపారం చేస్తున్నానని, అన్యాయంగా 5కోట్లు చెల్లించలేనని వ్యాపారి స్పష్టంచేశారు. డబ్బులు ఇవ్వకుంటే వ్యాపారం మూసేసుకోవాలని రజని తరఫున మరిది గోపి హుకుం జారీ చేశారు. మరోవైపు ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు రామకృష్ణ సైతం ఫోన్లు చేసి ఇబ్బంది పెట్టాడు. ఈ క్రమంలో రజని అప్పటి గుంటూరు విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పల్లె జాషువాను రంగంలోకి దించి తనిఖీల పేరుతో హడలెత్తించారు. విజిలెన్స్ ఉన్నతాధికారులకు చెప్పకుండా, ఎలాంటి అనుమతీ తీసుకోకుండా జాషువా తనిఖీల ద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. దిక్కుతోచని స్థితిలో క్రషర్ వ్యాపారి రూ.2 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించారు. 2021 మార్చిలో రజని ఇంటికెళ్లి గోపి చేతికి ఆ మొత్తం నగదు అందజేశారు. డబ్బు అందిందని రజనికి గోపి ఫోన్‌చేసి నిర్ధారించారు. ఆ తర్వాత తమకు కూడా చెరో పది లక్షలు ఇవ్వాలని చలపతిరావును గోపి, జాషువా డిమాండ్ చేశారు. దీంతో వారికి నగదు రూపంలో చెల్లించారు. విషయం ఎక్కడ చెప్పినా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటావని గోపి, జాషువా బెదిరించడంతో చలపతిరావు మిన్నకుండిపోయారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే ఫిర్యాదు చేశారు. విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించిన ప్రభుత్వం నివేదిక అందిన తర్వాత చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏసీబీని ఆదేశించింది. కేసు నమోదు చేసిన ఏసీబీ... ప్రాథమిక దర్యాప్తు చేసి విడదల గోపి బెదిరింపులపై ఆధారాలు సేకరించారు. హైదరాబాద్‌లో ఉన్న అతడిని అరెస్టు చేశారు' అని రిమాండ్ రిపోర్టులో వివరించారు.

ఏసీబీ కస్టడీ, గోపి బెయిల్ పిటిషన్లపై 28న విచారణ

విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విడదల రజని మరిది గోపిని వారంపాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు కోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. ఆయన వసూలు చేసిన డబ్బులు ఏయే మార్గాల్లో ఎవరెవరికి చేరాయో తేల్చడానికి కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇంకోవైపు.. జైలులో ఉన్న తనకు బెయిల్ మంజూరు చేయాలని గోపి కోర్టును కోరారు. ఆయన తరఫున న్యాయవాది మన్మథరావు పిటిషన్ వేశారు. రెండు పిటిషన్లపై విచారణను ఏసీబీ న్యాయస్థానం ఈనెల 28వ తేదీకి వాయిదా వేసింది.

అరెస్ట్ నుంచి విడదల రజినికి రక్షణ



విజిలెన్స్ తనిఖీ పేరుతో స్టోన్ క్రషర్ యజమానిని బెదిరించి రూ.2.20 కోట్లు వసూలు చేశారని నమోదైన కేసులో మాజీ మంత్రి విడదల రజని, ఆమె పీఏ రామకృష్ణకు అరెస్ట్ నుంచి హైకోర్టులో ఉపశమనం లభించింది. వీరిద్దరికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3)(సీఆర్‌పీసీ సెక్షన్ 41(ఏ)) కింద నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని ఏసీబీ అధికారులను ఆదేశించింది. దర్యాప్తునకు సహకరించాలని, కేసుకు సంబంధించిన విషయాలను బయట మాట్లాడవద్దని పిటిషనర్లకు షరతులు విధించింది. దర్యాప్తునకు ఆటంకం కలిగించవద్దని, సాక్షులను ప్రభావితం చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. వారం రోజుల్లో నివాస వివరాలను అఫిడవిట్ రూపంలో దర్యాప్తు అధికారికి అందజేయాలని పేర్కొంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న విడదల రజని మరిది గోపిని పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఆయన వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను నిరర్థకమైనదిగా ప్రకటించింది. ముందస్తు బెయిల్ పిటిషన్లను పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఉత్తర్వులు ఇచ్చారు. విజిలెన్స్ తనిఖీ పేరుతో తనను బెదిరించి రూ.2.20కోట్లు అక్రమంగా వసూలు చేశారని పల్నాడు జిల్లా యడ్లపాడులోని లక్ష్మీబాలాజి స్టోన్ క్రషర్ మేనేజింగ్ పార్ట్నర్ నల్లపనేని చలపతిరావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విడదల రజని, మరికొందరిపై ఏసీబీ కేసు నమోదు చేసింది.

బెయిల్ కోసం కోర్టులో పీఎస్ఆర్ పిటిషన్



విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముంబై సినీనటి కాదంబరి జెత్వానీపై వేధింపుల కేసులో విజయవాడ జిల్లా కారాగారంలో ఉన్న నిఘా విభాగం మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫున న్యాయవాది విష్ణువర్ధన్ ఈ పిటిషన్‌ను రెండో అదనపు జిల్లా కోర్టులో దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం మహిళా సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ అయింది. విచారణను కోర్టు ఈనెల 29వ తేదీకి వాయిదా వేసింది.

ప్రత్యేక సెల్ మాత్రమే ఇవ్వగలం

భద్రత దృష్ట్యా పీఎస్ఆర్ ఆంజనేయులుకు జైలులో ప్రత్యేక సెల్ మాత్రమే కేటాయించగలమని బెజవాడ జిల్లా జైలు అధికారులు కోర్టుకు తెలిపారు. తనకు జైలులో ప్రత్యేక గది, మంచం కేటాయించడంతోపాటు ఇంటి నుంచి భోజనం, తాగునీరు, మందులను అనుమతించాలని కోరుతూ ఆయన మూడో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు జైలు అధికారులకు నోటీసు జారీ చేసింది. దీనిపై వారు న్యాయస్థానానికి నివేదిక సమర్పించారు. భద్రతా కారణాల వల్ల పీఎస్ఆర్‌కు ప్రత్యేక సెల్ కేటాయించగలమని.. మిగిలిన వసతులు మాత్రం కల్పించలేమని పేర్కొన్నారు.

మూడు మాఫియాల పగ!

- వీరయ్య చౌదరి హత్య వీరి పనే
- ఇసుక, లిక్కర్, రేషన్ మాఫియాల హస్తం
- కీలక ఆధారాలు సేకరించిన పోలీసులు

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్య కేసులో పోలీసులు కీలక ఆధారాలు సేకరించారు. హంతకులు వాడిన స్కూటీని గుర్తించారు. స్థానికంగా ఉన్న లిక్కర్ మాఫియా, రేషన్ మాఫియా, ఇసుక మాఫియాకు చెందిన వారే వీరయ్య హత్యకు కుట్ర పన్నినట్లు గుర్తించినట్లు తెలిసింది. వీరి వెనుక కొందరు రాజకీయ నేతలూ ఉన్నట్లు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు చెందిన వీరయ్య చౌదరి మంగళవారం రాత్రి ఒంగోలులో దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. సీఎం చంద్రబాబు దీనిపై తీవ్రంగా స్పందించారు. స్వయంగా వెళ్లి ఆయనకు నివాళులు అర్పించారు. హంతకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. వీరయ్య చౌదరి స్వగ్రామానికి చెందిన అమ్మనబ్రోలుకే చెందిన ఆయన రాజకీయ ప్రత్యర్థిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వీరయ్య రాజకీయంగా ఎదుగుతుండటాన్ని జీర్ణించుకోలేకపోవడం, 'లిక్కర్' విక్రయాలకు అడ్డు రావడం వంటి కారణాలతో... నలుగురితో కలిసి ఈ హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. అతనితోపాటు రేషన్ బియ్యం అక్రమ రవాణా, ఇసుక అక్రమ రవాణాతో సంబంధమున్న మరో ఇద్దరి మధ్య కొన్నాళ్లుగా జరిగిన 'కాల్ డేటా'ను పోలీసులు పరిశీలించారు. వారి మధ్య వందలసంఖ్యలో ఫోన్ సంభాషణలు జరిగినట్లు గుర్తించారు.

సుపారీ తీసుకున్న స్కూటీ యజమాని

వీరయ్యను హత్య చేసిన నిందితులు ఉపయోగించిన తెల్ల స్కూటీని చీమకుర్తిలోని ఆర్ఎస్ దాబా వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ స్కూటీ ఒంగోలులోని అన్నవరపాడుకు చెందిన వినోద్ అనే వ్యక్తిదిగా గుర్తించారు. స్కూటీ యజమానే వీరయ్య చౌదరిని హత్య చేసేందుకు కాంట్రాక్టు (సుపారీ) తీసుకున్నట్లు భావిస్తున్నారు. వినోద్ సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. హత్య అనంతరం స్కూటీపై ఇరువురు దుండగులు పరారయ్యారని, ఒంగోలు నుంచి చీమకుర్తి వెళ్లి స్థానిక ఆర్ఎస్ దాబా వద్ద స్కూటీని వదిలేశారని సీసీ ఫుటేజ్ ద్వారా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. స్కూటీని వదిలేసిన నిందితులు ఈ నెల 23న రాత్రి 8.15 గంటలకు విజయవాడ నుంచి కనిగిరి వైపు వెళ్లే బస్సు ఎక్కారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.